
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
ఆదివారం 11 -3 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 72 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

ఇంత దారుణమా..!

- త్రిపుర హింసాకాండపై ఏచూరి
- పార్టీ కార్యకర్తల ఇండ్లు, కార్యాలయాల సందర్శన
- చారీలాం అసెంబ్లీ స్థానంలో పోటీ నుంచి ఉపసంహరణ



అగర్తల : త్రిపురలో సీపీఐ(ఎం) కార్యకర్తలు, కార్యాలయాలను అధికార బీజేపీ లక్ష్యంగా చేసుకొని విధ్వంసం సృష్టించిన ప్రాంతాలను సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారామ్ ఏచూరి సందర్శించారు. త్రిపురలో హిందుత్వశక్తులు తెగబడిన తీరు చూసి ఏచూరి చలించిపోయారు. దేశంలో ఎక్కడా లేని విధంగా త్రిపురలో జరిగిన హింసను కళ్లారా చూశాక..ఇంత దారుణానికి దిగుతారా అని ఏచూరి వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలను పరామర్శించి..వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అధికారపార్టీ పాల్పడుతున్న హింసాత్మక దాడుల నేపథ్యంలో చారీలాం అసెంబ్లీ నియోజక వర్గంలో జరిగే పోటీ నుంచి వామపక్ష కూటమి ఉపసంహరించుకుంది. సీపీఐ(ఎం) అభ్యర్థి రమేంద్ర నారాయణ దేవ్‌వర్మ మృతితో... 9లో



ఉక్కుపాదం

మిలియన్ మార్చ్‌పై అడుగడుగునా పోలీసు నిర్బంధం

- నిఘా నీడలో హైదరాబాద్
- అష్టదిగ్బంధనంలో ట్యాంక్‌బండ్, ఎస్పీకే

భాగ్యనగరంకర్ఫ్యూను తలపించింది. బ్యారికేడ్లమయమైంది. ట్రాఫిక్‌ను ఎందుకు మళ్లించారో అర్థంకాక ఇక్కట్లు,పాట్లు జనం వంతు అయ్యింది. చీమ చిటుక్కుమంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతున్నదన్న చర్చ షురూ అయ్యింది. నిరసనలంటే ప్రభుత్వానికి భయమెందుకన్న ప్రశ్న జనం నోట వినిపిస్తున్నది. ఉద్యమపార్టీ..ఉద్యమకాలంలో నిర్వహించిన మిలియన్ మార్చ్ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటే ప్రభుత్వానికెందుకు ఇంత అసహనం అన్న ప్రశ్నకు జవాబులేదు.ప్రజలు తమతోనే ఉన్నారంటూనే నిరసనలను అనుమతించని విచిత్ర పరిస్థితి నగరాన్ని ఆవహించింది. ఎటు చూసినా అరెస్టులు..హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకోసం తెలంగాణ జేఏసీ పిలుపు సందర్భంగా నెలకొన్న పరిస్థితి ఇది.



వివరాలు 9లో

జిల్లాల్లో జేఏసీ,వామపక్ష నాయకుల అరెస్టులు 9

ఫ్రాన్స్-ఇండియా
14 ఒప్పందాలు

- ఉన్నత సాంకేతికత,రక్షణ, రోదసి రంగాల్లో సహకారం



వివరాలు 2లో



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

విగ్రహాల కూల్చివేత
సహించం

బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

- దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలి : టీమాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ

వివరాలు 10లో

డీఎస్‌కు కాంగ్రెస్ గాలం?



రాహుల్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆంతరంగికుడు

- కొనసాగుతున్న సంప్రదింపుల పర్వం
- సీనియర్ నేతల అభిప్రాయాలు సేకరిస్తున్న అధిష్ఠానం

వివరాలు 9లో

బాలికపై లైంగికదాడి

నల్లగొండ జిల్లా దేవరకొండలో దారుణం

నవతెలంగాణ-దేవరకొండ

ఆడుకుంటున్న చిన్నారిని ఇంట్లోకి పిలిచి కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కుల గ్రామంలో శనివారం వెలుగులోకొచ్చింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... చిన్నారి(8) ఇంటి పక్కనే లారీ డ్రైవర్ ముక్రోజు భాస్కరాచారి ఇల్లు ఉంది. శుక్రవారం బాలిక ఇంటి ఎదుట ఆడుకుంటుండగా టీవీ చూడమని భాస్కరాచారి ఇంట్లోకి పిలిచాడు. ఇంట్లోకి వెళ్లిన బాలికపై లైంగిక దాడి చేశాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితునిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు క్యాబినెట్

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరుగనున్న నేపథ్యంలో ఆదివారం మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలపడం, బడ్జెట్ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి.. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం, ప్రభుత్వ పథకాల అమలు తీరు తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ఎందుకు విరమించుకున్నారని ప్రతిపక్షాలు సభలో నిలదీసే అవకాశం ఉందని, ఎందుకు విరమించుకోవాల్సి వచ్చిందన్న అంశాన్ని వివరించేందుకు సీఎం కేసీఆర్ మంత్రులకు సూచనలు చేయనున్నట్టు తెలిసింది. 2018-19 వార్షిక బడ్జెట్ కేటాయింపుల పై విపక్షాలు చేసే విమర్శలపై అధికార పక్ష సభ్యులు దూకుడుగా వ్యవహరించకుండా ప్రభుత్వ లక్ష్యమేంటో వివరించేందుకు ...9లో

మండే ఎండలు

వారం రోజులుగా 37 డిగ్రీలు

- మార్చిలోనే ఉక్కిరి బిక్కిరవుతున్న నగరవాసులు
- ఏప్రిల్, మే నెలలను తలచుకుంటేనే గుబులు
- గతేడాది మార్చిలో ఎండల్లేవ్

నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

మార్చి నెలలోనే ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 దాటగానే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జనం ఎండకు తాళలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే నగరంలో పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలకు చేరింది. ఇక ఏప్రిల్, మే నెలలను తలుచుకుంటేనే గుబులు పుడుతోంది. గతేడాది మార్చి నెలలో అసలు ఎండలే లేకపోవడం గమనార్హం. ఈ వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒక డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదవుతాదని హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ వైకె రెడ్డి చెప్పారు. కొన్ని రోజుల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగే అవకాశం కూడా ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ఏడాదికేడాది ఎండల తీవ్రత పెరుగుతోంది. గతేడాది నగరంలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది మార్చిలో ...9లో



దేశవ్యాప్తం చేస్తారు.. కుదిరితే ప్రపంచ వ్యాప్తం చేస్తారు.. మనదాక చేయరులేరా..!!



నిషా దించుతున్నారు

- నాలుగు రోజుల్లో 630 మందిపై చార్జిషీట్

9లో

మైనార్టీలకు చదువు
సాయం దూరం

మోడీ ప్రభుత్వ నిర్ణయం

కేంద్రంలో మైనార్టీల సంక్షేమం విషయంలో సర్కారు తీరు నోటితో బుజ్జగిస్తూ చేతల్లో శీతకన్ను సర్వసాధారణంగా మారిపోయింది. గత జనవరిలో మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ ఒక సందర్భంలో మాట్లాడుతూ, అన్ని వర్గాలకూ సమానావకాశాలు తమ ప్రత్యేకత అని ఘనంగా చెప్పుకున్నారు. అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం ఆచరణలో మాత్రం మైనార్టీలకు, ముఖ్యంగా విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పులు, ఇతరత్రా అందించాల్సిన ఆర్థిక సాయం నానాటికీ దిగజారిపోతోంది.

9లో



విద్యార్థుల ఆందోళనలను వ్యతిరేకిస్తూ జేఎన్‌యూ విడుదల చేసిన

ఆ స్టేట్‌మెంట్‌పై మేం సంతకాలు పెట్టలేదు

స్పష్టం చేసిన ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్త

న్యూఢిల్లీ: అటెండెన్స్ తప్పనిసరిచేస్తూ జవహర్‌లాల్ యూనివర్సిటీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనను తప్పుపడుతూ ఆ కళాశాల యాజమాన్యం విడుదల చేసిన ప్రకటనపై తాము సంతకాలు పెట్టినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఖండించారు. ఆ స్టేట్‌మెంట్‌పై తాము సంతకం పెట్టలేదని ముగ్గురు శాస్త్రవేత్తలు, ఒక విద్యావేత్త ప్రకటించారు. జేఎన్‌యూ విడుదల చేసిన ఆ ప్రకటనపై తాము సంతకాలు పెట్టలేదని గ్రీన్ రివల్యూషన్ మార్గదర్శిగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ జన్యుశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, అణుశాస్త్రవేత్త అనిల్ కకోడ్కర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ గోవర్ధన్ మెహత, ఢిల్లీ మెట్రో మేనేజింగ్ మాజీ డైరెక్టర్ ఇ శ్రీధరన్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ కె జి సురేష్‌లు స్పష్టం చేశారు.

'ఆ ప్రకటన గురించి నేను వినడం ఇదే మొదటిసారి. నన్ను ఎవరూ సంప్రదించలేదు. అది విపరీతమైనది' అని స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కాగా, దానిపై సంతకం పెట్టింది ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన విజ్ఞాన భారతి ఫ్రంట్ అని, దానికి తాను ప్యాట్రన్‌గా ఉన్నను తప్ప తాను సంతకం చేయలేదని ఇస్రో మాజీ చైర్‌పర్సన్ జి మాధవన్ నాయర్ తెలిపారు. అలాంటి ఏ ప్రకటనపై తాను సంతకం చేయలేదని కక్కోడ్కర్ కూడా స్పష్టం చేశారు. 'జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ నుంచి తనకు ఒక ఈ-మెయిల్ వచ్చింది. అయితే నేను దానికి ఎలాంటి స్పందనా ఇవ్వలేదు' అని మెహతా తెలిపారు.

ఆ స్టేట్‌మెంట్‌లో ఏముంది?

'క్లాసులకు హాజరుకావాలన్న కనీస అర్హతకు వ్యతిరేకంగా కొందరు విద్యార్థులు చేస్తున్న ప్రచారాన్ని మేం ఖండిస్తున్నాం. ప్రస్తుత నాయకత్వంలో ప్రస్తుత విద్యా సంవత్సరం త్వరగా పునరుద్ధరణ జరుగుతుందని మేం ఆశిస్తున్నాం' అని ప్రముఖులతో పేర్లతో జేఎన్‌యూ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేసింది.

కాలు మీద కాలేసుకొని...

రైతు సమస్యలను విన్నవించేందుకు ప్రముఖ సినీ నటులు ప్రకాశ్‌రాజ్, విశాల్ బృందం కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీని కలిసింది. సీనియర్ నటుడైన ప్రకాశ్‌రాజ్‌ను కనీసం కూర్చోమని కూడా చెప్పకుండా జైట్లీ మాత్రం కాలుమీద కాలువేసుకొని వారి వినతిపత్రాన్ని తీసుకున్నారు. జైట్లీ ఆ వినతిపత్రాన్ని చదువుతున్నంత సేపూ ప్రకాశ్‌రాజ్, ఆ బృందంలోని ఇతరులు చేతులు కట్టుకుని నిలబడే ఉన్నారు.



జేఎన్‌యూలో అటెండెంటన్స్ తప్పనిసరి

98 శాతం మంది విద్యార్థుల వ్యతిరేకత

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అటెండెన్స్ తప్పనిసరిచేస్తూ పాలనా యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని 98 మంది విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. జేఎన్‌యూఎస్‌యూ నిర్వహించిన రిఫరెండంలో అటెండెన్స్ తప్పనిసరిని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఓటువేశారు. 4,456 మంది విద్యార్థులు రిఫరెండంలో పాల్గొనగా 4,388 మంది (98.7శాతం) వ్యతిరేంకగా ఓటువేశారు. అనుకూలంగా 41 (0.92శాతం) ఓట్లు పోలయ్యాయి. 27 ఓట్లు చెల్లలేదు. జవాబుదారీతనానికి తాము వ్యతిరేకులం కాదనీ, కానీ తప్పనిసరి అటెండెన్స్ తమ పరిశోధనలకు పరిమితులు విధిస్తుందనీ విద్యార్థులు తెలుపుతున్నారు. ఈ కొత్త మార్గదర్శకాలు చాలా కఠినంగా ఉన్నాయనీ, శిక్షాత్మక చర్యలను ప్రవేశపెడుతున్నారనీ విద్యార్థుల అభిప్రాయపడుతున్నారు.



కొనసాగుతున్న విగ్రహాలపై విధ్వంసకాండ

యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

లక్నో: దేశంలో విగ్రహాల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. గత కొన్ని రోజులుగా విగ్రహాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అజాంగఢ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అంబేద్కర్ విగ్రహం తలభాగాన్ని ధ్వంసం చేశారు. సమాచారమందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో శుక్రవారం సుభాష్ చంద్రబోస్ విగ్రహంపై ఎరుపు రంగు పోసిన విషయం తెలిసిందే.

కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడుతున్న పాక్ దళాలు

శ్రీనగర్ : జమ్ము కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడివున్న పూంచ్‌సెక్టార్‌లో శనివారం ఉదయం పాకిస్తాన్ దళాలు పెద్ద ఎత్తున కాల్పులకు పాల్పడ్డాయని అధికారులు తెలిపారు. రక్షణ శాఖ వర్గాల ప్రకారం చిన్న ఆయుధాలు, ఆటోమేటిక్, మోర్టార్లతో పాకిస్తాన్ దళాలు మన్‌కోట్ ప్రాంతంలోని పౌరులను, రక్షణా సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని కాల్పులకు పాల్పడ్డాయని తెలిపారు. భద్రతా సిబ్బంది సమర్థవంతంగా తిప్పికొట్టారని పోలీసులు తెలిపారు.

సురేష్‌ప్రభుకు పౌరవిమానయానం

అదనపు బాధ్యతలుగా అప్పగింత

బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆశలపై నీళ్లు?

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేష్ ప్రభుకు అదనపు బాధ్యతగా పౌర విమానయాన మంత్రిత్వశాఖను ప్రధాని మోడీ కేటాయించారు. పీఎం సూచన మేరకు సురేష్ ప్రభుకు పౌరవిమానయాన శాఖ కేటాయించినట్టు రాష్ట్రపతి కార్యాలయం శనివారం ఓ ప్రకనటనలో పేర్కొంది. ప్రత్యేక హోదా డిమాండ్‌తో టీడీపీ ఎంపీ అశోకగజపతిరాజు రెండు రోజుల క్రితం ఈ పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల్లో హామీనిచ్చిన ప్రత్యేక హోదా హామీని బీజేపీ సర్కారు విస్మరించిందనే నిరసనతో అశోకగజపతిరాజుతో పాటు వైఎస్ చౌదరి కేంద్రమంత్రివర్గం నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. అయితే ఏపీ నుంచి ఇద్దరు రాజీనామా చేసిన నేపథ్యంలో.. అదే రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలకు మంత్రివర్గంలో బెర్త్ దక్కుతుందని ఊహాగానాలు వినిపించాయి. చివరిసారి జరిగిన మంత్రివర్గ పునర్వవ్యస్థీకరణలోనూ బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుకు కేంద్రమంత్రివర్గంలో స్థానం దక్కుతుందని భావించారు. కానీ చివరి నిమిషంలో హైకమాండ్ షాకిచ్చింది. తుది జాబితాలో ఆయన పేరును చేర్చలేదు. ప్రస్తుత రాజీనామాల నేపథ్యంలో హరిబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటారని ఆశించారు. కానీ ఈసారి కూడా హరిబాబు ఆశలపై నీళ్లుచల్లుతూ.. టీడీపీ మద్దతుతో ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేష్ ప్రభుకు అదనపు బాధ్యతగా పౌర విమానయానశాఖ కేటాయించడం గమనార్హం.

సామూహిక లైంగిక దాడిని చిత్రీకరించి..

సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసి

రాజస్థాన్‌లో దుండగుల దుశ్చర్య

జైపూర్: ఓ మహిళ(40) పై సామూహిక లైంగిక దాడికి తెగబడిన దుండగులు ఘటనను చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ఘటన రాజస్థాన్‌లోని బరన్ జిల్లాలో నెల క్రితం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..కోటలోని ఓ దాబాలో బాధిత మహిళ పనిచేస్తుండేది. బంధువుల ఇంటికి వెళ్లడానికి ఆ మహిళ నెల క్రితం బరాన్‌కు చేరింది. చేతన్ మీనన్(21) అనే తెలిసిన వ్యక్తి ఆమెను మోటార్ బైక్ మీద బంధువుల ఇంటి వద్ద దింపుతానని నమ్మబలికి ఓ నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. కానీ, అప్పటికే అక్కడ మిగతా ఐదుగురు దుండగులు ఉన్నారు. అనంతరం ఆరుగురు ఆమె పై సామూహిక లైంగిక దాడికి దిగి ఘటనను వారి మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. కాగా, విషయం బయటకు చెప్తే కుటుంబసభ్యులను చంపేస్తామని దుండగులు బెదిరించి తరువాత రోజు బంధువుల ఇంటి వద్ద మహిళను విడిచిపెట్టారు. అయితే సామాజిక మాధ్యమంలో ఘటన పోస్ట్ అయిన విషయం తెలుసుకున్న బాధితురాలు స్థానిక మహిళా పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 5న ఫిర్యాదు చేసింది. దీంతో ఘటనతో సంబంధమున్న ఆరుగురు నిందితుల పై పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసుల నమోదు చేశారు.కాగా నిందితుల్లో ఇప్పటి వరకు ఎవరూ అరెస్ట్ కాలేదు. బాధితురాలి వాంగ్మూలాన్ని సోమవారం మేజిస్ట్రేటు ముందు పోలీసులు ప్రవేశపెట్టనున్నారు. కాగా ఈ కేసును జిల్లా డీఎస్పీకి అప్పగించారు.

ఫ్రాన్స్-ఇండియా మధ్య 14 ఒప్పందాలు

- ఉన్నత సాంకేతికత,రక్షణ, రోదసి రంగాల్లో సహకారం
- నేల నుంచి ఆకాశం వరకూ అన్నింటా మైత్రీ బంధం : ప్రధాని మోడీ
- ఉగ్రవాదంపై కలిసి పోరాడుతాం : ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్



న్యూఢిల్లీ: భారత్-ఫ్రాన్స్ మధ్య సంబంధాలు నేల నుంచి గగన తలానికి చేరుకున్నాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ వచ్చిన సందర్భంగా ఇరు దేశాలు శనివారం 14 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ద్వైపాక్షిక చర్చల అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. రక్షణ, రోదసి, ఉన్నత సాంకేతికత అంశాలపై ఒప్పందాలు కుదిరినట్టు ప్రధాని తెలిపారు. నేల నుంచి ఆకాశం వరకూ ఇరు దేశాలు కలిసి పని చేయని అంశాలు ఏమీ లేవని ప్రధాని అన్నారు.

హిందూ మహాసముద్రంలో విస్తృత,వ్యూహాత్మక సహకారానికి ఇరువురు నేతలు ప్రాధాన్యతనిచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలోని సముద్ర జలాల్లో ఇరు దేశాల యుద్ధ నౌకల రాకపోకల కోసం నౌకా స్థావరాలను స్వేచ్ఛగా వాడుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సముద్ర ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని నియంత్రించే లక్ష్యంతోనే ఇరుదేశాలు సహకరించుకోవాలని నిర్ణయించినట్టు రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వలస విధానంలో ఫ్రాన్స్‌తో భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు భారత్ సిద్ధంగా ఉన్నదని ప్రధాని తెలిపారు. ఇరుదేశాల మధ్య రక్షణ సహకారం కోసం చారిత్రక ఒప్పందం కుదరడం సంతోషం కలిగిస్తోందని ప్రధాని అన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్‌ను ఆహ్వానించినట్టు ప్రధాని తెలిపారు.

మన వ్యూహాత్మక సంబంధాలు 20 ఏండ్ల నుంచి..కానీ, మన రెండు దేశాల మధ్య ఆధ్యాత్మిక భాగస్వామ్యం శతాబ్దాల పాతదని ప్రధాని మోడీ అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రాన్స్‌లోనే కాకుండా భారత రాజ్యాంగంలోనూ పొందుపరిచామంటూ చరిత్రాత్మక ఫ్రెంచ్ విప్లవ నినాదాలను ప్రధాని గుర్తు చేశారు. ఇరు దేశాల ప్రజలు ఒకరి గురించి ఒకరు మరింత తెలుసుకోవాలని ప్రధాని సూచించారు. మన రెండు దేశాలు సుస్థిరతకు వారసులుగా నిలవాలని ప్రధాని ఆకాంక్షించారు. భూగోళం భవిష్యత్ కోసం నిర్వహిస్తున్న అంతర్జాతీయ సౌర కూటమి సదస్సు విజయవంతం అవుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియా-ఫ్రాన్స్ ఉమ్మడి భాగస్వామ్యంలో ఆదివారం జరగనున్న ఈ సదస్సులో 23 దేశాల అధినేతలు, 10 దేశాల మంత్రివర్గాల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యత ఉన్నదన్నారు. ఉగ్రవాదం,తీవ్రవాదంపై కలిసి పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

ఓటర్ కార్డులతో 32 కోట్ల 'ఆధార్' అనుసంధానం పూర్తి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓ పి రావత్

బెంగళూరు: దాదాపు 32కోట్ల ఆధార్ నంబర్లను ఓటర్ ఐడీ కార్డులతో అనుసంధానించామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓ పి రావత్ శనివారం వెల్లడించారు. అసోసియేషన్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) ఎన్జీవో 14వ నేషనల్ కాన్ఫరెన్స్‌కు రావత్ హాజరయ్యారు. సుప్రీంకోర్టు అనుమతించిన వెంటనే మరో 54.5కోట్ల ఆధార్ నంబర్లను అనుసంధానిస్తామని తెలిపారు. 32 కోట్ల ఆధార్ అనుసంధానాన్ని కేవలం మూడు నెలలో పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై వెలుబుచ్చిన సందేహాలకు.. విశ్వసనీయ ఫిర్యాదులను విచారించి పరిష్కరిస్తామని రావత్ చెప్పారు. పోలింగ్‌కేంద్ర స్థాయి ఓట్ల లెక్కింపు స్థానంలో టోటలైజర్ మెషీన్(దాదాపు 14 పోలింగ్ బూత్‌ల ఓట్లను లెక్కించే పరికరం) లెక్కించడంపై సందేహాలకుగాను ఈ విధానాన్ని మార్చే అధికారం తమకు లేదని, నిబంధనలను సవరించాల్సి ఉంటుందని చెప్పాడు. న్యాయమైన, విశ్వసనీయమైన ఎన్నికలను అందించడమే తమ లక్ష్యమని కర్నాటక ఎన్నికలపై స్పందించారు. అలాగే గతనెల 20న విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ఏవైన తప్పులు దొర్లితే తమ దృష్టికి తీసుకురావాలని, సమీక్షించి సరిచేస్తామని ఆయన తెలిపారు.

మొక్కవోని దీక్షతో ముందుకు...

12న లక్ష మందితో అసెంబ్లీని ముట్టడించనున్న లాంగ్‌మార్చ్



ముంబయి : మండుతున్న ఎండ... అయినా మొక్కవోని దీక్ష... తలకు ఎర్ర టోపీలు ధరించి.. చేతిలో ఎర్రజెండాలు పట్టుకొని... మహాయాత్ర వడివడిగా ముందుకుసాగుతున్నది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న ప్రారంభమైన నాసిక్ టు ముంబయి మహా యాత్ర ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నది. ఈ యాత్ర థానే జిల్లా బివాండీకి శనివారం చేరుకుంది. అంటే.. ముంబయికి సుమారు 80 కిలో మీటర్ల దూరంలో సాగుతున్నది. 'ఆదివారం సాయంత్రానికి ముంబయి సిటీకి చేరుకుంటాం. మా సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నది. సోమవారం అసెంబ్లీని ముట్టడించి తీరుతాం. మా సమస్యలు పరిష్కారమయ్యేవరకూ అసెంబ్లీని వీడేది లేదు' అని ఈ యాత్రలో పాల్గొంటున్న టోలా రామ్ అనే రైతు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఈ యాత్ర ముంబయిలోని రాష్ట్ర అసెంబ్లీకి ఈ నెల 12న చేరుకోనున్నది. ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) నేతృత్వంలో 180 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రను దాదాపు 30 వేల మంది రైతులు చేపట్టిన విషయం తెలిసిందే. ఆది, సోమవారాల్లో మరింత మంది రైతులు తమ యాత్రలో కలుస్తారనీ, మొత్తం లక్ష మంది రైతులు అసెంబ్లీని ముట్టడిస్తారని నాయకులు చెబుతున్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోతున్న తమను ఆదుకోవాలని, స్వామినాథన్ సిఫారసులను అమలుచేయాలని, ఎలాంటి షరతులూ లేకుండా రుణ మాఫీచేయాలని రైతులు ఈ ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావ్లే, స్థానిక ఎమ్మెల్యే జెపి జవిత్, ఇతర నాయకులు ఈ 'లాంగ్ మార్చ్'కు నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ అసెంబ్లీ ప్రాంగణాన్ని వీడేదిలేదని రైతులు స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నడుస్తున్నాయి.

టీ తోటల్లో మరణాలపై మెజిస్టీరియల్ విచారణ

న్యూఢిల్లీ : ఆకస్మిక అనారోగ్యాల కారణంగా నెల రోజుల వ్యవధిలో అస్సాంలోని గోలాఘాట్ జిల్లా టీ తోటలో పనిచేస్తున్న కుటుంబాల్లో 21 మంది మరణించారు. వీరిలో 18 నెలల చిన్నారి కూడా ఉన్నారు. వీరందరూ జిల్లాలోని టీ తోటల్లో పనిచేస్తూ డోయాంగ్ టీ ఎస్టేట్ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. ఈ మరణాలపై విచారణ చేయాలని మెజిస్టీరియల్‌కు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం, ఫిబ్రవరి 3 నుండి ప్రారంభమైన మరణాలు మార్చి 6కి 21 కు చేరుకున్నాయి. ఆకస్మిక వాంతులు, అధిక రక్తపోటు, జ్వరం వంటి లక్షణాలతో వారు మృతి చెందారు. ఈ మరణాలతో భయానికి గురైన కార్మికులు గార్డెన్ దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేయించుకుంటున్నారు. ఇక్కడ ఆసుపత్రిలో సరైన సదుపాయాలు లేవనీ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇక్కడికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలాఘాట్ సివిల్ హాస్పిటల్‌కు వెళ్ళాల్సి వస్తుందని కార్మికులు ఆరోపించారు. రోగులను తోటయజమానులు గోలాఘాట్ ఆసుపత్రికి తరలించటానికి ఎటువంటి సహాయం అందించలేదని, మెరుగైన వైద్యసదుపాయాలు లేనందువల్లే వారు మరణించారని ఆరోపించారు.

కార్మికుల మరణాన్ని సహజ మరణంగా చూపిస్తూ జిల్లా ఆరోగ్య శాఖ నివేదికలో పేర్కొనడం నిజాలను దాస్తోందని, ఒక నెలలో 21 మంది చనిపోవడం ఎలా సహజం అవుతుందని స్థానిక కార్మిక హక్కుల సంస్థ జీపుల్ కృషక్ శ్రామిక్ సంగ్(జెకెఎస్-ఎస్)చెందిన సోనేశ్వర్ నరాహ్ ప్రశ్నించారు. తక్షణమే పోస్ట్ మార్టం చేసి పాథోలాజికల్ రిపోర్టుల్లో నిజాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

రజనీ మళ్ళీ హిమాలయాల 'బాట'



చెన్నై : రాజకీయ వేత్తగా మారిన సూపర్ స్టార్ రజనీకాంత్ శనివారం హిమాలయాల యాత్రకు వెళ్ళారు. దశాబ్దకాలంగా ప్రతి సంవత్సరం ఆయన హిమాలయాలకు వెళ్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని డునగిరి గుహలకుచేరకుని అక్కడ ధ్యానం చేసుకుంటూ సాధువులతో గడుపుతారు. రజనీకాంత్ అంతకుముందు జరిపిన హిమాలయాల యాత్రలన్నీ ఆయన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలతో ముడిపడి ఉన్నాయి. ఆయన ప్రస్తుతం రాజకీయ రంగంలోకి అడుగిడుతున్న తరుణంలో హిమాలయాలు సందర్శించడం విశేషం.

శిశు జననాల రేటులో

ఏటేటా పెరుగుతున్న అంతరాలు

బేటీ బచావో అమలైన చోటా కనిపించని ప్రభావం

- రాజస్థాన్‌లో 1000మంది బాలురకు 861మంది బాలికలు
- మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచకుండా మార్పు రాదంటున్న సామాజికవేత్తలు

నవతెలంగాణ, జనరల్‌డెస్క్

బేటీ బచావో-బేటీ పడావో పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్రధాని నరేంద్రమోడీ రాజస్థాన్‌లోని ఝున్‌ఝున్ జిల్లాను ఎంచుకోవడానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. గురువారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బేటీ బచావో కార్యక్రమాన్ని 161 జిల్లాల నుంచి 640 జిల్లాలకు విస్తరిస్తున్నట్టు ప్రధాని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని 2015లో ప్రారంభించినపుడు ఎంపిక చేసిన 100 జిల్లాల్లో ఝున్‌ఝున్ కూడా ఉన్నది.

రాజస్థాన్‌లో లింగ నిష్పత్తి అధ్వాన్నంగా ఉన్న [illegible] అది ఒకటని అక్కడి అధికారి ఒకరు తెలిపారు. 201[illegible] జనగణన ప్రకారం ఝున్‌ఝున్ జిల్లాలోని [illegible]శువుల 1000మంది బాలురకు 837మంది మాత్రమే బాలికలు. 2017 డిసెంబర్ వరకల్లా 1000 మంది బాలురకు 955మంది బాలికలుగా రికార్డయినట్టు చెబుతున్నారు. అయితే,అది శిశువుల జననాలను ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసిన లెక్క. దేశంలో జననాలను నమోదు చేయడం పూర్తిస్థాయిలో జరగడంలేదన్నది గమనార్హం. 2021 జనగణన తర్వాత మరోసారి వాస్తవాలు బయటపడనున్నాయి. 2015లో ప్రారంభించిన బేటీ బచావో ఎంతవరకు ఫలితాలిస్తుందన్నది అప్పుడు తేలనున్నది.

గత 50 ఏండ్లుగా ఆడ శిశువుల నిష్పత్తి భారీగా తగ్గిపోతూ వచ్చినట్టు జనగణన నివేదికల్లో వెల్లడైంది. దేశంలో యథాతథ పరిస్థితి కొనసాగిన ప్రాంతాలు తక్కువే. 1961 నుంచి జనగణన నివేదికలను పరిశీలిస్తే ఆరేండ్లలోపు బాలబాలికల నిష్పత్తి ఇలా ఉన్నది: 1961లో 1000 మంది బాలురకు 976 మంది బాలికలుండగా..1971లో 964, 1981లో 962, 1991లో 945, 2001లో 927, 2011లో 914కు తగ్గిపోయారు.

శాంపిల్ సర్వే ప్రకారం రాజస్థాన్‌లో ఆడ శిశువుల జననాల రేట్ చాలా తక్కువగా ఉంటోంది. 1000 మంది బాలురకు 2012-14లో 893మంది బాలికలుండగా 2013-15లో 861కి పడిపోయింది. సహజంగా 1000మంది బాలురకు 960మం[illegible] బాలికల జననానికి అ[illegible] 201[illegible] [illegible]మోదు కావడం గమనార్హం. అంటే..9[illegible]మంది ఆడ శిశువులను



గర్భస్రావాల(భ్రూణ హత్యలు) ద్వారా తొలగించారన్న మాట.

ఓవైపు సామాజిక వాస్తవాలు అలా ఉండగా..బేటీ బచావో పథకం వల్ల పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆశాభావం తమలో లేదని సామాజికవేత్తలు అంటున్నారు. ఏదైనా ఓ జిల్లా నుంచి సత్ఫలితాల కథనాలొస్తాయా అన్నదానిపై తనకు అనుమానంగా ఉన్నదని ఢిల్లీలోని సెంటర్ ఫర్ ఉమెన్స్ డెవలప్‌మెంట్ స్టడీస్‌కు చెందిన మేరీ ఇ జాన్ అన్నారు. బాలికల జననాల పట్ల ఏదైనా జిల్లాలో ఆసక్తి ఎలా పెరుగుతుంది..? కుటుంబ నిర్వహణకు బాలికలే సరైన అవకాశమని ఎంచుకుంటారా..? లేదా వారి వల్ల కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు ఉంటుందని భావిస్తారా..? మన దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉండటమే లింగ సమానత్వంలో మనం ఇతర దేశాలకన్నా వెనకబడి ఉండటానికి కారణమని ఆమె అన్నారు. ఇటీవల వరల్డ్ ఎకనామిక్ ఫోరం వెల్లడించిన ప్రపంచ లింగ వివక్ష సూచీ(జీజీజీఐ)-2017లో బంగ్లాదేశ్, చైనాకన్నా భారత్ అట్టడుగున ఉండటాన్ని ఆమె గుర్తు చేశారు. దేశంలో మహిళా శ్రామికులు, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉన్నదని ఆమె అన్నారు.

144 దేశాల జీజీజీఐలో ఇండియా 108వ స్థానంలో నిలువగా, బంగ్లాదేశ్ 47వ స్థానంలో, చైనా 100వ స్థానంలో నిలిచాయి. బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలోనూ దేశంలో లింగ వివక్ష జరుగుతున్నతీరుపై ఆందోళన కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. చాలా కుటుంబాలు మగ శిశువు కావాలన్న కోరికతో కుటుంబ నియంత్రణ పాటించకుండా ఆడశిశువుల జననాలను కొనసాగించిన విషయం వెల్లడైంది. అటువంటివారిని అవాంఛిత బాలికలుగా పేర్కొంటూ వారి సంఖ్య 2 కోట్ల 10 లక్షలమేర ఉన్నట్టు నివేదిక తెలిపింది. మరోవైపు తప్పిపోయిన బాలికలు-మహిళల సంఖ్య 6 కోట్ల 30 లక్షలుగా నివేదిక ఉటంకించింది. విద్యావంతుల సంఖ్యను పెంచడం వల్లో, ఆర్థిక పరిపుష్టి కలిగించడం వల్లో పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశించలేమని జేఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌గోలీ అన్నారు. లింగ వివక్షతో కూడిన ఆర్థిక వృద్ధి నమూనాలో మార్పు రావాలని ఆయన సూచించారు. లింగ అంతరాలు పేద గ్రామీణ ప్రాంతాల్లోకన్నా సంపన్న పట్టణ ప్రాంతాల్లోనే అధికమని ఆయన గుర్తు చేశారు.

రేపటినుంచి అసెంబ్లీ

- అధికార,విపక్షాల అస్త్రశస్త్రాలతో సిద్ధం
- కోరినన్ని రోజులు సభ నడుపుతాం : సర్కార్




నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

సోమవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. సమావేశాల్లో విపక్షాలు చేయబోయే విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు అధికార టీఆర్ఎస్‌పార్టీ సన్నద్ధమైంది. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతిపక్షాలు చేసే ప్రతీ ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు మంత్రులు కసరత్తు చేస్తున్నారు. చర్చకు అవకాశం లేకుండా వెల్‌లోకి దూసుకెళ్లాలని ప్రతిపక్ష పార్టీల సభ్యులు వ్యూహం చేస్తున్నాయి. ఇలా సభను ఆటంకపరిస్తే వేటు వేయడానికి కూడా వెనుకాడొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగేండ్ల అభివృద్ధిని చెప్పేందుకు ప్రిపేర్ కావాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రులకు సూచించారు. ఈసారి జరిగే బడ్జెట్ సమావేశాలు ఇవే చివరి సమావేశాలు కావటంతో గులాబీ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ సమావేశాలను ప్రతిపక్షాలు కూడా అంతే ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. దీంతో ప్రతి పక్షాలు ఏ అంశాలను లేవనెత్తే అవకాశం ఉందో అధికారపక్షం ముందే అంచనా వేసే పనిలో పడింది. గత ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుపై విపక్షాలు పట్టుబట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైతు సమితుల ఏర్పాటు, భూ రికార్డుల ప్రక్షాళన, బైసన్ పోలో గ్రౌండ్‌లో కొత్త సచివాలయ నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్త కలెక్టరేట్ల శంకుస్థాపన ఈ అంశాలతో పాటు మియాపూర్ భూ స్కామ్, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం స ష్టించిన డ్రగ్స్ కేసు, నేరెళ్ల సంఘటన, బీసీ, ఎంబీసీల సమస్యలు, రైతులకు రుణమాఫీ, దళితులకు నిధుల ఖర్చు, 24 గంటల విద్యుత్ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రస్తావించే అవకాశం ఉంది. రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలపైన ప్రభుత్వం సమాధానం చెప్పవలసి ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. రాజకీయ విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలని అనుకుంటున్నారు. ప్రతిపక్షాలు కోరినన్ని రోజులు సభ నడపనున్నట్టు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. విపక్షాలు లేవనెత్తే అన్ని అంశాలకు సమాధానం చెబుతామన్నారు. అసెంబ్లీ వేదికగా థర్డ్ ఫ్రంట్‌పై సీఎం కేసీఆర్ మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బడ్జెట్ సమావేశాల్లో వ్యవహరించాల్సిన తీరుపై ఆదివారం సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేయబోతున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగే టీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని ఆదేశించారు.

డెక్కన్ క్రానికల్ సుభానికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



నవతెలంగాణ తెలుగు దినపత్రిక ఏటా ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఉత్తమ కార్టూనిస్ట్-2017కు డెక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రిక కార్టూనిస్ట్ సుభాని ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ అధ్యక్షతన శనివారం జ్యూరీ సమావేశం జరిగింది. జ్యూరీ సభ్యులు ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్, తెలంగాణ టుడే సంపాదకులు కె శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ కార్టూనిస్ట్ సురేంద్ర ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డుకు సుభానిని జ్యూరీ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. సుభాని 1985 నుంచి 88 వరకు ఆంధ్రభూమి వారపత్రిలో కార్టూనిస్ట్‌గా పనిచేశారు. 1988 నుంచి 1990 వరకు ఆంధ్రభూమి దినపత్రిలో పొలిటికల్ కార్టూనిస్ట్‌గా విధులు నిర్వహించారు. 1990 నుంచి డెక్కన్‌క్రానికల్‌లోనే పొలిటికల్ కార్టూనిస్ట్‌గా కొనసాగుతున్నారు. రాయిపూర్‌లో జరిగిన కార్టూన్ ఫెస్టివల్‌లో కార్టూన్ వాచ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు-2016 దక్కింది. ప్రపంచ జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా భారత్ ప్రకాశన్ ట్రస్టు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డును 2014లో ఇచ్చింది. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 2013లో ఇచ్చింది. ఇలా పలు అవార్డులు వరించాయి. సుభాని ది డ్రైవ్, పాయింట్-కౌంటర్‌పాయింట్, ఆదాబ్ హైదరాబాద్ పుస్తకాలను రాశారు. నవతెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఈ అవార్డును సుభానికి ప్రదానం చేయనున్నారు.

ఏప్రిల్ 13 నుంచి 20 వరకు ఫోటో ఫెస్ట్

- బ్రోచర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏప్రిల్ 13 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో ఫొటో ఫెస్ట్ (హైదరాబాద్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్ - 2018)ను నిర్వహించబోతున్నట్టు సీనియర్ ఫొటోగ్రాఫర్, నికాన్ మెంటర్ ఎస్‌కె హుస్సేన్, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయకుమార్ చెప్పారు. తెలంగాణ కళా భారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రకృతి, ప్రజలు, వన్యప్రాణులు, జానపదాలు తదితరాంశాలపై ఎంట్రీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఫొటోగ్రాఫర్లు, ఫొటో జర్నలిస్టులతోపాటు మొబైల్ ఫోన్లలో ఫొటోలను తీసే అనుభవం ఉన్నవారు, ఔత్సాహికులు కూడా ఈ పోటీలో పాల్గొనొచ్చని చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ ఫొటో జర్నలిస్టు కెఎన్ హరి, సీనియర్ ఫొటోగ్రాఫర్ సిద్దార్థతో కలిసి వారు ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ, తృతీయ బహుతులుగా రూ.20 వేలు, రూ.10 వేలను అందిస్తున్నట్టు తెలిపారు. ఇవిగాకుండా పది ప్రోత్సాహక బహుమతులను అందిస్తామని వివరించారు. వీటితోపాటు వచ్చిన ఎంట్రీల్లోంచి 50 ఉత్తమ ఫొటోలను ఎంపిక చేసి ఫెస్ట్‌లో ప్రదర్శిస్తామని చెప్పారు. హరి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు వంద రూపాయలు ఎంట్రీ ఫీజును చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వివిధ పత్రికల్లో పనిచేసే ఫొటో జర్నలిస్టులు సైతం పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనటం ద్వారా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ కో-ఆర్డినేటర్ కె.సంతోష్ కూడా పాల్గొన్నారు.

థర్డ్‌ఫ్రంట్ కాదు.. మాది ఫస్ట్ ఫ్రంట్

ప్రత్యామ్నాయ కూటమిపై కేటీఆర్

- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమని వెల్లడి
- దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కేసీఆర్ ప్రతిపాదించిన కూటమి థర్డ్‌ఫ్రంట్ కాదని, 'ఫస్ట్‌ఫ్రంట్' అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ చెప్పారు. దేశ ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌కు 70 ఏండ్ల పాటు అవకాశం కల్పించినా జాతీయస్థాయిలో అందరి ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదని, రెండు పార్టీల పోరాటం అంతకంటే కాదని స్పష్టం చేశారు. కేంద్రంలో కేంద్రీకృతమైన అధికారాలకు వ్యతిరేకంగా కేసీఆర్ ప్రత్యామ్నాయ కూటమి ప్రతిపాదించారని చెప్పారు. ఇక గడిచిన నాలుగేండ్లలో బీజేపీ ఎన్డీయే మిత్రపక్షాలను కోల్పోయింది తప్ప కొత్తగా ఒక్క పార్టీని కూడా కూటమిలో చేర్చుకోలేకపోయిందని ఎద్దేవా చేశారు.

స్కాచ్ సదస్సుతో పాటు పలు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు కేటీఆర్ శనివారం ఢిల్లీకి వచ్చారు. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో స్కాచ్ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేవని అందరూ భావిస్తున్నారు. కేంద్రంలో కేంద్రీకృతమైన అధికారాలను ప్రశ్నించే విధంగా కొత్త ప్రత్యామ్నాయం వస్తే మంచిదనే చర్చకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఫెడరల్ కూటమిని ప్రతిపాదించారు. భవిష్యత్తులో ఈ కూటమి ఎలా రూపుదిద్దుకుంటుందో వేచిచూడాలి' అని అన్నారు. దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదని, రాజ్యాంగం ప్రకారం బహుళ పార్టీల వ్యవస్థని కేటీఆర్ చెప్పారు. 'దేశంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి' అని చెప్పారు. ఇక విభజన చట్టంలో పేర్కొన్న ఒక్క సంస్థను కూడా తెలంగాణకు మోడీ సర్కారు కేటాయించలేదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. 'కేంద్ర వాటాగా రావాల్సిన నిధులు తప్ప తెలంగాణకు ఒక్క పైసా కూడా అదనంగా దక్కలేదు. ఏపీలోనైనా కొన్ని సంస్థలను ఏర్పాటు చేశారు' అని కేటీఆర్ అన్నారు.

టీడీపీ రాజీనామాలు చేశాక ఎన్డీయే కూటమిలో బలహీనపడ్డ అకాలీదళ్ తప్ప ఎవరూ లేరని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'బీజేపీ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి' అని సూచించారు. అంతకముందు స్కాచ్ సదస్సులో ప్రసంగించిన కేటీఆర్.. తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతన్న కార్యక్రమాలను వివరించినట్టు చెప్పారు. 'రాష్ట్రంలో సమ్మిళిత అభివృద్ధి జరుగుతోంది. ఓ వైపు పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ పాలసీ తీసుకొచ్చాం. మరోవైపు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం' అని చెప్పారు.

కేసీఆర్ కుటుంబంతో హరీశ్‌రావుకు ముప్పు : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు కుటుంబం నుంచి మంత్రి హరీశ్‌రావుకు ముప్పు ఉందని, ఆ భయంతోనే ఆయన 'నా పుట్టక, చావు' కేసీఆర్‌తోనే అంటూ వివరణ ఇచ్చారని కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. హరీశ్‌రావు టీఆర్ఎస్‌లో ఉంటే నిజంగానే ఆయనను చంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.ఏమీ లేకుండా హరీశ్‌రావు ఎవరి కోసం ఆ వివరణ ఇచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం కలహాలతో కాగిపోతుందని, అంతర్గత కుమ్ములాటలతో పార్టీ చీలిపోవడం ఖాయమన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ద్వితీయ శ్రేణి నాయకుడిగా కొనసాగుతున్నారని చెప్పారు. ఇతర పార్టీల నుంచి ఫిరాయించిన నాయకులు పార్టీలో ఏవిధంగా ఉన్నారో వారిలానే హరీశ్‌రావు పరిస్థితి తయారైందన్నారు. ఆర్థిక శాఖ, పౌరసరఫరాల శాఖలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఈ ఆరోపణలపై మంత్రి ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీనియర్ మంత్రి వస్తే పౌర సరఫరాశాఖలో అవినీతిని నిరూపిస్తానన్నారు. ఉమ్మడి పది జిల్లాల పేరు మీద రేషన్‌కార్డులకు ప్రింటింగ్ ఆర్డర్ ఇచ్చారని, వాటిని తెచ్చి లబ్దిదారులకు పంపిణి చేయకపోడంతో అక్కడే మూలుగుతున్నాయని ఆరోపించారు. 'మామ కేసీఆర్ స్వాతిముత్యం-అల్లుడు హరీశ్‌రావు ఆణిముత్యం' అన్నట్టు అని చెప్పుకుంటున్న టీఆర్ఎస్ నేతలకు ఈ అవినీతి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం రాజకీయ విలువలను మంటగలుపుతుందన్నారు. గతంలోనే ఢిల్లీ వెళ్లి అమిత్‌షాను కలిసింది నిజం కాదా? ఉప ఎన్నికల తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డిని కలిసింది నిజంకాదా? వైఎస్ఆర్ ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో టీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి ప్రయత్నించారని, ఆయన మరణంతో విలీన ప్రక్రియ జగరలేదన్నారు. బీజేపీ పార్టీలోని తన బంధువుతో హరీశ్‌రావు మాట్లాడిన విషయం కేసీఆర్‌కు తెలియడం వల్ల ఆయనకు సమాధానం చెప్పుకోక సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారని ఎద్దేవా చేశారు.

బడుగుల విద్యకు బీజేపీ వ్యతిరేకం

- సావిత్రిబాయి పూలే వర్ధంతి సభలో కేవీపీఎస్ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సంఘ్ పరివార్, బీజేపీ మూల సిద్ధాంతం బడుగు బలహీన వర్గాల విద్యకు దూరమని సావిత్రిబాయి పూలే వర్ధంతి సభలో కేవీపీఎస్ నేతలు విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు చదువు నేర్పిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సావిత్రిబాయి పూలే 121వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆమె చిత్రపటానికి కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి స్కైలాబ్ బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శూద్రులు, మహిళలు చదువకూడదనే మనుస్మృతి సిద్ధాంతానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ వారసులని విమర్శించారు. బ్రాహ్మణ స్త్రీల చదువు కోసం కూడా సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. అనేక అవమానాలను ఎదుర్కొంటూ బాలిక విద్యా సంస్థలు నెలకొల్పి, దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదిగారన్నారు. శూద్రులకు చదువు నిషేదించిన మనుస్మృతి పుత్రిక సరస్వతిని కొలుస్తూ భావి భారత విద్యార్థులను చాందసవాదులుగా మార్చే కుట్ర సంఘ్‌పరివార్ శక్తులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శూద్ర విద్యా వాప్తి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి ఆదర్శనీయురాలని, ఆమె స్ఫూర్తితో మతోన్మాదంపై ఉద్యమం నిర్వహించాలన్నారు. ఈ వదర్ధంతి సభలో కేవీపీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం దశరథ్, నాయకులు డి మల్లేష్, సురేష్, నాగమణి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నూతన కార్యవర్గం

హైదరాబాద్ : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని నిజామాబాద్ ఎంపీ కేసీఆర్ ప్రకటించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా బి. వెంకట్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి. సంపత్ కుమార్, ఎ. శ్రీనివాస్, కోశాధికారిగా ఎల్. వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఏరియా ఉపాధ్యక్షులు(ఏరియాకి ఒక్కరి చొప్పున), నలుగురు రీజినల్ కార్యదర్శులు(రీజియన్‌కి ఒక్కరు), 11 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్‌కు, ఎంపీ కవితకు వెంకట్‌రావు, రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సాధికారత సాధించాలి

మహిళా దినోత్సవంలో శాంతా సిన్హా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళా సాధికారిత సాధించాలని ప్రొఫెసర్ శాంతాసిన్హా అన్నారు. అన్ని రంగాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగినప్పుడే దేశం ముందుకు పోతుందన్నారు. మహిళల సంక్షేమానికి, అభివద్ధికి తగిన చట్టాలు వచ్చాయని, మహిళలకు పురుషులతో సమాన మైన హక్కులు, అవకాశాలు రావడం లేదన్నారు. అందుకు మహిళలు విద్యావంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్య క్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగిం ది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహి ళలకు సమాజంలో సమానత్వం రావాలని, ఈ సమాజంలో పితస్వామ్యం పోవాలని, అప్పుడే మహిళలకు, పురుషులకు సరైన సమానత్వం దక్కుతుందన్నారు. మహిళలందరూ చదువుకొని చైతన్యవంతులు కావాలని ఆకాంక్షించారు. అప్పుడే మహిళలకు సమస్యలు ఎదుర్కొనే ధైర్యం వస్తోందన్నారు. సమాజంలో మహిళాలపై అనేక ఆంక్షలు ఉన్నాయన్నారు. మహిళలను బయటికి పంపిస్తే అత్యాచారాలు జరుగుతాయనే భయంతో వారికి త్వరగా పెండిళ్లు చేస్తున్నారని చెప్పారు. మహిళా సమానత్వం కోసం చట్టాల్లో మార్పులు రావాల్సిన అవసరం వుందన్నారు. శారద మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే మహిళలను అన్ని విధాలుగా గౌరవిస్తోందన్నారు. మిగతా పార్టీలలో మహిళల పట్ల చిన్న చూపు ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీలో మహిళలకు గౌరవం లేదని, కనీసం ఒక్క మంత్రిగా కూడా మహిళలకు అవకాశం ఇవ్వలేదని ఆమె విమర్శించారు.

11న కాంగ్రెస్ మహిళా సాధికారత సభ

అంతర్జాయతీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండల కేంద్రంలో 11న మహిళా సాధికారిత బహిరంగసభను నిర్వహించనుంది. దీనికి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

స్వార్థ ప్రయోజనాలు తప్ప సంస్థ ప్రయోజనాలు పట్టవా?
మంత్రి లక్ష్మారెడ్డికి మల్లు రవి ప్రశ్న

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఇన్‌చార్జి) నియామకం విషయంలో చట్టాలను, నిబంధన లను తుంగలో తొక్కి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తన ఇష్టానుసారంగా వ్యవహరిం చారని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ఆరోపిం చారు. సీనియారిటీ పట్టించుకో కుండా తన అనుచరుడైన రమేశ్ రెడ్డికి పట్టం కట్టార న్నారు. ఈ అంశాన్ని హైకోర్టు సస్పెండ్ చేసినా దానిపై తిరిగి కోర్టుకు వెళ్లాలని నిర్ణయిం చారని ఆరోపించారు. ఇది సంస్థకు మేలు చేయక పోవడంతోపాటు నష్టం జరుగుతుందని ఆయన ప్రకటనలో పేర్కొ న్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఈ విషయంలో ఇప్పటికే అనేక సార్లు ఉన్నతాధికారులకు, ప్రభు త్వానికి ఫిర్యాదు చేశార న్నారు.

ఇప్పటికైనా సంస్థ బాగుగోలు ఆలోచించి సీనియర్లకు అవకాశమిచ్చి వైద్య సంస్థను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనలో దేశ ద్రోహులుగా అన్నదాతలు

- సామాజిక తెలంగాణే కాంగ్రెస్ ఎజెండా : భట్టి
- బీసీలకు 50శాతం సీట్లివ్వకపోతే ఆమరణ దీక్ష : చిత్తరంజన్‌దాస్
- రాత్రి ఒంటిగంట వరకు తాగే నీకు మూడో ఫ్రంట్ ఎందుకు?
- బీసీలపై క్రీమిలేయర్ ఎత్తేయాలి : వీహెచ్



నవతెలంగాణ-మహబూబ్‌నగర్

కేసీఆర్‌పాలనలో అన్నదాతలు దేశద్రోహం కేసుల కింద జైలుపాలయ్యారని కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ఓబీసీ సెల్ ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంలో బడుగు, బలహీన వర్గాల వారి పిల్లల ఆత్మత్యాగాలను చూసి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆత్మ గౌరవ పోరాటం గడీల పాలనగా మారిందన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ నాలుగేండ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాలపై అనేక దాడులు, కేసులు, దౌర్జన్యాలు జరుగు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు అందరికీ అందుతాయనుకున్న సామాజిక వర్గాలకు నిరాశే మిగిలిందని వాపోయారు. 52శాతంగా ఉన్న బీసీలు బలంగా ఉంటేనే చట్ట సభల్లో న్యాయం జరుగుతుందన్నారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ఎజెండా అని చెప్పారు. ఓబీసీ సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు 50శాతం సీట్లివ్వాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరు సీట్లు బీసీలకే ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా 50శాతం సీట్లకు ఒక్కటి తగ్గినా హైదరాబాద్‌లో ఆమరణ నిరా హార దీక్ష చేస్తానని హెచ్చరించారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ.. కేసీఆర్, బాబు ఎప్పుడైనా తెలంగాణ కోసం ఆత్మ త్యాగాలు చేసిన వారిని గుర్తు చేసుకుంటారా? అని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని తేవడం గొప్పతనం కాదని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కుటుంబ సమగ్ర సర్వేలో బీసీల సంఖ్యను చూసి గొర్రెలు, బర్రెలు పంపిణీ చేస్తున్నావా? అని ప్రశ్నించారు. క్రిమీలేయర్స్‌ను ఎత్తేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. 'పేదలకు డబుల్ బెడ్ రూమ్ం ఇండ్లివ్వని బక్కోడికి మూడిండ్లు ఎందుకు' అని ఎద్దేవా చేశారు. 'ఒక ఫ్రంట్‌కే రాత్రి ఒంటి గంట వరకూ తాగే నీకు మూడో ఫ్రంట్ ఎందుకు' అని అన్నారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరే అని విమర్శించారు. సమావేశంలో కత్తి వెంకటస్వామి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, ప్రదీప్‌గౌడ్, మాజీ మంత్రి చంద్రశేఖర్, జెడ్పీటీసీ శ్రీహరి, మణెమ్మ, బాలవర్ధన్ పాల్గొన్నారు.

నిందితులపై నిర్భయ కేసు నమోదు చేయాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

- భార్గవి కుటుంబానికి ఐద్వా పరామర్శ

నవతెలంగాణ-మోత్కూరు



ప్రేమపేరుతో నమ్మించి అతి కిరాతకంగా యువతిని హత్య చేసిన కాసగాని నరేందర్‌పై నిర్భయ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామంలో బొడ్డుపల్లి భార్గవి ఇటీవల హత్యకు గురైన విషయం విదితమే. యువతి కుటుంబాన్ని ఐద్వా నాయకులు శనివారం పరామర్శించారు. భార్గవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ.. నరేష్ గతంలోనూ ప్రేమ పేరుతో నమ్మించి చాలామంది జీవితాలను నాశనం చేశాడన్నారు. భార్గవి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భార్గవి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఐద్వా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేసరి అరుణ, బట్టుపల్లి అనురాధ, నల్లగొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందాడి ప్రమీల, పాలడుగు ప్రభావతి, మోత్కూరు టౌన్ అధ్యక్ష కార్యదర్శులు చామకూర శోభ, ఎండి జుబేదా బేగం, సుంకిశాల అనిత, రాచకొండ రాములమ్మ, గుండు లక్ష్మి ఉన్నారు.

సర్కారు బడుల్లోని విద్యార్థినులకు హెల్త్‌కిట్స్!

- బడ్జెట్‌లో ప్రతిపాదించనున్న సర్కార్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థినులకు హెల్త్‌కిట్స్ అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. దీనికోసం ప్రత్యేకంగా కొత్త పథకాన్ని త్వరలో ప్రతిపాదించే బడ్జెట్‌లో ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఈ పథకం కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌ల్లో అమలు జరుగుతున్నది. అయితే రాష్ట్రంలోని సర్కారు బడుల్లోని అందరు విద్యార్థినులకు హెల్త్‌కిట్స్ అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు నాలుగున్నర లక్షల మందికి పైగా విద్యార్థినులకు ఈ పథకం వర్తింపజేయనున్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో సుమారు రూ.వందకోట్లు కేటాయిస్తున్నట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నియమించిన బాలికల విద్య అభివృద్ధి సబ్ కమిటికీ డిప్యూటీసీఎం కడియం శ్రీహరి చైర్మెన్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బాలికల విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ప్రకటించే అవకాశముంది. ఇలాంటి పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రాన్ని కూడా కోరనున్నట్టు తెలుస్తోంది.

మనసుంటే....

కనురెప్పల సరిహద్దుల్లో
ఘనీభవించిన కన్నీటి చుక్కను
తరిచిచూడు మిత్రమా..! ఒక్కసారి
ముత్యంలా మారిన బిందువులో
కథలు చెప్పే రంగులెన్నో
రంగు రంగులో ఒక భావం
ప్రతి భావంలో ఒక పరిమళం
కనిపించీ కనిపించని
ఆ కన్నీటిచుక్క స్ఫటికంలా మారి
మనసు వెతలకు
ప్రతిబింబమే అవుతుంది చూడు..!

మంచిపని మనసుకు హాయినిస్తుంది. చెడ్డపని మనసును నొప్పిస్తుంది. ఈ నొప్పి భరించాలన్నా, ఆ హాయి పొందాలన్నా మనసు సిద్ధపడాలి. అంతే. మనసుంటే మార్గముంటుంది అంటారు పెద్దలు. వారు అనుభవపూర్వకంగా చెప్పారు. మనం మనకు కావాల్సిన వారిని కలవాలనుకుంటాం. దారి తెలియదు. వెదుక్కుంటూ వెళ్తాం. ఈ సువిశాల ప్రపంచంలో ఎన్నో అవస్థలు. అయినా మనకు నచ్చితే ఎంత కష్టమైన పని అయినా యిష్టపడి చేస్తాం. కష్టాలు నష్టాలు యిష్టపడి ఉంటాం. మన మిత్రులు ఎందాక రమ్మంటే అందాక వెళ్తాం. అప్పుడు ఆ దారిలో ఎన్ని అవరోధాలెదురైనా అవన్నీ భరిస్తాం. భరించాలి. మన లక్ష్యం చేరుకోవాలి. ఇటువంటప్పుడే మనం మిత్రులు అనుకుంటుంటాం.. వారు చాలా దగ్గరలోనే ఉన్నా మనకు దగ్గర కాలేరు. మరికొందరు ఎంతో దూరంగా ఉన్నా, మనసుకు దూరం కాలేరు. వీళ్లెప్పుడూ మన హృదయంలో సదా నిలిచే ఉంటారు.

ఆ మనుషులు నడిచినప్పుడు వారికి తోడుగా నీడలు నడవకేమి చేస్తాయి చెప్పండీ..! అందుకని ఆ అడుగులకు గమనం ముఖ్యం. మనసుంటే మార్గం ఉంటుందీ అనేది కూడా అంతే నిజం.

మనసుకు నచ్చిన వారితో మనం ప్రతి క్షణం మాట్లాడలేక పోవచ్చు. మన మనస్సు మాత్రం వారి కోసం ప్రతి క్షణం నేస్తమా..! నేస్తమా..! అని పరితపిస్తూనే ఉంటుంది. ఓ పక్షిలా మనక్కూడా రెక్కలుంటే ఎంత బావుండునో..! ఎంచక్కా నెచ్చెలి దగ్గరికి వాలిపోవచ్చు..! అప్పుడే ఆ సమయాన ప్రకృతి అందాలన్నీ మౌనంగా పలుకరించే వేళ.. మెలమెల్లగా మల్లెమొగ్గలు విచ్చుకుంటున్నట్టు.. మదిలో ఓ స్నేహభావం మెదిలి మిత్రులు కనిపిస్తారు. స్వచ్ఛమైన ప్రేమ కనిపిస్తుంది. వారి మధ్యలో ఓ పసిపాప బోసినవ్వు.. వెన్నముద్దలా మురిపిస్తూ 'వెన్నెల లోని వికాసమె వెలిగించెద నీ కనులా..! వేదన మరిచీ ప్రశాంతిగా నిదురించుము ఈ రేయీ..!' అని మరిపిస్తూ ఉంటే, మనసు దూదిపింజలా ఎగిరిపోతూ ఉంటుంది. అలా కలకీ నిజానికీ సరిహద్దు చెరిగిపోయిన గొప్ప క్షణాలు ఉంటాయి. సరిగ్గా ఆ క్షణంలో, కలా నిజమూ రెండూ దాగుడుమూతలాడి, కల కరిగిపోయి, ఓ పచ్చి నిజంగా మారిపోతుంది. నువ్వు ఈ భూమ్మీదే ఉన్నావ్..! అని మన మనస్సు మన చేతిని గిచ్చి మరీ చెబుతుంది. అలా నిజమెప్పుడూ చెదిరిపోదు.




మనసు పరిపూర్ణంగా నిండిపోతే మగతగా ఉంటుంది. మధ్య మధ్య అది కొంచెం కొంచెం తొణికిపోతుంటే చురుకుదనం ఏర్పడుతుంది. ఎగిసిపోయేది ఏదయినా మనసుకు రెక్కలు తొడుగుతుంది. ఏ పదార్థమయినా ఏ రూపంలోనైనా ఎగిసిపోయినపుడు మనసుకు నిరవధిక తన్మయత్వం కలుగుతుంది. అప్పుడు ఊహలకు కూడా రెక్కలొచ్చి, అబ్బ..! యిప్పుడే యిక్కడే ఉన్నట్టుండి ఈ క్షణాన వర్షం కురిస్తే, నీలి ఆకాశంలో తళుక్కున ఓ మెరుపు మెరిస్తే... ముంచుకు వచ్చే మబ్బులు.. నీటితో నిండి తెల్లని నిండైన వెండి మబ్బులు.. ఒకదాని వెంట మరొకటి పరుగులు పెట్టే ఆ మబ్బుల్ని తదేకంగా చూస్తుంటే 'మమత లెరిగిన మేఘమాలా...! బావ లేనిది బతకజాలా..!!' అని ఓ భావగీతిక కమ్మని కథలా సాగిపోతుంది. కళ్లలో కళ, వ్యక్తీకరణలో అందం, అక్షరాలలో కాంతీ, జీవితంలో ఔన్నత్యం.. యివన్నీ పొదిగిన ముత్యంలా మనస్సు వికసిస్తుంది.

మనసులోని భావాన్ని సుతిమెత్తగా చెప్పగలిగిన నేర్పు ఉన్నవారు చక్కని స్నేహాన్ని పెనవేసుకోగలుగుతారు. మహాకవి శ్రీశ్రీ పలికించినట్టు "మనసున మనసై... బతుకున బతుకై.. తోడొకరుండిన అదే భాగ్యమూ.. అదే స్వర్గమూ...! నిన్ను నిన్నుగా ప్రేమించుటకూ.. నీకోసమే ...!" నని చెప్పేంతగా ఆలుమగల అనుబంధం కలిగి ఉండాలి. మనం అనుకున్నట్టు జీవితం సాఫీగా సాగిపోవాలంటే భార్యాభర్తల మధ్య పరస్పర సహకారం ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. పరస్పర అవగాహన కూడా చాలా ముఖ్యం. కుటుంబం అన్నతరవాత సమస్యలుంటాయి. సహజమే కదా! చిన్నా చితకా తేడాలున్నా, ఇరువైపులా సర్దుకుపోయే స్వభావం ఉండాలి. ఇందుకు ముందుగా ఆధిపత్య భావజాలంలో నుండి పురుష పుంగవులు బయట పడాలి. "ఆమెకు శరీరం ఉంది. దానికి వ్యాయామం కావాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం యివ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం యివ్వాలి." అనే సంగతిని అర్థం చేసుకుని మెలగాలి. మనస్ఫూర్తిగా వ్యవహరించాలి.

మన మధ్య నడిచే నీడలు కూడా ఉంటాయి. నీడలు నడవడమేమిటీ..? అని అనుకుంటాం. బహుశా.. అలా సందేహించే వారికి తెలియకపోవచ్చు.. ఎన్ని అవరోధాలు ఎదురయినా ముందుకు నడిచే మనుషులుంటారనీ.. వారిలో కూడా మనసుంటుంది కదా. మరి ఆ మనుషులు నడిచినప్పుడు వారికి తోడుగా నీడలు నడవకేమి చేస్తాయి చెప్పండీ..! అందుకని ఆ అడుగులకు గమనం ముఖ్యం. మనసుంటే మార్గం ఉంటుందీ అనేది కూడా అంతే నిజం.

మోడీ అజేయుడు అన్న వాదన ఓ అభూతకల్పన!



కొండూరి వీరయ్య

మోడీ అజేయుడా? తాజాగా దేశంలో బుల్లెట్ రైలుకన్నా వేగంగా ప్రచారమవుతున్న సందేహం ఇది. తాజాగా ముగిసిన ఈశాన్య రాష్ట్రాల శాసనసభ ఎన్నికలపై పుంఖానుపుంఖాలుగా వ్యాఖ్యానాలు వస్తున్నాయి. నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాలకంటే విశ్లేషకులు సహజంగానే త్రిపురలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చేతులనుండి అధికార పగ్గాలు చేజారటాన్ని ఎక్కువమంది విశ్లేషకులు చారిత్రాత్మక సంఘటనగా పరిగణిస్తున్నారు. మరి కొందరు ఈ మార్పును బెర్లిన్ గోడ పతనంతో పోలుస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నిర్వహించిన ప్రచార వ్యూహం, వెదజల్లిన ధనబలం, కండబలం గురించిన చర్చలు సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానాలు వస్తున్నాయి.

మోడీ అజేయుడు కాదు. శతాబ్దాల తరబడి పాఠకులను ఆకట్టుకున్న బేతాళుడు విక్రమార్కుడు కథల్లో కూడా ప్రతి అధ్యాయానికీ ముగింపు ఉంది. విక్రమార్కుడు విరామం తీసుకున్న తర్వాత మరో అధ్యాయం ప్రారంభమవుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కూడా అంతే. అభినవ బేతాళుడు మోడీ విసురుతున్న ప్రశ్నలకు అభినవ విక్రమార్కులు సమాధానం చెప్తారా లేదా అన్నదానిపైనే తదుపరి అంకం ఆధారపడి ఉంటుంది.

2014లో దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీకి బ్రహ్మరథం పట్టిన భారత యువత నేడు అసంతృప్తితో అతలాకుతలమవుతోంది. కానీ ఈ కలల బేహారి మరోసారి ఈశాన్య రాష్ట్రాల యువతను తన మార్కెట్‌గా మార్చుకున్నాడు.

గత యాభయేండ్లల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు, స్థానిక అస్థిత్వ రాజకీయాలను మాత్రమే చూసిన ఈశాన్య రాష్ట్రాల ప్రజల ముందు సరికొత్త సినిమా స్కోప్ చిత్రానికి ఆరెస్సెస్ బీజేపీలు రూపొందించిన స్క్రిప్ట్ బాక్సాఫీసు హిట్ కొట్టింది. విధానాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వాలు మారితే జీవితాలు మారిపోతాయన్న గుడ్డి నమ్మకం నుండి ప్రజలను బయటపడకుండా ఉండేందుకు కావల్సిన రంగుల కలను కండ్లముందుంచటం నయా ఉదారవాద విధానాల ప్రత్యక్ష ప్రయోజనం. 30లక్షల ఓటర్లు ఉన్న రాష్ట్రంలో 50 వేలమంది ఆరెస్సెస్ కార్యకర్తలను సమీకరించి వినూత్న రీతిలో ప్రజల మనోభావాలు మార్చటానికి ఉన్న ఏ చిన్న అవకాశాన్నీ బీజేపీ వదులుకోలేదు. ప్రధానంగా త్రిపురలో కాంగ్రెస్ నాయకత్వం తన పునాదిని పూర్తిగా బీజేపీకి అమ్మేసింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన ప్రాంతీయ పార్టీలకు ఇది ఒక హెచ్చరిక. అయితే ఈ విజయఢంకాల హోరులో విశ్లేషకులు, ప్రజలు ఒక చారిత్రక వాస్తవం పట్ల ఏమరుపాటుతో వ్యవహరిస్తున్నారు. అది చరమాంకానికి చేరుకుంటున్న మోడీ అచ్చేదిన్‌ల గురించి.

దేశమంతా ఆందోళన చెందుతున్న రామమందిర నిర్మాణయాత్ర ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రకటనతోనే మొదలవటం వెనక ఉన్న తర్కాన్ని అర్థం చేసుకోవాలంటే సాధారణ తర్కం పరిధిని దాటి ఆలోచించాలి. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఈ ఏడాది ఎన్నికలకు వెళ్తున్న ప్రధాన రాష్ట్రాలు కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లు. ఇందులో కర్ణాటక తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలు అన్నీ బీజేపీ ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలే కావటం గమనార్హం. ఈశాన్య రాష్ట్రాల్లో ప్రత్యేకించి త్రిపురలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ప్రజల ముందుంచిన బీజేపీ స్వంత రాష్ట్రాల్లో అదే పని చేస్తుందా అన్నది సహజమైన ప్రశ్న. స్వయంకృతాపరాధాల నుండి బయటపడటానికి ఏ యితర పార్టీలకూ లేని అవకాశం, బీజేపీ మాత్రమే అందుబాటులో ఉన్న ప్రత్యేక వెసులుబాటు మతోన్మాదం. ఈ కోణంలో చూస్తే తప్ప రామమందిర నిర్మాణ యాత్రకున్న రాజకీయ వ్యూహాత్మక ప్రాధాన్యతను అర్థం చేసుకోలేము. ప్రధాన స్రవంతికి చెందిన కాంగ్రెస్‌తో సహా ఏ ఇతర పార్టీకీ యావత్తు ప్రజల మనోభావాలను నిర్దాక్షిణ్యంగా పక్కకు నెట్టే శకుని తెలివి తేటలు లేవు. ఇందులో బీజేపీకి దాని వెన్నంటి నడిపించే ఆరెస్సెస్ చూపించే ప్రావీణ్యం గమనిస్తే చాణక్యుడైనా గుండు గీయించుకుంటాడు. మనువు అయినా ముక్కుమీద వేలేసుకుంటాడు. ఈ విషయాన్నే ఫాసిజం సిద్ధాంత కర్త ముస్సోలిని తన ఆత్మ కథలో ప్రస్తావిస్తూ ఏ వియషం పట్లనైనా ఆకుకు అందకుండా పోకకు చెందకుండా వ్యవహరించేంత విస్తృతమైన సౌలభ్యం ఫాసిజంలో ఉందని శెలవిస్తాడు.

బీజేపీ విజయాలను మరో కోణంలో పరిశీలిస్తే మోడీ అజేయుడా అన్న ప్రశ్నకు అర్థవంతమైన సమాధానం చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ ప్రత్యర్థులతో పోటీ పడింది. బీజేపీ అఖండ విజయాలు సాధించిందని చెప్పుకుంటున్న ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ, ఉత్తరాఖండ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లల్లో కాంగ్రెస్, జార్ఖండ్‌లో కప్పలతక్కెడలా మారిన ప్రాంతీయ పార్టీలతో పోటీ పడ్డ బీజేపీ ప్రచారపు అమ్ముల పొదిలో రామబాణాలే కాదు. పాశుపతాస్త్రాలూ, శివధనస్సులూ అర్జునుడికి అక్కరకొచ్చినట్టు అక్కరకొచ్చాయి. మిత్రపక్షమైన అకాలీదళ్ అధికారంలో ఉన్న పంజాబ్, అప్పటి వరకు అధికారంలో భాగస్వామిగా కొనసాగిన బీహార్‌లోనూ జరిగిన ఎన్నికల్లో బీజేపీ అమ్ములపొది కర్ణుడి శస్త్రవిద్యా సామర్థ్యంగా మారిపోయింది. అధికారాన్ని దక్కించటంలో అక్కరకు రాకుండా పోయింది. స్వంత రాష్ట్రమే అయిన గోవాలో చేజారిపోతున్న అధికారాన్ని కాపాడుకోవటానికి ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో రక్షణ శాఖ మంత్రిగా ఉన్న పరిక్కర్ ఉన్నపళంగా గోవా పరిగెత్తాల్సి వచ్చింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయటానికి న్యాయవ్యవస్థను ఎంతగా దుర్వినియోగం చేసినా ప్రజల్లో కేజ్రీవాల్ పట్ల ఉన్న క్రేజ్‌ను ఆశించినంత స్థాయిలో తగ్గించలేకపోయింది. మోడీ అధికార ప్రస్థానానికి ఆదిమెట్టుగా ఉన్న గుజరాత్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవటానికి కేంద్ర క్యాబినెట్ యావత్తూ నెలరోజుల పాటు పరిపాలనా బాధ్యతలు వదిలిపెట్టి గుజరాత్‌లో మకాం పెట్టాల్సి వచ్చింది. ఈ పరిణామాలు ఒక కొత్త కోణాన్ని ముందుకు తెస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో విజయఢంకా మోగించినంత తేలికగా స్వపక్షం, మిత్రపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ తన ప్రతాపాన్ని చూపించలేకపోతోంది. మోడీ పేరు ప్రతిష్టలు అచ్చి రావటం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాలను నిర్దేశించుకునేందుకు ఉన్న అవకాశాలను ఈ కోణం ముందుకు తెస్తోంది.



ఈశాన్యరాష్ట్రాల ఎన్నికలతో ఆరెస్సెస్ వదిలిన యాగాశ్వం 2014 నుండీ సాగించిన జైత్రయాత్ర చరమాంకానికి చేరుకుందన్న విషయాన్ని అటు మోడీ భక్తులు, ఇటు విశ్లేషకులు మర్చిపోతున్నారు. ఇప్పటికే గుజరాత్‌లో చావు తప్పి కన్ను లొట్టైన బీజేపీ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లోనూ, ఉత్తరప్రదేశ్ స్థానిక ఎన్నికల్లోనూ ఘోర పరాజయం పాలైన వాస్తవాన్ని మోడీ మీడియా మాయాజాలం దేశ ప్రజల కండ్లబడకుండా శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పటివరకు ప్రతిపక్ష పార్టీలపై సాగించిన ఎన్నికల పోరాటం రానున్నకాలంలో సాగించే రాజకీయ పోరాటాలకు తనను తానే ప్రత్యర్థిగా మార్చుకునే విలక్షణ దశకు చేరుకుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు కమ్యూనిస్టులను, ప్రతిపక్షాలను ఆడిపోసుకున్న మోడీ, మోడీ భక్తులు, ఆరెస్సెస్ కరసేవకులు ఇకనైనా ప్రభుత్వ వైఫల్య సాఫల్యాలపై దృష్టి సారిస్తుందా లేదా అన్న ప్రశ్న దేశం ముందు ఉంది.

పూర్తిగా ప్రాంతీయ పార్టీల స్వాధీనంలో ఉన్న రాష్ట్రాలు పశ్చిమబెంగాల్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశ్శాలు. ఇందులో నికరంగా దాదాపు రెండు దశాబ్దాల పాటు ఒకే పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం ఒడిశ్శా. అందుకే బీజేపీ తదుపరి ప్రయోగశాలగా ఒడిశ్శాను ఎన్నుకొన్నది. త్రిపురలో ప్రయోగించిన పాచికల తరహాలోనే గత మూడేండ్లుగా ఒడిశ్శాలో సాధ్యమైనంత స్థాయిలో కేంద్రీకరణకు పూనుకొన్నది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో బలమైన, దిగువ స్థాయి వరకు వేళ్లూనుకున్న యంత్రాంగం కలిగిన ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కాబట్టే ఆయా రాష్ట్రాలు బీజేపీ ఎన్నికల ప్రాధాన్యతలో ద్వితీయశ్రేణి ప్రాధాన్యత స్థాయిని అధిగమించలేకపోయాయి. ఇప్పటి వరకు బీజేపీ అనుసరిస్తున్న వ్యూహం ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాకు వ్యతిరేకంగా ఈస్టిండియా కంపెనీ రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలో ప్రయోగించిన మెరుపుదాడి వ్యూహాలనే అనుసరిస్తోంది. తనకున్న శక్తి సామర్థ్యాలన్నింటినీ లక్షిత ప్రయోజనం కోసం వెచ్చించటం, ప్రత్యర్థులను భయభ్రాంతులను చేయటం నాడు రాబర్ట్ క్లైవ్ అనుసరించిన వ్యూహం.

ఈ పరిస్థితుల్లో శక్తివంతమైన ప్రతిపక్షాల ఐక్యకూటమి ముందుకొస్తే 2019 ఎన్నికల్లో మోడీ ప్రభావాన్ని ఎదుర్కోవటం, విజయ ప్రవాహానికి అడ్డుకట్ట వేయటం అసాధ్యమేమీ కాదన్న విషయాన్ని ఈ వాస్తవాలు ముందుకు తెస్తున్నాయి. వలసవాదం హిందూత్వ శక్తులకు అందించి వెళ్లిన మరో మారణాయుధం విభజించు పాలించు సూత్రం. ఏయే ప్రాంతాల్లో ప్రజలను, ప్రతిపక్షాలను ఏయే ఎజెండాల మధ్య చీల్చి తన పబ్బం గడుపుకోవాలో బీజేపీ ఆరెస్సెస్‌లకు బాగా తెలుసు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాల హక్కుల కోసం అన్న నినాదం మాటున ప్రతిపక్షాలను సంఘటితం చేయాలన్న టీఆర్ఎస్ అధినేత పిలుపునకు విశేష స్పందన రావటంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రజాతంత్ర లౌకిక రాజ్యాంగాన్ని, పౌర హక్కులను కాపాడుపోకపోవటం మాత్రమే కాదు. ప్రజాతంత్ర సమాఖ్య స్వభావాన్ని కాపాడుకోవటం కూడా రానున్న ఎన్నికల్లో కీలకమైన ఎజెండా కానున్నది. మోడీ అజేయుడు కాదు. శతాబ్దాల తరబడి పాఠకులను ఆకట్టుకున్న బేతాళుడు విక్రమార్కుడు కథల్లో కూడా ప్రతి అధ్యాయానికీ ముగింపు ఉంది. విక్రమార్కుడు విరామం తీసుకున్న తర్వాత మరో అధ్యాయం ప్రారంభమవుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కూడా అంతే. అభినవ బేతాళుడు మోడీ విసురుతున్న ప్రశ్నలకు అభినవ విక్రమార్కులు సమాధానం చెప్తారా లేదా అన్నదానిపైనే తదుపరి అంకం ఆధారపడి ఉంటుంది.

సెల్: 9871794037

రిపోర్టర్స్ డైరీ

థర్డ్ ఫ్రంట్

ఆలూ లేదు చూలూ లేదు అల్లుని పేరు సోమలింగం అనే సామెత అందరికీ ఎరుకే గదా. గిప్పుడు సీఎం కేసీఆర్ ముచ్చట గట్లనే ఉన్నది సుమీ. థర్డ్ ఫ్రంట్ పేరుతో రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజావ్యతిరేకత అనే తెప్పను దాటేయాలని భావిస్తున్నట్టు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. దేశంలో ఇప్పటికే రెండు ఫ్రంట్‌లు ఉనికిలో ఉన్న సంగతి తెలిసిందేనాయే. ఆయా రాష్ట్రాల్లో చిన్నా చితకా పార్టీలను గంపకింద కమ్మి జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయడం ఒక ఎత్తయితే, తాను ఢిల్లీకి వెళ్లి ఇక్కడ తన కొడుక్కి సింహాసనాన్ని అప్పగించాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్టు టీఆర్ఎస్‌లోనే చెవులు కొరుక్కుంటున్నారు. నయా తెలంగాణలోనూ వారసత్వం వాసన షురూ అయిందనే విమర్శలు సైతం వస్తున్నాయి. థర్డ్ ఫ్రంట్ పేరుతో ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టేందుకు కేసీఆర్ వ్యూహరచన చేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. థర్డ్ ఫ్రంట్ విధి విధానాలు తెలిసేవరకూ గంతే మరి ముచ్చట!

- బి.బసవపున్నయ్య

చంద్ర'హాసం

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో కొత్త పార్టీ ఆవిష్కృతమైంది. ఎన్నికలకు ముందు ఇలాంటివి సర్వసాధారణమే. మన రాష్ట్రంలో కొత్త పార్టీలకు కొదవేలేదు. ఏ కారణాలతో పార్టీ పెట్టినా అంతిమ లక్ష్యం అధికారమే. ఎన్నికలకు ముందు పార్టీ పెట్టి ప్రజల్లో వ్యక్తిగతంగా పాపులారిటీ పెంచుకోవడానికో, ఇంకేదైనా లబ్దిపొందడానికో, సభలకు వస్తున్న జనాన్ని చూసి అధికారంలోకి వస్తామనుకుంటారో తెలియదు కానీ పార్టీలు మాత్రం పెట్టేస్తున్నారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి చంద్రకుమార్ కూడా 'తెలంగాణ ప్రజల పార్టీ' పెట్టారు. బలహీనవర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యమని 'చంద్ర'హాసం ప్రదర్శించారు. సామాజిక సంఘాలు, కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన సభలకు ముఖ్యఅతిథిగా ఆయనను ఆహ్వానించాయి. రిటైర్డు జడ్జి కావడంతో ఆయన ప్రసంగాలకు కూడా మద్దతు లభించింది. సభలకు వచ్చిన జనాన్ని చూసి, ఏదో ఒక సమస్యపై మీడియాలో రావడంతో ఆయనకు కూడా అధికారంలోకి రావాలనే ఆశలు చిగురించాయి. ఇతర పార్టీల్లో చేరితే ఒకరి కింద పని చేయడమేమిటని, తానే ఒక పార్టీ పెడితే పోలే..! అన్న ఆలోచన వచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. సొంతంగా పోటీ చేస్తారా? లేక బీఎల్ఎఫ్‌లో భాగస్వామి అవుతారా? ఏదైనా వచ్చే సాధారణ ఎన్నికల్లో టీపీపీ విజయం సాధించాలని ఆశిద్దాం...!

- గుడిగ రఘు

మళ్లీ ఓ డెడ్‌లైన్

ఉపాధ్యాయ నియామకాలపై పలు మార్లు తేదీలు మార్చి, మార్చి చెప్పిన డిప్యూటీ సీఎం కడియం సార్...ఎట్టకేలకు టీఆర్‌టీ పరీక్షలను అనేక ఆపసోపాల మధ్య విజయవంతంగా నిర్వహించారు. ఇటీవల వీసీలతో కడియం శ్రీహరి ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. దాంట్లో 'వర్సిటీల్లో అనేక ఏండ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈనెలాఖరు నాటికి నోటిఫికేషన్ విడుదల చేసి, జూన్ నాటికి భర్తీ చేస్తాం..' అని చెప్పారు. వెంటనే ఓ విలేకరి... 'నిజంగానే ఇవన్నీ జరుగుతాయా సార్..?' అని ప్రశ్నించారు. వెంటనే కడియం...'వీసీలు చెప్పిందే, మీకు చెబుతున్న..' అని చెప్పి తప్పించుకున్నారు. 'ఇదీ టీఆర్‌టీ లాంటి డెడ్‌లైన్ కాదు కదా..?' అని పక్కనే ఉన్న మరో విలేకరి అన్నాడు. దీంతో అక్కడి వారంతా గొల్లున నవ్వారు.


- గండ్ర నవీన్

దేశంలో దొంగలు పడ్డారు

రోజురోజుకు దేశంలో ప్రజాధనానికి భద్రత లేకుండా పోతున్నది. దేశం దోపిడీకి గురవుతుంటే ఏ ఒక్క నాయకుడు స్పందించడం లేదు. మొన్న విజయ్‌మాల్యా రూ. 9 వేల కోట్లతో విదేశాలకు ఉడాయిస్తే..తాజాగా నీరవ్ మోడీ రూ.11 వేల కోట్లతో పారిపోయాడు. బ్యాంకుల్లో ఉండాల్సిన 130 కోట్ల మంది ప్రజాధనం కేవలం పదుల సంఖ్యల్లో ఉన్న దొంగలు, రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో చిక్కుకుంటున్నదేమిటి? ఇంకా మనచుట్టూ స్వాములు, బాబాలు ఉన్నారు. వారు చెప్పే ఉపదేశాలను నేటికీ జనం పాటిస్తూండటం ఆందోళన కలిగించే అంశం. ఇలా దేశంలో దొంగలు పడి దేశ సంపదను మొత్తం దోచుకుంటున్నా పట్టించు కునేవారే లేరు.

- ఆనంద్‌రాజు

ఇగ తర్డ్‌ఫ్రంట్



తెలిదేవర భానుమూర్తి

నడిరాత్రి. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌ మంటున్నయి. సడక్ మీద ఆడొక మోటర్ ఈడొక లారి బోతున్నది. పోలీసోల్లు జీపుల గస్తి దిర్గుతున్నరు. దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురు జూస్తున్నరు. అందరు పండుకున్నరు. కొందరు నిద్రరాక అటిటి బొర్లుతున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందలగడ్డ దిక్కు బోబట్టిండు

బొందలగడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు సుత విక్రమార్కుని లెక్కనే దినం పూట పంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు. పొద్దుమీకినంక గానికి వొండుకోబుద్ది గాలేదు. గాడు హోటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. బిర్యాని తిన్నంక సిగిలేటు ముట్టిచ్చుకుండు. సిగిలేటు దాక్కుంట గాడు ఇంటికి వొచ్చిండు. టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంటనే గాడు నిద్రబోయిండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. ఎప్పటిలెక్కనే సైకిల్ గంటి సప్పుడినంగనే బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్లు గొడ్తున్నదనుకోని నాలుగైదు పార్లు విక్రమార్కుడు సైకిల్ గంటి బజాయించిండు. గంటి సప్పుడుకు బేతాలుడు నిద్రలేసిండు. సల్లటి నీల్లతోని మొకం గడుక్కుండు. ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క ఎక్కి గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను గూసుండబెట్టుకోని గుంతలు, ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త. ఇను. ఎండకాలం రాలేదు. గని ఎండలు దంచిగొడ్తున్నయి. ఎలచ్చన్లు రాలేదు. గని ఎలచ్చన్ల మహౌల్ ఉన్నది. కాంగ్రెస్ బస్సుయాత్ర జేస్తున్నది. బస్సుయాత్ర జేస్కుంట గవిజేస్తం, గివిజేస్తం అని జెప్తున్నది. ముఖ్యమంత్రి కెసిఆర్ తర్డ్ ఫ్రంట్ బెడ్తమన్నడు. గాదాన్ని ముంగట ఉండి గాయిన్నే నడిపిచ్చెతందుకు రడీ గున్న అని జెప్పిండు. గీ ఫ్రంట్ కాంగ్రెస్, బిజెపిలకు కిలాఫ్ ఉంటదని గాయిన అన్నడు. బిజెపి సర్కార్ వొచ్చి నాలుగేండ్లు అయితున్నా ఏం జెయ్యలేదని గాయిన జెప్పిండు. బిజెపి బోతె కాంగ్రెస్ వొస్తది. కాంగ్రెస్ బోతె బిజెపి వొస్తది. గీ రొండు పార్టిలతోని దేసంకు ఎసుంటి పాయిదలేదు. కాంగ్రెస్ జెనంకు చెయ్యి ఇస్తది. బిజెపి జెనం చెవుల తామర పూలు బెడ్తది. గీ రొండు పార్టీల కిలాఫ్ కద్మ పార్టిలన్నిటితోని తర్డ్ ఫ్రంట్ బెట్టాలని కెసిఆర్ అన్నడు. దేసంల



శానమందికి కొల్వులు లేవు. రైతులు పురుగుల మందు దాగి పానం దీసు[illegible]. బేంకులను మోసం [illegible] అసుంటోల్లు కోట్లాదిరూపాలతోని పారిన్ దేసాలకు ఉడాయిస్తున్నరు. బిజెపి సర్కార్ ఏం జేస్తున్నది? సూస్కుంట గూసుంటున్నది అని కెసిఆర్ అన్నడు. దేసమంత దిర్గుత అపొజిసన్ పార్టిలతోని మాట్లాడ్త. గంతేగాకుంట వజీప దీస్కున్న ఐఎఎస్ అపిసర్లతోని గూడ మాట్లాడ్త. తర్డ్ ఫ్రంట్ ఎట్లుంటె బాగుంటదో అర్సుకుంట అని గాయిన అన్నడు. తర్డ్ ఫ్రంట్ అంటె మూడో అడుగు అసువంటిది. కెసిఆర్ వామనునసుంటోడు. వామనుడు మూడు అడుగులు అడిగి మూడో అడుగుతోని బలిచక్రవర్తిని పాతాలంలకు తొక్కిన తీర్గ కాంగ్రెస్, బిజెపిలను కెసిఆర్ పాతాలంలోకి తొక్కుతడని కొందరు టిఆర్ఎస్ లీడర్లు అన్నరు.

పశ్చిమబెంగాల్ ముక్యమంత్రి మమతా బెనర్జీ, కెసిఆర్‌ను ఫోన్ జేసి

"తమ్మీ తర్డ్ ఫ్రంట్ బెట్టు. మీ ఎంబడి మేమున్నం. నేను గూడ కద్మపార్టిలతోని మాట్లాడి తర్డ్‌ఫ్రంట్ల షరీక్‌గమ్మని జెప్త. మనమంత ఒక్కటైతె బిజెపి లాపతా అయితది" అని అన్నది.

అసదుద్దీన్ ఒవైసీ తర్డ్‌ఫ్రంట్‌కు మదద్ ఇస్తనన్నడు. పవన్‌కల్యాన్ గూడ తర్డ్ ఫ్రంట్‌కు మదద్ ఇస్తనని జెప్పిండు. చత్తీస్‌గడ్ మాజీ ముక్యమంత్రి అజిత్ జోగి మదద్ ఇస్తనన్నడు. ఇంతకు ముందు ఎన్టీరాంరావ్ యునైటెడ్ ఫ్రంట్ బెట్టిండు. గదే తీర్గ గిప్పుడు కెసిఆర్ తర్డ్ ఫ్రంట్ అంటున్నడు. దేస రాజకీయాలను [illegible] అలగ్ [illegible] కెసిఆర్ అన్నడు. కట్టెలన్ని [illegible] ఎవ్వరికి ఇరగ్గొట్టుడు శాతగాదని గాయిన జెప్పిండు. తర్డ్ ఫ్రంట్ అన్కుంట కెసిఆర్ కొత్త డ్రామ ఆడుతున్నడు. టిఆర్ఎస్ సర్కార్ అన్నిట్ల ఫేలైంది. గవ్వి జెనంకు గండ్లబడకుండ జేసెతందుకే కెసిఆర్ తర్డ్ ఫ్రంట్ అంటున్నడు అని టిపిసిసి ప్రెసిండెంట్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నడు. మమతా బెనర్జీ, కెసిఆర్‌కు ఫోన్ జెయ్యలేదు. కేశవరావు, మమతా బెనర్జీకి ఫోన్ జేసి తర్డ్ ఫ్రంట్ బెడ్తున్నమని జెప్పిండు అని గాయిన అన్నడు.

కెసిఆర్ తర్డ్ ఫ్రంట్ బెడ్త అనంగనే ప్రతాని మోదీ, అమిత్ షాను బిల్సిండు.

"కెసిఆర్ తర్డ్ ఫ్రంట్ బెడ్తడట గదా" అని మోదీ అన్నడు.

"గాయిన తర్డ్ ఫ్రంట్ బెడ్తనంటె మనం ఫికర్ బడే పనే లేదు. తర్డ్ ఫ్రంట్ బెడ్తె అపొజిసన్ ఓట్లు అన్ని చీలిపోతయి. మనమే గెలుస్తం. మీ గురించి కెసిఆర్ మర్యాద లేకుంట మాట్లాడిండు. గాదాని మీద లొల్లి జెయ్యుమని మనోల్లతోని జెప్పిన" అని అమిత్ షా అన్నడు.

"గాయిన జెప్పిన తీర్గనే ప్రగతిబవన్ కాడ్కి బోయి లొల్లిబెట్టెతందుకు బిజెపోల్లు కోషిస్ జేసింద్రు. ఇంతకు మోదీని కెసిఆర్ మోదీ గాడు అని అన్నడా? గీ దాని మీద గాయిన ఏమన్నడు? గీ సవాల్‌కు. జవాబ్ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ పంపుచర్ అయితది"అని బేతాలుడు అన్నడు.

"నేను మోదీని గాడు అని అనలేదు. గాడ్ అని అన్న. గాడ్ అంటె దేముడు. మోదీ గాడ్ అసుంటోడు గాదని నేను అన్న అని కెసిఆర్ జెప్పిండు" అని విక్రమార్కుడు అనంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందల గడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్:9959150401



వేలాది స్టేజి నాటకాల్లో విలక్షణమైన నటనతో అలరించి.. వందలాది సీరియల్స్‌లో.. 120 సినిమాల్లో బామ్మ పాత్రతో ప్రేక్షకులను మెప్పించిన కళాకారిణి ఆమె. నాటకరంగం నుంచి దూరదర్శన్ ఆర్టిస్టుగా ఎదిగి.. వెండితెరపై ఎందరో ప్రముఖ నటీనటులతో నటించి.. తెలుగు సినీ కుటుంబానికే బామ్మగా మారారు. స్టేజి ఆర్టిస్టుగా, డబ్బింగ్ వాయిస్ ఓవర్‌గా, సినీనటిగా ఎన్నో పురస్కారాలు, అవార్డులు అందున్నారు. ఆమే ప్రముఖ నటి రత్నసాగర్. మూడు దశాబ్దాలుగా నటనారంగంలో బామ్మగా తన నటనతో తెలుగువారి ప్రేమాభిమానాలు అందుకుంటున్న ఆమె నటప్రస్థానం మానవి కోసం..

సినీ కుటుంబానికే బామ్మగా..!

నాన్న నారాయణస్వామి ఆర్టీసిలో సిఏగా పనిచేసేవారు. అజామాబాద్‌లో ఉండేవాళ్లం. ఆర్టీసి హైస్కూలులో పదోతరగతివరకు చదువుకున్నాను. స్కూలు స్థాయిలో నిర్వహించే నాటకాల్లో, ఆటలపోటీల్లో నా పేరు ఫస్ట్ ఉండేది. నాటకాల్లో సాంఘిక, చారిత్రక నాటకాలే ఎక్కువగా ఇష్టం. ఎందుకో పౌరాణిక పాత్రలంటే ఇష్టం లేదు. నాటక ప్రదర్శనల్లో గురువులు భానుప్రకాష్, రాంకుమార్, సుబ్బారావు తదితరుల వద్ద ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. జిల్లాల ఎల్లలు దాటి నాటకాలు ప్రదర్శించడంతో నా పేరు అన్ని నాటక సమాజాల వారికి, పరిషత్తుల వారికి తెలిసిపోయింది. ప్రతి ఏటా మే నెలలో నాటక కళాపరిషత్తులు జరిగేవి. వాటిలో పాల్గొనడమే కాకుండా ప్రతిసారి బెస్ట్ ఫర్మామెన్స్ అవార్డులు నాకే వచ్చేవి. 1969లో చిన్నచిన్న వేదికలపై ప్రారంభించిన నాటక ప్రదర్శనలకు విశేషాదరణ ఉండేది. 1970లోనే రేడియో ఆర్టిస్టుగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు ఉంది. 1973నాటికి పెద్ద స్టేజీలపై నాటకాలు వేయడం ప్రారంభించాను. రెండున్నర గంటల ప్రదర్శనలకు 75రూపాయలు, 45నిమిషాల ప్రదర్శనలకు 50రూపాయల పారితోషికం ఇచ్చేవారు. దూరదర్శన్‌లో వందకు పైగా సీరియల్స్‌లో నటించాను. ఇప్పటివరకు దాదాపు నాలుగువేల నాటక ప్రదర్శనలు ఇచ్చాను.

ఆంధ్రాబ్యాంకులో పనిచేస్తూ..

నాటకాలలో నటించే విద్యాసాగర్‌గారితో కలిసి 'వాంటెడ్ ఫాదర్' నాటికలో మొదటిసారి నటించాను. ఆ తర్వాత ఇద్దరం కలిసి చాలా నాటకాల్లో నటించాం. మా ఇంట్లో వారి అనుమతితో నాటికలో అయిన పరిచయం పెండ్లి వరకు సాగింది. పెండ్లి తర్వాత కూడా ఆయన జాబ్ చేస్తూనే అవకాశం వచ్చినప్పుడల్లా కలిసి నాటకాలు వేసేవాళ్లం. 1976లో నాకు ఆర్టీసిలో క్లర్కుగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం, ఇంటి బాధ్యతతో పాటు నాటకాలు మా జీవితంలో ఒక భాగమై పోయాయి. 45 నిమిషాల నిడివి గల 'లిఫ్ట్' నాటికలో మేమిద్దరమే పాత్రధారులం. ఎన్నో స్టేజీలపై ఈ నాటికలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాం. ఈ నాటక ప్రదర్శనలు చూసిన ప్రముఖ దర్శకులు జంధ్యాల గారు 1985లో 'ఈ చదువులు మాకొద్దు' సినిమాలో మా ఆయనకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఆయనకు చాలా సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పుడు సినీపరిశ్రమంతా చెన్నైలో ఉండేది. ఆయనకు ఉద్యోగ బాధ్యతలు, నాకు ఇంటి బాధ్యతలు పెరిగిపోవడంతో నా ఉద్యోగానికి లాంగ్‌లీవ్ పెట్టాను. ఆయన చెన్నై ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. 1986లో మా మకాం చెన్నైకి మారింది. మేం అక్కడ వసతి సదుపాయాలు కల్పించుకోవడానికి ప్రముఖ దర్శకులు రవిరాజా పినిశెట్టి చాలా సహాయం చేశారు.

జుట్టు మళ్లీ వస్తుంది.. అవకాశం మళ్లీ రాదు

1987లో 'నీకు నాకు పెళ్ళంట' సినిమాలో నాకు నటించే అవకాశం వచ్చింది. సినిమాలో ఎంతో ప్రాధాన్యత ఉన్న బామ్మ పాత్ర. అయితే గుండుతో సినిమాలో కనిపించాలి. ఆ రోజుల్లో విగ్గులతో మేనేజ్ చేసే ఆలోచన లేదు. నాదేమో పెద్ద జడ. ఏం చేయాలో తోచలేదు. పరిశ్రమలో మాకున్న స్నేహితుల సలహా అడిగాం. 'జుట్టు మళ్లీ వస్తుంది. కానీ, ఇంత మంచి అవకాశం మళ్లీ రాదుగా' అన్నారు. మాకు నిజమే అనిపించింది. తిరుపతి వెళ్ళి గుండు చేయించుకున్నాను. అలా 1987లో బామ్మగా తెలుగు సినీపరిశ్రమకు పరిచయం అయ్యాను. ఇప్పటివరకు నేను నటించిన అన్నీ సినిమాల్లోనూ నాది బామ్మ పాత్రే. నేను చెప్పిన వాయిస్‌ఓవర్ కూడా బామ్మలకే. ఫస్ట్ టైమ్ 'ఫిదా' సినిమాలో తెలంగాణ యాసలో హీరోయిన్ అత్తమ్మకు డబ్బింగ్ చెప్పాను.

ఇరవై ఏండ్లకే బామ్మగా..

చాలా చిన్నవయసులోనే బామ్మ పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించగలిగాను. నేను నటించిన ఫస్ట్ సినిమా సూపర్ హిట్ కావడంతో ఆ తర్వాత నాకు మంచి గుర్తింపుతో పాటు చాలా అవకాశాలు వచ్చాయి. కె. బాలచందర్ గారి దర్శకత్వంలో 'శిఖరం' సినిమాలో, కె. విశ్వనాథ్ గారి 'సిరిమువ్వల సింహనాదం'లోనూ అవకాశం వచ్చింది. కొన్ని తమిళ సినిమాల్లోనూ నటించాను. ఐదేండ్ల పాటు చెన్నైలో ఉన్నాం. ఇద్దరికి కూడా మంచిమంచి అవకాశాలు వచ్చాయి. ఆయనకు ఉద్యోగం, సినిమాలు, నాకు ఇంటిబాధ్యతలు సినిమాలతో బిజీగా మారాం.

నిర్మలమ్మగారు రెకమెండ్ చేసినా..

ఎంత బిజీగా ఉన్నా.. మంచి నాటక ప్రదర్శన ఉందంటే చాలు వెళ్ళిపోయేవాళ్లం. తిరిగి 1990లో హైదారాబాద్ వచ్చాం. తెలుగు సినిమాల్లో అమ్మమ్మ, నాన్నమ్మ అంటే నిర్మలమ్మగారే గుర్తుకువస్తారు. నటనలో జీవించే ఆమె 1991లో వచ్చిన చిరంజీవి గారు త్రిపాత్రాభినయం చేసిన 'ముగ్గురు మొనగాళ్ళు' సినిమాలో బామ్మ పాత్రకు నన్ను రెకమెండ్ చేశారు. ఆ సినిమా నాకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చింది. నిర్మలమ్మగారు వేయగలరు అనుకున్న పాత్రలకు ఆమె నన్ను రెకమెండ్ చేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

అండగా నిలబడిన పరిశ్రమ

1992వరకు అనేక సినిమాల్లో బిజీషెడ్యూల్స్‌లో ఉన్న సమయంలో మా ఆయనకు చాలా తీవ్రస్థాయిలో పెరాలసిస్ వచ్చింది. దాదాపు ఐదేండ్లపాటు మంచాన పడ్డారు. కొన్నేండ్ల పాటు చికిత్స చేసిన తర్వాత కొద్దిగా కోలుకున్నారు. ఆయనను, ఇంటిని చూసుకోవాలని నేను పనిచేయడం మానేశాను. అనారోగ్యంతో ఆయన వాలెంటరీ రిటైర్ట్‌మెంట్ తీసుకున్నారు. ఈ కష్టకాలంలో సినీపరిశ్రమ మాకు ఎంతో అండగా నిలబడింది. ఆయన కాస్త కోలుకున్న తర్వాత, తన పనులు తానే సొంతంగా చేసుకుంటున్నారన్న నమ్మకం కలిగిన తర్వాత మళ్లీ నాకు సినిమాల్లో అవకాశాలు ఇచ్చారు.





డబ్బింగ్ ఆర్టిస్టుల కోసం..

కళాకారులకు ఎంత ప్రావీణ్యం ఉన్నా వారికి సరైన అవకాశాలు రాక ఇబ్బంది పడుతుంటారు. కొంతమందికి నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్నా.. శిక్షణ ఇచ్చే సంస్థలు ఉండవు. అందుకే మేం హైదరాబాద్‌కు రాగానే డబ్బింగ్ ఆర్టిస్టుల కోసం ఒక యూనియన్ ఏర్పాటు చేశాం. ఇప్పటికీ డబ్బింగ్ ఆర్టిస్టుల యూనియన్‌కు ఫౌండర్ సభ్యురాలిగా ఉన్నాను. శిక్షణతో పాటు అవకాశాలు కూడా కల్పించాం. మా వద్ద శిక్షణ తీసుకున్నవారు ఇప్పుడు చాలా చానెల్స్‌లో పెద్దస్థాయిలో ఉండటం చాలా ఆనందం ఉంది.

బామ్మగా 120 సినిమాల్లో..

నాకు 20 ఏండ్ల వయసు ఉన్నప్పుడు మొదటిసారి బామ్మగా నటించాను. అప్పటి నుంచి ఇప్పటివరకు 120 సినిమాల్లో బామ్మగా నటించాను. పాత్ర చిన్నదైనా ప్రాముఖ్యత ఉంటేనే చేస్తాను. సినీపరిశ్రమలోని ప్రముఖ హీరోలు, దర్శక నిర్మాతలంతా 'బామ్మ.. వచ్చారా? బామ్మ బాగున్నారా?' అంటూ ప్రేమతో పలకరిస్తారు. ఇప్పుడు ఫీల్డ్‌లోకి వస్తున్న కొత్తవారు కూడా ఎంతో ఆప్యాయంగా ఉంటారు. వారి ప్రేమాభిమానాలు చూసినప్పుడు సినీకుటుంబానికి నిర్మలమ్మగారి తర్వాత నేనే బామ్మను అని మురిసిపోతాను. చిరంజీవిగారి సినిమాల్లో బామ్మగా నటించిన నేను ఆయన కొడుకు సినిమా 'రంగస్థలం'లోనూ బామ్మగా నటించాను. గతంలో ఎప్పుడు కనిపించని గెటప్‌లో ఈ సినిమాలో కనిపిస్తాను.

✍ వి. యశోద

కూర్చునేవారి కోసం...



దాదాపు ఎనిమిది గంటలపాటు కుర్చీలో కూర్చోని పని చేసే వారు చాలామంది ఉంటారు. ఆ సమయంలో కూర్చునే పద్ధతి సరిగా ఉండదు. గాలి కూడా సరిగా పీల్చుకోలేరు. ఒక్కొక్కసారి ఊపిరి బిగబట్టి కంప్యూటర్‌కు అతుక్కుపోతాం. అలా చేయడం వల్ల శరీరం త్వరగా అలసిపోతుంది. కాబట్టి కనీసం మూడు గంటలకోసారి అయినా డీప్ బ్రీతింగ్ తప్పనిసరి. దాంతో పాటు చిన్న చిన్న వ్యాయామాలు కూడా చేస్తే ఒత్తిడి సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

వెన్నెముక నిటారుగా ఉంచి స్థిరంగా కూర్చోవాలి. నాసికా రంధ్రాల ద్వారా గాలిని పీల్చుకోవాలి. గొంతు పైభాగంలో రాపిడి చేస్తున్నట్టుగా గాలి లోపలికి పోవాలి. ఇలా చేయడాన్ని 'ఓషియానిక్ బ్రీతింగ్' అంటారు. ఈ వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయి. అవేంటో చూద్దాం:

జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థను శక్తివంతంగా ఉంచేందుకు తోడ్పడుతుంది. ఒత్తిడి, ఆందోళనను దూరం చేస్తుంది. ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వేడిగాలి వలన జలుబు, ఆస్తమా వంటి ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుంది. థైరాయిడ్ సమస్య ఉన్నవారికి ఈ వ్యాయామం అద్భుతంగా పనిచేస్తుంది. ❄

మళ్లీ మళ్లీ వాడితే!



ఒక్కసారి వంటకు ఉపయోగించిన నూనెను మళ్లీమళ్లీ వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయని కొన్ని అధ్యయనాల ద్వారా వెల్లడైంది. అలాగని నూనె మిగిలితే వృధాగా బయటపడేయడానికి మనసొప్పదు. ఒకవేళ వడపోసి వాడుకుంటే తెలియని వెలితి. ఎలాగైన సరే ఆ నూనెను వాడుతుంటారు. అయితే ఇలా వాడిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేసి ఉపయోగించడం ద్వారా మెదడు సంబంధిత వ్యాధులతో పాటు క్యాన్సర్ లాంటి వ్యాధులొచ్చే ప్రమాదముందని తాజా పరిశోధనలో తేలింది.

బస్క్యూ దేశానికి చెందిన యూనివర్శిటీ నిర్వహించిన పరిశోధనలో ఒకసారి వంటకు ఉపయోగించిన నూనెను (అంటే గారెలు, బూరెలు, పూరీలు చేసి మిగిలిన నూనెను) మళ్లీ కూరలు, వేపుళ్లలో చేర్చడం ద్వారా క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మళ్లీ మళ్లీ నూనెను వేడిచేయడం ద్వారా టాక్సిక్ ఆల్డీహైడ్స్ నూనె నుండి విడుదలవుతుందని, దీనితో మన శరీరానికి ముప్పు తప్పదని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వేడిచేసిన నూనెను వాడటం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్ అందవు. దాంతో పాటు హార్మోన్లు, ఎంజైముల వ్యవస్థపై ఆ నూనె ప్రభావం చూపుతుందని పరిశోధకులు మరియా డొలొరెస్ గుయ్లెన్ చెప్పారు. మూడు రకాల నూనె (ఆలివ్, సన్ ఫ్లవర్, ఫ్లాక్స్ సీడ్స్ ఆయిల్) లపై ఈ పరిశోధన జరిగింది. ఈ నూనెలను మళ్లీ వేడి చేసి ఉపయోగించడం ద్వారా క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులతో ముప్పు పొంచి ఉందని పరిశోధకులు అంటున్నారు. కాబట్టి వేపుళ్లకు తగినంత నూనె ఉపయోగించడం మంచిది. దాంతో పాటు ఒక్కసారి వాడిన నూనెను బయట పడేయడం మరి మంచిది. ❄




అరటి అందాలు...









అరటి పండ్లు అంటే ఇష్టపడని వారుండరు. పసుపు రంగులో ఉండే ఈ పండ్లతో ఎన్నో అబ్బురపరిచే బొమ్మలను తయారు చేసుకోవచ్చు. ఇవి చూడముచ్చటగా కనిపిస్తాయి. కాస్త సృజనాత్మకంగా ఆలోచిస్తే చాలు చిత్రవిచిత్రమైన బొమ్మలను తయారు చేసుకోవచ్చు. సముద్రంలోని తిమింగలం నీటి బయటకు ఎగిరినట్టు, ఆక్టోపస్ ముడుచుకున్నట్టు, చిన్న చిన్న పక్షుల బుడి బుడి నడకలు,, నీటిలో హంసల విన్యాసాలు.. పడవలో ఒంటరిగా ప్రయాణించడం.. చేతితో ఒకరికొకరు ఉత్తరాలు రాసుకోవడం ఇలా ఒక్కటేమిటి ఎన్నో ఆకర్షణీయమైన బొమ్మలను అరటి పండ్లతో తయారు చేసుకోచ్చు. అలాంటి అద్భుతమైన బొమ్మలు ఈ వారం మీ కోసం...

ఇంటీరియర్ లైటింగ్...

ఇంట్లో వెంటిలేషన్ తక్కువగా ఉంటే గదులు చాలా డల్‌గా, గదిలో వాతావరణాన్ని కటిపడేసినట్టు కనిపిస్తాయి. వెంటిలేషన్‌తో పాటు లైటింగ్ ఉండే బల్బ్‌లను ఉపయోగించడం మంచిది. ఎందుకంటే ఇల్లు కాంతివంతంగా, ప్రకాశవంతంగా ఉంటే మానసిక ఒత్తిళ్ల దూరం అవుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అవేంటో తెలుసుకుందాం...

హాల్: హాలో లైటింగ్ బాగుంటేనే ఇల్లు అందంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది. మూడు లేదా నాలుగు కార్నర్స్ నుంచి లైటింగ్ పడే విధంగా చిన్న బల్బ్‌లను ఎంచుకుంటే చాలా బాగుంటుంది. డెకరేటివ్ ఐటెమ్స్ ను హైలెట్ చేసే విధంగా లైటింగ్ ఉండాలి. సాయంత్రం రిలాక్స్ అవడానికి లేత వెలుతురునిచ్చే లైట్లను ఏర్పాటు చేసుకోవాలి.

బెడ్ రూమ్: ఇక ప్రశాంతతను నిచ్చే గదిగా బెడ్ రూమ్‌ను చెప్పుకోవచ్చు. విశ్రాంతి, ప్రశాంతత కోసం రిలాక్సేషన్ ను కలిగించే బెడ్ సైడ్ లాంప్స్ ను ఎంచుకోవాలి. బెడ్ సైడ్ లాంప్స్ దొరకకపొతే ఫ్లోర్ లాంప్స్ కి ప్రిఫరెన్స్ ఇవ్వాలి. బెడ్ ఫ్రంట్ వాల్ పై కూడా దృష్టి పెట్టాలి. ఆ వాల్ పై కూడా లైటింగ్ చక్కగా పడేలా ఏర్పాట్లు చేస్తే బెడ్ రూమ్‌కు అందమైన లుక్ వస్తుంది.



కిచెన్: కిచెన్ లో వెలుతురు చక్కగా ఉండడం ఎంతో అవసరం. ఆహారాన్ని సిద్ధం చేసేటప్పుడు సరైన పదార్థాలను వాడుతున్నారా లేదా అని తెలుసుకోవడానికి వెలుతురు అవసరం. డిమ్మెర్ ఉన్న ఓవర్ హెడ్ లైటింగ్ కు ప్రాధాన్యతనివ్వండి. అండర్ కేబినేట్ లైట్స్ ను కూడా వాడవచ్చు. కిచెన్ కార్నర్స్, సింక్ దగ్గర వెలుతురు సరిగ్గా పడేలా చూసుకోవాలి.

డైనింగ్ హాల్: అందరూ కలిసి చక్కాగా ముచ్చటించుకుంటూ భోజనం చేస్తారు. గ్రాండ్ లుక్ కోసం డైనింగ్ టేబుల్ ఘన [illegible]ర్ ను ఏ[illegible]టు చేసుకుంటే మరింత అందంగా కనిపిస్తుంది. ❄

ఇట్లచేద్దాం

నారింజ తొక్కను ఎండబెట్టి, పొడి చేసి, సున్నిపిండిలో కలుపుకోవాలి. ఈ పిండిని స్నానానికి ముందు ఒంటికి పట్టించాలి. ఇలా పది నిమిషాలు పట్టించాలి. ఆ తర్వాత స్నానం చేస్తే చర్మంపై ఉండే మృతకణాలన్నీ సులభంగా తొలగిపోతాయి. చర్మం మృదువుగా అవటమే కాకుండా, కొత్త మెరుపును సంతరించుకుంటుంది.

నేడు టీఆర్‌ఎస్‌ఎల్పీ భేటీ

అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ, ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ శాసనసభాపక్షం (టీఆర్‌ఎస్‌ఎల్పీ) భేటీ కానుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావు దిశానిర్దేశం చేయనున్నారు చివరి బడ్జెట్ కావడంతో ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వంపై ఎదురుదాడి చేసే అవకాశం ఉండడంతో దాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించనుంది. ఈ సమావేశంలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ఖరారు చేయనుంది. మూడు రాజ్యసభ సీట్లలో ఒకటి సంతోష్‌కుమార్ పేరు దాదాపు ఖరారైనట్టేనని టీఆర్‌ఎస్ వర్గాలు చెప్పాయి. మరోక సీటు గొల్ల, కుర్మలకు ఇచ్చే అవకాశం ఉండడంతో ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, టీఆర్‌ఎస్ నాయకులు రాజయ్యయాదవ్, నోముల నరసింహయ్య పేర్లపై చర్చ జరుగుతున్నది. మూడో సీటు రెడ్డి, మైనార్టీ, ఎస్సీ, మహిళలలో ఏదో ఒక సామాజికవర్గం నుంచి ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఇందులో ముఖ్యంగా హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి నిరంజన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల జీతం హర్షణీయం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల జీతం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్జేడీ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం హర్షం ప్రకటించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు గాదె వెంకన్న, ప్రధాన కార్యదర్శి వై కుమారస్వామి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల జీతం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. 12 నెలల జీతంతోపాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరారు.

వేతనాలు పెంచిన సీఎంకు ధన్యవాదాలు : టీఆక్టా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు 75 శాతం పెంపుదల దస్త్రంపై సంతకం చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (టీఆక్టా) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు టీఆక్టా అధ్యక్షుడు ఎం రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌కుమార్‌లోధ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేతనాలు పెంచేందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడేండ్ల బాలికపై లైంగికదాడి కేసులో..

నిందితుడికి పదేండ్ల జైలు శిక్ష

కోల్‌కతా: బెంగాల్‌లో మూడేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన దోషికి పదేండ్ల జైలు శిక్షను స్థానిక న్యాయస్థానం శుక్రవారం విధించింది. పదేండ్ల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానాను దోషి తపస్ మజుందార్(40)కు పోక్సో కోర్టు న్యాయమూర్తి మనాష్ బసు విధించారు. మూడేండ్ల బాలికసహా ఆమె తల్లిదండ్రులు పశ్చిమ బెంగాల్‌లో నదియా జిల్లాలోని సోనాతల ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు గతనెల 25న హాజరయ్యారు. ఆ వేడుకలో బాలిక తప్పిపోవడంతో గాలింపు మొదలుపెట్టారు. దగ్గరలోని అటవీప్రాంతంలో అరుపులు వినిపించడంతో అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న నిందితుడిని స్థానికులు చితకబాది పోలీసులకు అప్పజెప్పినట్టు విచారణలో పేర్కొన్నారు.

పెద్ద రుణాలకు పాస్‌పోర్టు తప్పనిసరి

- కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధన



న్యూఢిల్లీ: బ్యాంకులకు పెద్ద ఎత్తున రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న ఘటనలు పెరుగుతుండటంతో ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కొత్త నిబంధన అమలులోకి రానున్నది. 50 కోట్లకు పైగా రుణాలు తీసుకునే వారు ఇకపై తమ పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరిగా సమర్పించాలని ప్రభుత్వం వెల్లడించింది. ఆర్థిక నేరాల్ని అరికట్టేందుకు ఈ చర్యలు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తున్నది. కొత్తగా రుణాలు తీసుకునే వారి పాస్‌పోర్టు వివరాలను బ్యాంకులు సేకరిస్తాయని, రుణ గ్రహీతలు 45 రోజుల్లోగా వారి పాస్‌పోర్టు వివరాలు సమర్పించాలని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల బ్యాంకింగ్ వ్యవస్థను కుదిపేసిన పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా ఆర్థిక శాఖ తెలిపింది. అయితే ఈ నిబంధన ఎప్పట నుంచి అమల్లోకి వస్తుందనే విషయంలో స్పష్టత రాలేదు.

విమానయాన సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా వలయం క్రియేషన్స్

- రూపొందించిన తెలంగాణ పెవిలియన్



వింగ్స్ ఇండియా 2018 అంతర్జాతీయ ఏరోస్పేస్ సదస్సులో వలయం క్రియేషన్స్ (యాడ్ ఏజెన్సీ) వారు రూపొందించిన తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రివర్యులు శ్రీ కె టి రామారావు తెలంగాణ పెవిలియన్‌ను సందర్శించి పెవిలియన్ తయారు చేసిన తీరును ప్రశంసించారు. సదస్సులో హెలికాప్టర్ నమూనాలో తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రాంగణం ప్రశంసలను అందుకుంది. ప్రాంగణాన్ని రూపొందించిన యాడ్ ఏజెన్సీ వలయం క్రియేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ..వినూత్న రీతిలో రాష్ట్ర ప్రతిష్టను, అంకితభావాన్ని తెలియజేసే విధంగా పెవిలియాన్ని రూపొందించామన్నారు.

రాజ్యసభ బరిలో బలరాంనాయక్?

- నేడు కాంగ్రెస్ అధికారిక ప్రకటన

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తున్నది. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌ను బరిలోకి దించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇదే అంశాన్ని ఆయన తనను కలిసిన విలేకరులకు చెప్పారు. ఏఐసీసీ అనుమతి రాగనే అధికారికంగా ఆయన అభ్యర్థిత్వాన్ని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించనున్నారు. టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, మాజీ ఎంపీ అజహరుద్దీన్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అధిష్టానం మాత్రం బలరాంనాయక్ వైపే మొగ్గుచూపినట్టు పార్టీ వర్గాలు చెప్పాయి.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు మావోయిస్టు పార్టీ మద్దతు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈనెల 13న ఎమ్మార్పీఎస్ చేపట్టనున్న బంద్‌కు సీపీఐ(మావోయిస్టు) పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ(మావోయిస్టు) పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన, ప్రజాస్వామికమైన ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఆదివాసీలు, ప్రజలపై జరుగుతున్న రాజ్యహింసను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

టీడీపీలో పెద్దల పేచీ

- అభ్యర్థులను తేల్చని అధిష్టానం
- ఆర్థికమే కీలకం ?
- విశాఖలో ఎంవీవీఎస్ మూర్తికి సీటు ఇవ్వాలని జలదీక్ష
- మూడో అభ్యర్థిపై సందిగ్ధం



ఉత్తరాంధ్ర టీడీపీ సీనియర్ నేత మూర్తికి రాజ్యసభ సీటు ఇవ్వాలని శనివారం విశాఖలోని ఆర్కేబీచ్‌లో జల దీక్ష చేస్తున్న ఆయన అనుచరులు

అమరావతి : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ముదురుపాకాన పడింది. ఎవరినీ తేల్చకపోవడం, కుల సమీకరణలు, రాజకీయ అనుభవాలు, జాతీయస్థాయిలో రాజకీయం నడపగలిగే సమర్థత అంటూ పెట్టుకున్న ప్రాధాన్యతలతో ఎంపిక ప్రక్రియ నానుతోంది. రెండురోజుల గా దీనిపైనే చర్చ జరుగుతున్నా ఇంకా తేల్చలేదు మూడో అభ్యర్థిని బరిలోకి దింపే విషయంలోనూ సందిగ్ధత కొనసాగుతోంది. ఆనవాయితీ ప్రకారం నామినేషన్ ముందు రోజు రాత్రి మాత్రమే అభ్యర్థుల వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దీంతో గ్రూపు తగాదాలు తెరపైకి వచ్చాయి. విశాఖలో ఎంవీవీఎస్ మూర్తికి రాజ్యసభ అభ్యర్థిత్వం ఇవ్వాలని కోరుతూ ఆర్కె బీచ్‌లోటీడీపీ నాయకులు జలదీక్ష చేశారు. మిగిలిన నేతల అనుచరులు కూడా ఇదేవిధమైన డిమాండ్లు చేస్తున్నారు. ఎస్సీ, బీసీ నుండి చెరొకరికి రాజ్యసభ సీట్లను కేటాయిస్తామని టీడీపీ అధినేత కొంత కాలంగా చెబుతున్నట్లు సమాచారం. అయితే, తాజాగా సీఎం రమేష్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు టిక్కెట్ ఇవ్వాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు సమాచారం. ఇటీవల రాయలసీమ రాజకీయాల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపులోనూ రమేష్ ముఖ్యపాత్ర పోషించారని కూడా భావిస్తున్నట్లు సమాచారం. దీంతో బీసీ, ఎస్సీలలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తికి దారి తీసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం టీడీపీ కి కీలకంగా ఉన్న బీసీలకు సీటు ఖరారు చేసే అవకాశం ఉంది. సీనియర్ నేతగా ఉన్న దేవేందర్‌గౌడ్ తనకు మరో అవకాశమివ్వాలని అధిష్టానానికి లేఖ రాశారు. మరో సీనియర్ నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కూడా తనకు రాజ్యసభ సీటు ఇవ్వాలని కోరుతున్నారు.

'రాజ్యసభ ' కోసంభారీ నజరానాలు..!



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు : రాజ్యసభ స్థానం కోసం ఓ బడాపారిశ్రామికవేత్త తన సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తన చిరకాల కోరిక తీర్చుకోడానికి రూ.కోట్లు ఖర్చుచేయ డానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన అంతర్జాతీయ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీ రాజ్యసభ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. వైఎస్ జగన్ 2014 ఎన్నికల్లో రాజ్యసభ టికెట్ ఇస్తామని చెప్పడంతో ఆ పార్టీ అభ్యర్థుల కోసం భారీగా డబ్బు కుమ్మరించారు. రాజ్యసభ స్థానం కోసం తొలుత వైసీపీతో ఉన్న ఆయన మళ్లీ టీడీపీలోకి చేరారు. అక్కడ ఏలాంటి ప్రయోజనం లేకపోవడంతో ప్రస్తుతం వైసిపిలో చేరారు. దాంతో ఆయనకు ఆ పార్టీ రాజ్యసభ సీటు ప్రకటించింది. టీడీపీ మూడో అభ్యర్థిని పెట్టకుండా ఢిల్లీ స్థాయిలో రాజకీయాలు నడుపుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగా నెల్లూరు జిల్లాకు చెందిన ఓ ప్రముఖ జాతీయ నేతకు చెందిన సేవా సంస్థకు ఏకంగా రూ.25 కోట్లు ఇవ్వడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఎన్నికలు జరిగితే స్వపక్షంలోని ఎమ్మెల్యేల ఓట్ల కోసం భారీగా ఖర్చుపెట్టడానికి సముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అంతర్జాతీయ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా అనేక సామాజిక, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2014 ఎన్నికల సమయంలో తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. జగన్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తనకు రాజ్యసభ టికెట్ ఇస్తామని చెప్పారని, అప్పట్లో ప్రచారం చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం భారీగా ఖర్చుపెట్టినట్లు సమాచారం.

హెచ్‌సీయూలో అక్రమాలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ–ఉస్మానియ యూనివర్సిటీ/గచ్చిబౌలి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై నిరసనలు జ్వాలలు మొదలయ్యాయి. హెచ్‌సీయూలో జరిగిన అక్రమ నియామకాలపై సమగ్ర విచారణ జరిపి నాటి వీసీ రామకృష్ణ రామస్వామి, ప్రస్తుత వీసీ అప్పారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ఎస్ఎఫ్ఐ నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ ఎస్ఎఫ్ఐ నేతలు ఆర్.ఎల్.మూర్తి, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత వీసీ మతోన్మాదులు, కేంద్రానికి తొత్తుగా మారారని చెప్పారు. ఇద్దరు వీసీలు... కనీస విద్యార్హత లేకున్నా వారిని నచ్చిన వారికి ఉద్యోగాలిచ్చారని విమర్శించారు. జాతీయతను తప్పుగా చూపించిన వారిపై చర్యలు తీసుకోకుండా, వారికి ఉద్యోగాలు కల్పించడం సిగ్గుచేటని అన్నారు. ప్రస్తుత వీసీ అప్పారావు అనుసరించిన విధానాలతో రోహిత్‌ను కోల్పోయినట్టు గుర్తుచేశారు. అప్పారావు చర్యల వల్లే హెచ్‌సీయూ ఉనికి కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, సంధ్య, ఉమ, మమత, గణేష్, ప్రశాంత్, మధు, రవి, కరన్ పాల్గొన్నారు. హెచ్‌సీయూ అక్రమ నియామకాలపై నవతెలంగాణ వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

అన్నీ అక్రమాలే... నిలదీస్తే సెస్పెండ్

కుల్‌దీప్ – ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ అధ్యక్షుడు

హెచ్‌సీయూలో అన్నీ అక్రమాలే జరుగుతున్నాయి. ఎలాంటి అర్హతలు లేనివారిని, వారిని నచ్చిన వారిని నియమిస్తున్నారు. అక్రమ నియమాకాలు, ఇతర వ్యవహారాలపై నిలదీస్తే సస్పెండ్ చేస్తున్నారు. వీసీని వెంటనే మార్చాలి. ఆయన్ను మార్చితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఆయన తీరుతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు.

వీసీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

శ్రీరాగ్ – హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు

హెచ్‌సీయూలోని ప్రధాన పదవుల్లో వీసీ తమకు నచ్చిన వారిని మాత్రమే నియమించుకుంటున్నారు. అక్రమాలపై నవతెలంగాణ పత్రిక పలు విషయాలు బయటపెట్టింది. ప్రస్తుత వీసీ కంటే ఎందరో సీనియర్లు ఉన్నారు. వారిని పైకి రాకుండా వీసీ అడుగడుగునా అడ్డుకుంటున్నాడు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. వీటిపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

రైతులకు రూ. 5 లక్షల బీమా

ఏప్రిల్ నుంచి ప్రారంభం : మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

సంక్షేమ పథకాల్లో భాగంగా రైతులకు రూ. 5 లక్షలతో బీమా సౌకర్యం కల్పించనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు రైతులకు బీమా సౌకర్యం కల్పించడంపై ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం, ముంబాయి నుండి వచ్చిన ప్రతినిధులతో ఆదివారం మంత్రి నివాసంలో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీమియం చెల్లించే అంశంపై విధివిధానాలు రూపొందించేందుకు అధికారులతో సమావేశమైనట్టు చెప్పారు. కరీంనగర్‌లో జరిగిన ప్రాంతీయ రైతు సమన్వయ సమితి సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ రైతుకు రూ. 5 లక్షల బీమా కల్పిస్తామని ప్రకటించిన విషయం గుర్తు చేశారు. వీలున్నంత తొందరగా ఈ పథకం ప్రారంభిస్తామని, సూత్రప్రాయంగా ఈ ఏడాది ఎప్రిల్ నెల నుంచే ఈ పథకాన్ని ప్రారంభించే ఆలోచన ఉందన్నారు. ప్రతీ రైతుకు బీమా కవరేజ్ చేయడానికి మార్గదర్శకాలు వీలైనంత తొందరలో రూపొందిస్తామని చెప్పారు. దురదష్టవశాత్తు రైతు మరణించినట్టయితే బీమా మొత్తం రూ. 5 లక్షలు ఆ కుటుంబానికి అందుతాయని చెప్పారు. ఈ సౌకర్యం రైతుల కుటంబాలకు కొంత ఆర్థికంగా ఆదుకునేందుకు భరోసాగా ఉంటుందన్నారు. త్వరలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో పాటు అందరి అభిప్రాయాలను, సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. నివేదికను ముఖ్యమంత్రి గారికి సమర్పించి, వారి అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి, కమిషనర్ యం. జగన్మోహన్, ఉధ్యానశాఖ డైరెక్టర్ యల్. వెంకట్రామిరెడ్డి, ముంబాయి ఇన్సూరెన్స్ ప్రతినిధులు నాగరాజారావు, రామకష్ణన్ రీజనల్ మెనేజర్, సాయి సాయి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

నాగంకు లైన్ క్లియర్

- ఫలించిన కొప్పుల రాజు మంత్రాంగం
- సీనియర్ నేతలతో చర్చలు
- ఏఐసీసీ ప్లీనరీ తర్వాత కాంగ్రెస్ తీర్థం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

నాగం జనార్ధనరెడ్డి కాంగ్రెస్‌లో చేరటానికి లైన్ క్లియర్ అయింది. ఆయన చేరిక విషయంలో ఏఐసీసీ ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు రాష్ట్ర పార్టీ నేతలతో జరిపిన సంప్రదింపులు ఫలప్రదం అయినట్టు తెలిసింది. నాగం చేరికను మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డీకే ఆరుణ, ఎమ్మెల్సీ దామోదరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. అదే జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత జైపాల్ రెడ్డి నాగం చేరిక కోసం ఏఐసీసీ స్థాయిలో పావులు కదిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న కొప్పుల రాజు ఒక ప్రముఖ హోటల్‌లో శుక్రవారం అర్థరాత్రి వరకూ రాష్ట్ర నేతలతో చర్చించారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని రంగంలోకి దింపే అంశంతో పాటూ నాగం చేరిక విషయంలో ఆయన రాష్ట్ర నేతల అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీసీసీ సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో ప్రతిపక్ష నాయకుడు షబ్బీర్ ఆలీ తదితులు ఈ సమావేశానికి హాజరయ్యారు. నాగం చేరికను వ్యతిరేకిస్తున్న డీకే ఆరుణ, ఎమ్మెల్సీ దామోదరరెడ్డితో కూడా కొప్పుల రాజు చర్చలు జరిపినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే నేతలను చేర్చుకోవాలని రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని రాష్ట్ర నేతలకు కొప్పుల రాజు మరొక సారి గుర్తు చేసినట్టు వారు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ అశయాలు, సిద్ధాంతాలు నమ్మి వచ్చే వారిని సాదరంగా ఆహ్వానించాలని ఆయన కొప్పుల రాజు రాష్ట్ర నేతలకు చెప్పారు. నాగం చేరిక విషయంలో పార్టీలోని సీనియర్ నేతలంతా అంగీకిరిచంటంతో ఆయన చేరిక కేవలం లాంఛన ప్రాయమేనని తెలిసింది. ఈ నెల మూడవ వారంలో జరిగే ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల తర్వాత రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరాలని నాగం జనార్ధనరెడ్డి భావిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే : కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రభుత్వ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ ఉద్యమమే చేపడతామని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రకటించింది.

ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, ప్రచార కార్యదర్శి జబీఉల్లా శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లకు నాలుగు నెలల నుంచి జీతాలు అందక అవస్థలు పడుతున్నామని తెలిపారు. రెగ్యులర్‌గా జీతాలు అందే పరిస్థితి లేదని పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి జీతాల్లేక కాంట్రాక్టు లెక్చరర్లు అప్పులపాలు అవుతున్నారని తెలిపారు.

వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. 12 నెలల వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం దారుణమని తెలిపారు.

బీజేపీని ఓడించండి : వీరయ్య


నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ సర్కారును ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభల ముసాయిదాపై సమావేశం జరిగింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని ఉద్దేశించి వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజలను మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతోందని అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభల నిర్వహణకు సంబంధించిన అంశాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్ వివరించారు.

నేడు రెండో విడత పల్స్‌పోలియో

36,55,204 మంది పిల్లలకు చుక్కలు • నాసిరకం సేవలతో రోగులకు రిక్తహస్తం

• పోలియో రహిత సమాజ సుస్థిరతకు పాటుపడాలి : మంత్రి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పోలియో రహిత సమాజ సుస్థిరతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఆదివారం రెండో విడత పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రతి ఐదేండ్లలోపు చిన్నారికి పోలియో చుక్కలు పడే విధంగా చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. చుక్కలు వేసుకోని చిన్నారుల కోసం తరువాత వరుసగా రెండు రోజుల పాటు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేయాలని ప్రభుత్వం సంకల్పించిదన్నారు. 22,[illegible]68 పోలియో కేంద్రాల ద్వారా 95,500 సిబ్బంది పోలియో చుక్కలను వేయడానికి [illegible] చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రయాణాల్లో ఉన్న వారి కోసం 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లలో, రైల్వే స్టేషన్‌లలో మరియు ప్రధాన కూడళ్లలో ఏర్పాట్లు చేయడమైనదన్నారు. 787 మొబైల్ టీం, 2,280 రూట్ సూపర్‌వైజర్స్, 8,711 మంది ఎఎన్ ఎంలు, 27,045 ఆశా వర్కర్లు, 32,082 అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారని మంత్రి వివరించారు. గడిచిన ఏడేళ్లల్లో మన దేశం, [illegible] కేసులు నమోదైనందున మనం మరింత అప్రమత్తమైనామని మంత్రి చెప్పారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన నిర్వహించిన మొదటి విడత పల్స్ పోలియో కార్యక్రమం వందకు వంద శాతం విజయవంతమైందని మంత్రి అన్నారు. అదే తరహాలో ఈ సారి కూడా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్, స్కూల్ ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, ఐకేపీ, డిఫెన్స్, నేవీ, [illegible]టీసీ శాఖల సమన్వయంతో పోలియో చుక్కల [illegible]ర్యక్రమం జరుగుతుందని మంత్రి తెలిపారు.

కారుణ్య నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాలకు సింగరేణి యాజమాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని యాజమాన్యం శనివారం సర్క్యులర్ జారీ చేసింది. ఇటీవల జరిగిన సింగరేణి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు, గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కారుణ్య నియామకాలు చేపడతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. సింగరేణి కార్మికులు టీబీజీకేఎస్‌కు గెలిపించడంతో ఇచ్చిన హామీని అమలు చేయడంలో భాగంగా యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు, చనిపోయిన కార్మికుల పిల్లలకు వరంగా కారుణ్య నియామకాలు జరుగుతాయని ప్రకటించింది. కారుణ్య నియామకాలకు యాజమాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్, ఎంపీ కవితకు ధన్యవాదాలు తెలిపారు.

ఆస్ట్రేలియాకు మినహాయింపు: ట్రంప్



(ఫైల్)

దిగుమతి సుంకంపై అమెరికా వెసులుబాటు

వాషింగ్టన్: అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకం నుంచి ఆస్ట్రేలియాకు త్వరలోనే మినహాయింపు ఇవ్వనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇటీవల ట్రంప్ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్టీల్‌పై 25శాతం, ఉక్కుపై 10శాతం దిగుమతి సుంకాలను పెంచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఆదేశాలపై ట్రంప్ ఇటీవలే సంతకం చేశారు. అయితే అంతకంటే ముందే ఈ నిబంధన నుంచి కెనడా, మెక్సికోలకు మినహాయింపు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సుంకాల నుంచి మినహాయింపు కావాలనుకుంటే ఆ దేశాలు తమతో చర్చలు జరపాలని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఆస్ట్రేలియాకు దీని నుంచి మినహాయింపు ఇస్తున్నారు.

తాను ఆస్ట్రేలియా ప్రధాని మాల్కోమ్ టర్న్‌బుల్‌తో మాట్లాడానని ట్రంప్ తెలిపారు. టర్న్‌బుల్ కూడా ఒకే విధమైన మిలిటరీ, వాణిజ్య సంబధాలకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారని, తాము భద్రతా పరమైన ఒప్పందంపై సంతకాలు చేయనున్నామని, దీంతో తమ మిత్ర దేశమైన ఆస్ట్రేలియాపై స్టీలు, ఉక్కుపై దిగుమతులపై సుంకాలు విధించబోమని ట్రంప్ ట్వీట్ చేశారు. తాను ట్రంప్‌తో మాట్లాడినట్టు టర్న్‌బుల్ కూడా వెల్లడించారు. వాణిజ్యం, భద్రత అంశాలపై ట్రంప్‌తో తన సంభాషణ సాగిందన్నారు. ఆస్ట్రేలియా-అమెరికాల మధ్య వాణిజ్యం చాలా పారదర్శకంగా, పరస్పరం ఒకే విధంగా ఉంటుందని తెలిపారు. అమెరికా విధించిన కొత్త దిగుమతి సుంకాల నుంచి ఆస్ట్రేలియాకు మినహాయింపు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పారు. తమ దేశం నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే స్టీలు, అల్యూమినియంపై సుంకాలకు మినహాయింపు ఇచ్చినందువల్ల ఆస్ట్రేలియా, అమెరికాల్లో కూడా ఉద్యోగాలకు మంచి జరుగుతుందని చెబుతూ ట్రంప్ ట్వీట్‌కు టర్న్‌బుల్ రీట్వీట్ చేశారు.

కాలిఫోర్నియాలో కాల్పులు

- నలుగురి మృతి



యూంట్‌విల్లే: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న అతిపెద్ద వృద్ధుల, వికలాంగుల కౌన్సిలింగ్ సెంటర్‌లో సాయుధుడైన ఒక దుండగుడు ముగ్గురు మహిళలను కాల్చి చంపాడు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు కూడా చనిపోయాడు. తొలుత దుండగుడు ముగ్గురు వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకున్నట్టు తెలిసింది. పోలీసులకు, దుండగుడికి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. తర్వాత హోంలో పరిశీలించి చూడగా దుండగుడు సహా నలుగురు మరణించి కనిపించారు. అయితే వెటరన్స్ హోంలో ఉన్న ఆ ముగ్గురు మహిళలనే దుండగుడు ఎందుకు చంపాడనే విషయం తెలియరాలేదు. వారితో దుండగుడికి ఏదైనా సంబంధం ఉందా అనే విషయం స్పష్టం కాలేదు. దుండగుడి వివరాలను గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. చనిపోయిన ముగ్గురు మహిళలు వెటరన్స్ హోంలోని పాత్‌వే హోం ఉద్యోగులని గుర్తించారు. పలు యుద్ధాల్లో పాల్గొని మానసిక ఒత్తిడితో బాధపడుతున్న సైనికులకు పాత్‌వే హోంలో కౌన్సిలింగ్ ఇస్తారు.

అమెరికాలోనే అతి పెద్ద వెటరన్స్ హోం ఇది. దీన్ని 1984లో ప్రారంభించారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు దాదాపు వెయ్యి మంది ఉంటారని అక్కడి వెటరన్స్ అఫైర్స్ విభాగం వెల్లడించింది. రెండో ప్రపంచ యుద్ధం, కొరియా యుద్ధం, వియత్నాం యుద్ధం, ఇరాకీ ఆపరేషన్స్ తదితర వాటిల్లో పాల్గొన్న వారు ఈ వెటరన్స్ హోంలో ఉంటున్నారు. ఇందులో 1200 సీట్లతో థియేటర్, గోల్ఫ్ కోర్స్, బేస్‌బాల్ స్టేడియం, బౌలింగ్ లేన్స్, స్విమ్మింగ్ పూల్ తదితర ఎన్నో సదుపాయాలు ఉంటాయి.

మారిషస్ అధ్యక్షురాలు రాజీనామా



అమీన గురిబ్ ఫకీమ్

పోర్టులూయస్ : మారిషస్ అధ్యక్షురాలు అమీన గురిబ్ ఫకీమ్ వచ్చే వారంలో తన పదవి నుంచి దిగిపోతున్నారు. ఆ విషయాన్ని ఆ దేశ ప్రధానమంత్రి ప్రవింద్ జుగ్నౌత్ ప్రకటించారు. మార్చి 12న దేశ 50వ స్వాతంత్ర్య దినోత్సవం అయిపోయిన తర్వాత తమ దేశ అధ్యక్షురాలు రాజీనామా చేస్తారని పేర్కొన్నారు. ఒక చారిటీ సంస్థ ఇచ్చిన క్రెడిట్ కార్డును దుర్వినియోగపరిచి, పెద్ద మొత్తంలో షాపింగ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో అధ్యక్షురాలు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆ క్రెడిట్ కార్డును వాడి పెద్ద మొత్తంలో వస్త్రాలను, జువెల్లరీని అధ్యక్షురాలు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ క్రెడిట్ కార్డు ఖర్చుపై ప్రధాని స్పందించలేదు. దేశ ప్రయోజనాలకే తాము తొలి ప్రాధాన్యమిస్తామని మాత్రం ప్రధాని తెలిపారు. కెమిస్ట్రీ ప్రొఫెసర్ అయిన గురిబ్-ఫకీమ్, 2015లో అధ్యక్షురాలు పదవి అలంకరించారు. ఈ దేశంలో తొలి మహిళా అధ్యక్షురాలు గురిబ్-ఫకీమ్. అయితే ఈ ఆరోపణలను ఆమె ఖండిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం నగదును ఆమె వెనక్కి ఇచ్చేసినట్టు తెలిపారు. తాను ఎవరి దగ్గర్నుంచి ఎలాంటి డబ్బులూ తీసుకోలేదని, ఏడాది దాటిన తర్వాత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎందుకు ఈ విషయాన్ని మళ్లీ తవ్వి తీస్తున్నారంటూ మండిపడ్డారు. అధ్యక్షురాలికి జారీచేసిన ఈ క్రెడిట్ కార్డు ఎన్‌జీవో ప్లానెట్ ఎర్త్ ఇన్‌స్టిట్యూట్ అందించింది. స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఈ ఆర్గనైజేషన్ విద్యావ్యాప్తికి కృషిచేస్తుంది. ఈ విషయంపై ఎన్‌జీవో ప్లానెట్ ఎర్త్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఇంకా స్పందించలేదు.

భారతీయులకు తక్కువ ధరకే వీసాలివ్వాలి

యూకే మేధోవర్గం సూచనలు



లండన్: గత రెండేళ్లుగా బ్రిటన్‌కు భారత పర్యాటకుల తాకిడి తగ్గిపోయింది. మరోవైపు బ్రిటన్‌తో పోలిస్తే పక్కనే ఉన్న ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. ఇలా జరగకుండా భారతీయ పర్యాటకులను ఆకట్టుకోవాలంటే వారి వీసా ధరలను తగ్గించాలని సూచిస్తోంది యూకేలోని మేధోవర్గం. ఈ మేరకు రాయల్ కామన్‌వెల్త్ సొసైటీ(ఆర్‌సీఎస్) దీనిపై అధ్యయనం చేసి ఈ విధంగా సూచనలు చేసింది.

ఆర్‌సీఎస్ విడుదల చేసిన 'బ్రిటన్ అండ్ ఇండియా: బిల్డింగ్ ఏ న్యూ వీసా పార్టనర్‌షిప్' నివేదిక ప్రకారం.. 2016లో భారత్ నుంచి 6లక్షల మంది భారత పర్యాటకులు ఫ్రాన్స్‌కు వెళ్లారు. యూకేతో పోలిస్తే ఈ సంఖ్య 1,85,000 ఎక్కువ. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 2016లో యూకేలో భారత పర్యాటకుల సంఖ్య 1.73శాతం తగ్గగా.. ఫ్రాన్స్‌లో మాత్రం 5.3శాతం పెరిగింది. అయితే వీసా ధరను తగ్గిస్తే భారత పర్యాటకులను ఆకట్టుకోవచ్చు అని నివేదిక పేర్కొంది. ఇందుకోసం సరికొత్త యూకే-ఇండియా వీసా ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం.. ప్రస్తుతమున్న రెండేళ్ల వీసా ధరను 388 పౌండ్ల (సుమారుగా రూ.35 వేలు) నుంచి 89 పౌండ్లకు (సుమారుగా రూ.8 వేలు) తగ్గించాలని నివేదిక సూచించింది. ఇలా చేయడం వల్ల వాణిజ్యపరంగా, పర్యాటక పరంగా దేశం మరింత అభివృద్ధి చెందుతుందని, అంతేగాక ఇరుదేశాల మధ్య వ్యాపార బంధాలు బలోపేతమవుతాయని మేధోవర్గం అభిప్రాయపడుతోంది.

నర్సులపై పనిభారం తగ్గించండి

- ప్రజా వైద్యంలో వసతులని పెంచండి: కెనడా వైద్యులు



టొరొంటో : సాధారణంగా ఉద్యోగులు తమకు జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగుతారు. కానీ కెనడాలోని వైద్యులు మాత్రం ఇందుకు విరుద్ధంగా స్పందించారు. తమకు ఎక్కువ జీతాలు వద్దు అంటూ వందలాది మంది వైద్య సిబ్బంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు 500మంది డాక్టర్లు సహా, ఇతర సిబ్బంది ఈ మేరకు ఒక బహిరంగ లేఖను రాశారు. ప్రజా ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి, రోగుల అవసరాలను తీర్చడానికి వినియోగించాలని లేఖలో డిమాండ్ చేశారు. దీంతోపాటు నర్సులపై పడుతున్న పనిభారాన్ని, ప్రజలకు అవసరమైన వైద్య సౌకర్యాలను ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ ఈ లేఖను రాయడం విశేషంగా నిలిచింది.

మెడికల్ ఫెడరేషన్ చేపట్టిన ఇటీవలి జీతాల పెంపును క్యూబెక్ వైద్యులు వ్యతిరేకించారు. 213 జనరల్ ప్రాక్టీషనర్స్, 184 స్పెషలిస్టులు, 149 రెసిడెంట్ మెడికల్ డాక్టర్లు, 162 మంది మెడికల్ విద్యార్థులు తమ పెరిగిన జీతాలను తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నారు. నర్సులు, రోగులు బాధలు పడుతున్నపుడు తమకు జీతాల పెంపు ఎందుకంటూ ప్రశ్నించారు. నర్సులు, క్లర్కులు సహా ఇతర ఉద్యోగులు అనేక కష్టాలను అనుభవిస్తున్న తరుణంలో తమకు జీతాలపెంపు వద్దని ఖరాఖండిగా తేల్చి చెప్పారు.

వివిధ దేశాలలోని అనేకమంది నర్సులు చాలా తక్కువ వేతనం కోసం ఎక్కువ గంటలు పని చేస్తారు. అయితే, కెనడాలో ఒక సోషలిస్టు ప్రజా ఆరోగ్య వ్యవస్థలో కూడా నర్సులు తక్కువ వనరులతో ఎక్కువ పనిగంటలు పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. పనిభారంతో నర్సులు బాగా అలసిపోతున్నారని, దీర్ఘకాలంగా సిబ్బంది కొరత కారణంగా ఓవర్ టైం (కొన్నిసార్లు కచ్చితంగా) పనిచేయాల్సి వస్తోందని తమ లేఖలో పేర్కొన్నారు.

శ్రీలంక ఘర్షణలపై రిటైర్డ్ న్యాయమూర్తులతో దర్యాప్తు

కొలంబో : సెంట్రల్ శ్రీలంకలో వ్యాపించిన ముస్లిం వ్యతిరేక ఘర్షణలపై ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు జరుపుతుందని అధ్యక్షుడు మైత్రిపాలా సిరిసేన శనివారం ప్రకటించారు. దేశంలో శాంతి భద్రతల పరిస్థితులు దెబ్బతినడానికి దారి తీసిన పరిస్థితులపై ముగ్గురు రిటైర్డ్ న్యాయమూర్తులు దర్యాప్తు జరుపుతారని అధ్యక్ష భవన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు ముగ్గురు మరణించగా 20మంది గాయపడ్డారు. 200కిపైగా ముస్లింలకు చెందిన వ్యాపార సంస్థలు, గృహాలు ధ్వంసమయ్యాయి. 11 మసీదులను కూడా ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు.

బ్యాగులో నరికిన చేతులు

- రష్యాలో సంచలనం సృష్టించిన ఘటన



మాస్కో: రష్యాలో ఒళ్లు గగుర్పొడిచే వార్త ఒకటి సంచలనం సృష్టిస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 54 చేతులు నది ఒడ్డున లభించటం సర్వత్రా ఆందోళన కలిగించింది. అక్కడి సైబీరియా ప్రాంతంలో గల ఖబరోవ్క్ నగరంలో ఓ నది ఒడ్డున అనుమానాస్పద బ్యాగును పోలీసులు గుర్తించారు. దాన్ని తెరిచి చూడగా అందులో నరికిన 54 చేతులు కన్పించాయి. దీంతో ఒక్కసారిగా పోలీసులు షాక్‌కు గురయ్యారు. సైబీరియన్ టైమ్స్ అనే మీడియా సంస్థ ఈ వార్తను ప్రచురించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇది తీవ్రవాదులు చేశారా? వైద్య సంస్థలు చేశాయా? మూఢనమ్మకంతో పూజలా లేక శిక్షలా? అని తేల్చే పనిలో రష్యా పోలీసులు నిమగ్నమయ్యారు. ఫోరెన్సిక్ వారికీ అంతు చిక్కకుండా చేతుల వేలిముద్రలను చెరిపేశారు. ఒక సంచిలో మణికట్టు వరకు నరికేసిన మనుషుల అరచేతులు 54 కనిపించడం.. అక్కడి వారిని భయభ్రాంతులకు గురిచేసింది. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా ఈ కేసు మిస్టరీని ఛేదించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

'భగీరథ' రాదు.. దాహం తీరదు..

వేసవొచ్చినా సిద్ధంకాని ప్రణాళికలు

- మరమ్మతుల మాటే లేదు
- పూర్తి కాని అంతర్గత కనెక్షన్లు
- ఓవర్‌హెడ్ ట్యాంకులదీ అదే పరిస్థితి
- తాగునీటికి తపిస్తున్న గ్రామాలు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

'మిషన్‌భగీరథ ద్వారా జిల్లా ప్రజలకు 2018 మార్చి నాటికి తాగునీరందిస్తాం. తర్వాతనే వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగుతాం.' సీఎం కేసీఆర్ మొదలుకుని మంత్రుల నుంచి ఎమ్మెల్యేల వరకు పాలమూరు ప్రజలకు హామీలిచ్చారు. కానీ, క్షేత్రస్థాయిలో పనుల తీరు చూస్తే ఇప్పట్లో సాధ్యం కాదని అధికారులే చెబుతున్నారు. వేసవికాలం వచ్చిందంటే అధికారులు హడావుడి చెప్పనక్కర్లేదు. తీరా సీజన్ వచ్చి ప్రజలు దాహంతో అలమటిస్తుంటే చోద్యం చూడటం పాలకులకు పరిపాటిగా మారింది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వందలాది గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి కష్టాలు మొదల య్యాయి. ప్రతి ఏటా నీటి ఎద్దడి నివారణ కోసం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. కానీ, ఈ ఏడాది మిషన్‌భగీరథ ద్వారా తాగునీరందిస్తామన్న భరోసా చేత ప్రణాళికలు తయారు చేయకపోవడం వల్ల తాగునీరు సరఫరా కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో 1209 గ్రామాలున్నాయి. ఈ జిల్లాలో 1186 ఓవర్‌హెడ్ ట్యాంకులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 48 ట్యాంకులు మాత్రమే పూర్తి చేశారు. 1773 కిలోమీటర్ల పైపు లైన్లు వేయాల్సి ఉండగా కేవలం 43 కిలోమీటర్లు వేశారు. నాగర్‌కర్నూల్‌లో 1899 గ్రామాలుండగా 1735 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకర్లు నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం 80 ట్యాంకర్లు పూర్తి చేశారు. 2912 కిలోమీటర్ల పైపు లైన్లు వేయాల్సి ఉండగా 219 కిలోమీటర్ల పైపులైను మాత్రమే వేశారు. వనపర్తి జిల్లాలో 319 గ్రామాలున్నాయి. 253 ట్యాంకర్లు నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ 116 ట్యాంకర్లు పూర్తి చేశారు. 812 కిలో మీటర్ల పైపు లైను వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 746 కిలోమీటర్లు పైపు లైను వేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 139 గ్రామాలు ఉండగా 110 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం చేయాల్సి ఉంది. ఇక్కడ105 ట్యాంకులు పూర్తి చేశారు. 315 కిలోమీటర్లకు గాను 310 కిలోమీటర్ల పైపు లైను వేశారు.



(ఫైల్)

మరమ్మతులు లేవు...ప్రత్యామ్నాయమూ లేదు...

మిషన్ భగీరథ ద్వారా నీరొస్తుందని ఇప్పటివరకు ప్రత్యామ్నాయ దృష్టి సారించలేదు. ప్రయివేటు మోటార్లను గుర్తించడం, చేతిపంపులను మరమత్తు చేయడం, బోర్లలో పూడికలు తీయడం, క్రాష్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టేవారు. గ్రామంలో నీటివనరుల లభ్యత లేకుంటే... వ్యవసాయ బోరు బావుల నుంచి తీసుకొచ్చేవారు. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ప్రాథమికంగా ఉన్న వనరులను వాడుకోవడమేగాక మరమ్మతులు చేయించేవారు. ఈ సారి ఉమ్మడి జిల్లాలో తాగునీటి సమస్యపై కనీసం సమీక్ష సమావేశమైనా ఏర్పాటు చేయకపోవడం అధికారుల వైఫల్యమే. మిషన్‌భగీరథపై ఆశలు పెట్టుకున్న అధికారులకు ఇప్పుడు తిప్పలు తప్పడం లేదు.

ముందస్తు ఏర్పాట్లు చేయని అధికారులు

ప్రతి యేటా వేసవి వచ్చిందంటే జాగ్రత్తలు తీసుకునేవారు. గతేడాది 843 గ్రామాలకు మంచి నీటి ఎద్దడి ఉందని గుర్తించి రూ.565.14 కోట్లను కేటాయించారు. వీటిని మహబూబ్‌నగర్ జిల్లాలో 357 గ్రామాలకు రూ.116.58 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 25 గ్రామాల్లో రూ.37.96 కోట్లు, వనపర్తి జిల్లాలో 240 గ్రామాలకు రూ.181.67 కోట్లు కేటాయించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 221 గ్రామాలకు రూ. 229 కోట్లు కేటాయించి ఖర్చు చేశారు. ఈ ఏడాది ఎండలు ముదురుతున్నా తాగునీటి ఏర్పాట్లను చేయడం లేదు. మిషన్ భగీరథ పూర్తవుతుందని అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. కానీ, మిషన్ భగీరథ పనులు నేటికీ పూర్తవ్వలేదు. 'మాకు ఐదారేండ్లుగా తాగు నీటి ఎద్దడి ఉంది. 15 రోజులకోసారి నల్లాలు వస్తున్నాయి. రోజూ 10 బిందెలకు మించి రావడం లేదు. వచ్చిన నీళ్లుఒంద్రు నీళ్లలా ఉన్నాయి' అని బిజినపల్లికి చెందిన లక్ష్మి వాపోయింది. ఉమ్మడి జిల్లాలో నల్లమల అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో, గట్టు, నారాయణపేట, బిజినపల్లి, జడ్చర్ల వంటి ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. బిజినపల్లి మండలానికి 15 రోజులకోసారి నీళ్లు రావటం లేదు. నాగర్‌కర్నూల్, తెలకపల్లి పరిస్థితి కూడా అంతే. అమరచింత, ఆత్మకూర్ మండల కేంద్రానికి జూరాల ప్రాజెక్టు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ తాగునీటి కటకట తీరడం లేదు. ఇప్పటికైనా ముందస్తు ప్రణాళికలు పూర్తి చేసి తాగునీటి ఎద్దడి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ డిక్లరేషన్ అంశాలను బడ్జెట్‌లో పొందుపర్చాలి : ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గతేడాది డిసెంబర్‌లో బీసీల సమగ్రాభివృద్ధి కోసం రూపొందించిన బీసీ డిక్లరేషన్ అంశాలను బడ్జెట్‌లో పొందుపర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలో విలేకరులతో మాట్లాడారు. డిక్లరేషన్‌లో బీసీల సమగ్రాభివృద్ధి కోసం 200కు పైగా ముసాయిదా తీర్మానాలను రూపొందించారని తెలిపారు. బీసీ ప్రజా ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఈ తీర్మానాలను చేశారని, వచ్చే బడ్జెట్‌లో వీటికి నిధుల కేటాయింపులు జరపాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం వివిధ పథకాల అమలు కోసం రూ. 10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి వ్యవసాయ సబ్సిడీ స్కీములు, స్వయంఉపాధి పథకాలు, గ్రామీణాభివృద్ధి స్కీములు అందులో పొందుపర్చాలని సూచించారు. బీసీ కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.2వేల కోట్లు కేటాయించాలన్నారు. కుల వృత్తుల ఆధునీకరణ కోసం వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. బీసీ ఫెడరేషన్లకు ఆయా కులాల జానాభా నిష్పత్తిలో బడ్జెట్ కేటాయింపులు జరపాలన్నారు. గీత కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా వెయ్యి కోట్లు కేటాయించాలని సూచించారు.

ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.10వేల కోట్లు కేటాయించండి

- ఈటలకు ఎంబీసీ సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంబీసీ కార్పొరేషన్‌కు 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లు కేటాయించాలని ఎంబీసీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ అన్ని రంగాల్లోను ఎంబీసీలు అత్యంత వెనుకబడి ఉన్నారని, ప్రధానంగా ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వారిని చైతన్య పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎంబీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని, వారి అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. 2017-18లో ఎంబీసీల కోసం కేటాయించిన రూ. వెయ్యి కోట్లలో నుంచి ఎస్సీ, ఎస్టీల తరహాల్లో 80 శాతం సబ్సిడీతో ఎంబీసీలకు రుణాలు అందజేయాలని సీఎం ఆదేశించారు. కానీ ఎంబీసీలో ఏఏ కులాలు ఉన్నాయన్న విషయాన్ని తెలియడం కోసం ఎంబీసీల జాబితాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరులోపు అర్హులైన వారందరికీ రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

మార్కులు తక్కువొచ్చాయని విద్యార్థి ఆత్మహత్య

- గీతం యూనివర్సిటీలో ఘటన

నవతెలంగాణ-పటాన్‌చెరు

సెమిస్టర్‌లో మార్కులు తక్కువొచ్చాయని విద్యార్థి మనస్తాపం చెందాడు. క్యాంపస్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..కూకట్‌పల్లిలోని నిజాంపేట్ రోడ్డుకు చెందిన సూర్యఫణిభూషన్‌కుమార్(20) 'గీతం'లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సెకండ్ సెమిస్టర్‌లో మార్కులు తక్కువ రావడంతో తండ్రి రమేశ్ మందలించాడు. తానొచ్చి ఫ్యాకల్టీహెడ్‌తో మాట్లాడతానని చెప్పాడు. శనివారం ఉదయం ఏడు గంటలకు ఇంటి నుంచి కాలేజీకెళ్లిన ఫణిభూషన్‌కుమార్ ఉన్నట్టుండి నాలుగో అంతస్తుపై నుంచి దూకాడు. తీవ్ర గాయాలైన అతడిని కాలేజీ నిర్వాహకులు హైదరాబాద్‌లోని అర్చన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మృతితో 'గీతం'లో నిర్వహించాల్సిన వార్షికోత్సవాన్ని, ఇతర కార్యక్రమాలన్నింటినీ వాయిదా వేసినట్టు యాజమాన్యం తెలిపింది. తోటి విద్యార్థి చనిపోవడంతో విద్యార్థులు విషాదంలో మునిగారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

14న మధ్యాహ్నభోజన కార్మికుల కలెక్టరేట్ల ముట్టడి

సమస్యల పరిష్కారానికి 12, 13 తేదీల్లో దీక్షలు : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ రమ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



మధ్యాహ్నభోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల సర్కారు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 12,13 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆమె ప్రకటించారు. సర్కారు తీరులో మార్పు లేకుంటే 14న 2చలో కలెక్టరేట్' నిర్వహిస్తామని హెచ్చరించారు. శనివారం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం సీనియర్ నాయకులు [illegible], మధ్యాహ్న భోజన పథక[illegible] కార్మి[illegible] యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నిర్మల, [illegible] ప్రవీణ్‌తో క[illegible] ఆమె [illegible] మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించవచ్చని ప్రకటించగానే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల్లో స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చేసిందని అన్నారు. [illegible] జిల్లాల్లోనూ మధ్యాహ్న [illegible] కం [illegible] ణను స్వచ్ఛంద [illegible] అప్ప[illegible]దుకు ప్రభుత్వం కుట్రపన్నుతున్నారని విమర్శించారు.

దీనికి డిప్యూటీసీఎం కడియం శ్రీహరి అత్యు త్సాహం చూపుతున్నారని తెలిపారు. ఇదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 83వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు రోడ్డున పడతారని చెప్పారు. త్వరలో పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా, మెనూ చార్జీలు పెంచేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలనీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలనీ, లేకపోతే దానికి తగ్గట్టుగా నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

- చంద్రబాబుకు దేవేందర్‌గౌడ్ లేఖ!


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తనకు మరోసారి రాజ్యసభ అవకాశం ఇవ్వాలంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్. చంద్రబాబునాయుడుకు తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు తూళ్ల దేవేందర్ గౌడ్ లేఖ రాశారు. రాజ్యసభకు ప్రజల నుంచి వచ్చిన వ్యక్తినే ఎన్నుకోవాలంటూ శనివారం విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే చట్టాల రూపకల్పనలో రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకమైందని, అలాంటి సభకు ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసేవారినే ఎన్నుకోవాలని లేఖలో సూచించారు. జడ్పీ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా, పది సంవత్సరాలు క్యాబినెట్ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా తనకు పనిచేసే అవకాశం దక్కిందని, ఇకముందు కూడా ప్రజాశ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ లేఖలో దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి సోమవారం వరకు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.

నవచిత్రం

నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో..

'నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండిపేట గండి మైసమ్మ'.. అంటూ సాగే ఈ ఫోక్ సాంగ్ వింటే ఎవరినైనా ఊగిపోయేలా చేస్తుంది. ఇక ఈ పాటకి డాన్స్ చేసే వాళ్ళని చూస్తే పూనకం గ్యారంటీ. అంతగా మెస్మరైజ్ చేసే ఈ పాటను 'ఛల్ మోహన్ రంగ' చిత్రం కోసం రీమిక్స్ చేశారు. నితిన్, మేఘా ఆకాష్ హీరో హీరోయిన్లుగా, కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. నిఖితా రెడ్డి సమర్పణలో పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ట్ మూవీస్ పతాకాలపై ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ అందించారు.


'ఛల్ మోహన్ రంగ' చిత్రంలో నితిన్

ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'తెలంగాణ సంస్కృతిని, పెద్దమ్మ తల్లి గొప్పతనాన్ని చాటుతూ బోనాల సంబరాల్లో పాడుకునే పాట 'పెద్ద పులి..'. ఆ పాటను అంతే గొప్పగా, దాని స్థాయి ఏమాత్రం తగ్గకుండా సంగీత దర్శకుడు థమన్, సాహిత్య రచయిత సాహితి చాలా జాగ్రత్తగా రీ క్రియేట్ చేశారు. 'పెద్దపులి..' లాంటి పాట హీరో పరిచయ సాంగ్ అయితే, అదీ తెలంగాణ వాస్తవ్యుడైన నితిన్ 25వ చిత్రమైతే, దానికి థమన్ తన ఫోక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో వేరే స్థాయికి తీసుకెళ్తే, వీటన్నింటికి మించి ఆ పాటకి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో నితిన్ మాస్ స్టెప్పులేస్తే.. దానికి థియేటర్లలో సంబరాలే సంబరాలు అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. సాహితి అసలైన తెలంగాణ పదాలను వాడుతూ, పాటలో ప్రాస, యాస ఏమాత్రం తగ్గకుండా, వినడానికి, పాడుకోవడానికి సులభంగా ఉండేలా రాశారు. ఫోక్ సాంగ్స్‌కి కేరాఫ్‌గా మారిన రాహుల్ సిపిలిగంజ్ ఈ పాటని పాడారు. శుక్రవారం రాత్రి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో యువత కేరింతలు, ఉత్సాహాల నడుమ ఈ పాటను రిలీజ్ చేశాం. దీనికి మంచి స్పందన వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.


విష్ణు, మోహన్‌బాబు

దర్శకుడిగా విష్ణు..!

హీరోగా రాణిస్తున్న మంచు విష్ణు త్వరలో దర్శకుడిగా మారబోతున్నారు. నీటి వనరుల మంత్రిత్వ శాఖ కోసం నదీ జలాల పరిరక్షణ, నీటి పునరుజ్జీవనానికి సంబంధించి త్వరలో ఆయన ఓ టెలివిజన్ కమర్షియల్ యాడ్‌ను డైరెక్ట్ చేయబోతున్నారు. ఇందులో మోహన్‌బాబు నటించనుండటం ఒక విశేషం. ప్రజల్లో నీటి వనరులపై అవగాహన కల్పిస్తూ నిర్వహించే ప్రచారం కోసం ఈ యాడ్‌ను తీయనున్నారు. మరో వారం రోజుల్లో ఈ యాడ్ విడుదల కానుంది. నిమిషం పాటు సాగే ఈ యాడ్‌లో నదుల పరిరక్షణ, నీటి పునరుజ్జీవనానికి సంబంధించిన ప్రధాన ఉద్దేశాన్ని చెప్పనున్నారు.
'ప్రపంచ వ్యాప్తంగా నీటి కొరత, నీటి వల్ల కలిగే ఇబ్బందులపై ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాల్లో మేం భాగం కావడం ఆనందంగా ఉంది' అని మంచు విష్ణు తెలిపారు.
మోహన్‌బాబు, మంచు విష్ణు నటించిన 'గాయత్రి' ఇటీవల విడుదలై విశేష ఆదరణ పొందింది.
విష్ణు నటించిన 'ఆచారి అమెరికా యాత్ర', 'ఓటర్' చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

విజయమ్మగా..!


నయనతార

భిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించి లేడీ సూపర్ స్టార్ అనిపించుకుంటున్న నయనతార తెలుగులో సెలక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ఇటీవల 'జై సింహా'తో మెప్పించిన ఆమె తొలిసారి చిరంజీవి సరసన 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో నటిస్తోంది. తాజాగా మరో తెలుగు సినిమాలో నటించనున్నట్టు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ జీవితం ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కించడానికి దర్శకుడు మహి రాఘవ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో వైఎస్ఆర్ పాత్రకు మమ్ముట్టిని ఇప్పటికే ఫైనల్ చేయగా, విజయమ్మ పాత్ర కోసం నయనతారను తీసుకోవాలని చిత్ర బృందం భావిస్తోందట. ఈ చిత్రానికి 'యాత్ర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి'తోపాటు 'ఇమైక్కా నోడిగల్', 'కోలైయుథిర్ కాలమ్', 'కోలమావు కోకిలా' చిత్రాల్లో నటిస్తోంది.


శ్రీదేవి

మరో అరుదైన ఘన నివాళి..

ఇటీవల ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో అతిలోక సుందరి, లెజెండ్ శ్రీదేవికి ఘన నివాళ్ళర్పించిన విషయం విదితమే. అలాగే మరోమారు మరో అరుదైన నివాళిని అర్పించేందుకు ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజెల్స్ (ఐఎఫ్ఎఫ్ఎల్ఎ) సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెలలో జరిగే ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గౌరవ సూచకంగా శ్రీదేవి నటించిన 'చాందిని' చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. శ్రీదేవి నటించిన అద్భుత కళా ఖండాల్లో 'చాందిని' ఒకటి. రొమాంటిక్ డ్రామాగా 1989లో తెరకెక్కిన ఈ చిత్రానికి యశ్ చోప్రా దర్శకత్వం వహించడం విశేషం. ఇందులో శ్రీదేవి, రిషి కపూర్, వినోద్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించారు. అప్పట్లో ఇది ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డుని సైతం దక్కించుకుంది. ఇందులో చాందిని పాత్రలో శ్రీదేవి నటన ప్రేక్షకుల్ని ఫిదా చేసింది. సంగీత పరంగానూ ఈచిత్రం అందరినీ మెప్పించింది. ఇండియన్ ఫిల్మ్‌ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజెల్స్ వేడుక వచ్చే నెలలో 11 నుంచి 15 వరకు జరుగనుంది. ఇందులో శ్రీదేవికి ఘననివాళిగా 'చాందిని' చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఐదు దశాబ్దాల పాటు పలు భారతీయ భాషల్లో వైవిధ్యమైన చిత్రాలు, భిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల మదిపై చెరగని సంతకం చేసిన శ్రీదేవి గత నెల 24న దుబాయ్‌లో కన్నుమూసిన విషయం విదితమే.

హాలీవుడ్ రీమేక్‌కు బాణీలు..

భారతదేశం గర్వించ దగ్గ సంగీత దర్శకుల్లో ఏఆర్ రెహ్మాన్ ఒకరు. ఆయన సంగీతం అందిస్తున్నారంటే ఆ చిత్రానికి ఉండే క్రేజ్ ప్రత్యేకమైనది. ప్రస్తుతం డజనుకుపైగా చిత్రాలకు సంగీతం అందిస్తూ బిజీగా ఉన్న ఆయన తాజాగా ఓ హాలీవుడ్ రీమేక్ చిత్రానికి సంగీతం అందించబోతున్నారు. 2014లో విడుదలైన హాలీవుడ్ రొమాంటిక్ చిత్రం 'ది ఫాల్ట్ ఇన్ అవర్ స్టార్స్' భారీ విజయాన్ని సాధించింది. జోష్ బూనే దర్శకత్వం వహించిన ఈ సినిమాలో షైలెన్ వూడ్లీ, అన్సెల్ ఎల్‌గోర్ట్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాను తాజాగా సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ హీరోగా బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నారు. ముకేష్ చంబ్రా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అందించేందుకు రెహ్మాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. త్వరలోనే ఇది తెరపైకి వెళ్ళనుంది.


ఏ.ఆర్.రెహ్మాన్


సోనాక్షి సిన్హా

ప్రభుదేవా దర్శకత్వంలో దబాంగ్ 3

సల్మాన్ ఖాన్, సోనాక్షి జోడీగా అభినవ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందిన 'దబాంగ్' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో మనందరికీ తెలిసిందే. 'దబాంగ్'కి సీక్వెల్‌గా 2012లో అర్బాజ్ ఖాన్ దర్శకత్వం వహించిన 'దబాంగ్ 2' సైతం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులోనూ సోనాక్షినే కథానాయిక. తాజాగా 'దబాంగ్ 3'ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో కూడా సల్మాన్ సరసన సోనాక్షినే కథానాయికగా నటించనుండటం ఓ విశేషమైతే, ఇది ప్రభుదేవా దర్శకత్వంలో రూపొందనుండటం మరో విశేషం. ఈ ఆసక్తికర విషయాలను ప్రభుదేవా మీడియాతో పంచుకున్నారు. 'సల్మాన్‌తో 'దబాంగ్ 3' చిత్రాన్ని రూపొందించబోతున్నాను. ఈ ప్రాజెక్ట్ ఫైనల్ చేసుకోవడానికే ఇటీవల ముంబయి వెళ్లాను. సల్మాన్ సినిమా చేద్దామంటే కాదని ఎలా అనగలను. మా ఇద్దరి మధ్య ఎప్పట్నుంచో స్నేహం ఉంది. ఎలాంటి సూపర్‌స్టార్‌కైనా కెరీర్‌లో జయాపజయాలు ఎదురవుతుంటాయి. సల్మాన్ ఎప్పటికీ సల్మానే. ఆయనకు హిట్లు, ఫ్లాప్‌లతో సంబంధం లేదు. ఇప్పుడు నేను తీయబోయే సినిమాలో సల్మాన్ పోలీస్ అధికారిగానే నటిస్తారు. అందులో ఏ మార్పూ ఉండదు. నటీనటులు కూడా మారరు. కాకపోతే దర్శకుడు ఒక్కడే మారాడు(నవ్వుతూ)' అని తెలిపారు. ఈ సినిమా ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాదిలో ప్రారంభం కానుంది. గతంలో సల్మాన్, ప్రభుదేవా కాంబినేషన్‌లో రూపొందిన 'వాంటెడ్' చిత్రం సైతం బాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించింది. ఇదిలా ఉంటే, ప్రభుదేవా ప్రస్తుతం 'మెర్క్యూరీ' అనే మూకీచిత్రంలో నటిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ మూకీ సినిమాను ఏప్రిల్ 13న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. సోనాక్షి ప్రస్తుతం 'హ్యాపీ ఫిర్ భాగ్ జాయేగి' చిత్రంలో నటిస్తోంది.


సల్మాన్‌ఖాన్


ప్రభుదేవా

నవతరం ప్రేమ కథ..


'సమ్మోహనం' చిత్రంలో అదితీరావు హైదరి, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు, అదితీరావు హైదరి జంటగా ఇంద్రగంటి మోహన్‌కృష్ణ దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సమ్మోహనం'. ఈ చిత్ర విడుదల తేదీని ఖరారు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్ర ఫైనల్ షెడ్యూల్ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు హిమాచల్ ప్రదేశ్, ముంబయిలో జరుగుతుంది. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఏప్రిల్, మేలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి జూన్ 15న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. అత్యుత్తమ సాంకేతిక విలువలు, నిర్మాణ విలువలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి' అని అన్నారు. 'కొత్త ఎత్తుగడ, కొత్త పోకడ ఉన్న ఈ నవతరం ప్రేమ కథలో రొమాన్స్, హాస్యం సమ్మిళితమై ఉంటాయి. పి.జి.విందా ఫొటోగ్రఫీ, వివేక్ సాగర్ సంగీతం, రవీందర్ ఆర్ట్ సినిమాలో స్పెషల్ హైలైట్స్. ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కిస్తున్నాం. మంచి కథ, కథనానికి చక్కటి నిర్మాణ విలువలు తోడయ్యాయి. టైటిల్‌కి తగ్గట్టుగానే సినిమా మొత్తం అందమైన ఫీల్ క్యారీ చేస్తూ సమ్మోహనంగా అనిపిస్తుంది' అని దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. తనికెళ్ళ భరణి, పవిత్రా లోకేష్, హర్షిణి, నందు, కాదంబరి కిరణ్, హరితేజ, రాహుల్ రామకృష్ణ, కేదార్ శంకర్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి ఏం చేశాడు?


మౌర్యానీ, సతీష్‌రెడ్డి

సతీష్‌రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరోహీరోయిన్లుగా వీజే రెడ్డి దర్శకత్వంలో సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ, 'గ్రామీణ నేపథ్యంలో ఆహ్లాదకరమైన ప్రేమ కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. చిత్ర నేపథ్యం సెంటిమెంట్, భావోద్వేగాలతో ఉన్నా, కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. ఎక్కడా విసుగు అనిపించకుండా హాయిగా నవ్వుకునేలా ఉంటుంది. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఆసక్తికరం. చింతామణి నాటక రిహార్సల్స్ సన్నివేశాలు ప్రత్యేకంగా రూపొందించాం. ఆ ఎపిసోడ్ ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. విడుదలైన పాటలు శ్రోతల ఆదరణ పొందుతున్నాయి. సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్‌తోపాటు సెన్సార్ సభ్యుల ప్రశంసలను సొంతం చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 16న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. 'నెల్లూరి పెద్దారెడ్డి పాత్ర పేరు ప్రేక్షకులకు బాగా తెలుసు. ఆ పెద్దారెడ్డి నవ్విస్తే, ఈ నెల్లూరి పెద్దారెడ్డి మీకు మర్చిపోలేని అనుభూతిని అందిస్తాడు. ఇంత గొప్ప పాత్రను ఇచ్చిన దర్శకుడుకి కృతజ్ఞతలు. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని హీరో తెలిపారు.

భావోద్వేగ భరిత సంభాషణలు..


'దండుపాళ్యం 3' చిత్రంలో ఒక దృశ్యం

బెంగుళూరు, చెన్నై పరిసర ప్రాంతాల్లో దాదాపు 80కిపైగా హత్యలు, రేప్‌లు, దోపిడీలు చేసిన హంతకుల ముఠా నేపథ్యంగా, యదార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు శ్రీనివాసరాజు 2012లో 'దండుపాళ్య' పేరుతో కన్నడలో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. కన్నడతోపాటు తెలుగులో విడుదలైన 'దండుపాళ్యం' చిత్రం సాధించిన ఘనవిజయంతో సిరీస్‌గా రూపొందిన 'దండుపాళ్యం 2' చిత్రం కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దీనికి కొనసాగింపుగా నిర్మించిన 'దండుపాళ్యం 3' చిత్రం అతి త్వరలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్ర బృందం తెలియజేస్తూ, 'రవికాలే, మకరందన్ దేశ్ పాండే, పూజాగాంధీ, రవిశంకర్, సంజన వంటి తదితరులతో పాటు తొమ్మిది మంది నూతన నటీనటులు నటించిన ఈచిత్రం సహజత్వంతో కూడిన సన్నివేశాలతో, భావోద్వేగమైన డైలాగులతో సాగుతుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. అన్ని కార్యక్రమాలు పూర్తయిన ఈచిత్రాన్ని ఈనెల 16న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది. సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో శ్రీవాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి, సాయికృష్ణ పెండ్యాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు.


సోనమ్ కపూర్

మమ్మల్ని చూసి నేర్చుకోండి..

'ట్రంప్ బుద్ధిహీనుడు. జంతువులను వేటాడే విషయంలో అమెరికాతోపాటు ప్రపంచం మా దేశం నుంచి చాలా నేర్చుకోవాలి' అని అంటోంది సోనమ్ కపూర్. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏనుగులు, ఇతర జంతువులను వేటాడటానికి అనుమతులిచ్చారు. ఇది భయంకర విషయం. మనమంతా దీన్ని వ్యతిరేకించాలి, దీన్ని ఆపేయాల్సిందే అని హాలీవుడ్ నటి ఎల్లెన్ డిజెనెరెస్ ట్వీట్‌లో పేర్కొంది. దీంతోపాటు 'ఏనుగుల పట్ల దయ చూపుదాం' అంటూ తల్లి, పిల్ల ఏనుగు ఉన్న ఫొటోను పోస్ట్ చేసింది. ఈ ట్వీట్ చూసి, సోనమ్ పై విధంగా స్పందిస్తూ తన అగ్రహాన్ని వ్యక్తం చేసింది. 'భారతదేశంలో వేటాడటం చట్టవ్యతిరేక చర్య. దీని గురించి ప్రపంచం నేర్చుకోవాలి. ఈ విషయంలో భారత దేశ పౌరురాలిగా గర్వపడుతున్నా. మన ప్రపంచాన్ని కాపాడుకుందాం' అని ట్వీట్‌లో ఘాటుగా చెప్పింది. ప్రస్తుతం 'వీర్ ది వెడ్డింగ్', 'సంజు', 'ఏక్ లడ్కీ కో దేఖా తో హైసా లగా' చిత్రాల్లో సోనమ్ నటిస్తోంది.

16 నుంచి షూటింగ్‌లూ బంద్..

క్యూబ్, యూఎఫ్‌వోలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నిరసిస్తూ మార్చి 2 నుంచి దక్షిణాది చిత్రపరిశ్రమలైన తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం చిత్ర పరిశ్రమలు థియేటర్ల బంద్‌కు పిలుపినిచ్చిన విషయం విదితమే. తెలుగునాట 2 వేల రూపాయలు తగ్గించడంతో బంద్ విరమించారు. ఇదిలా ఉంటే తమిళ, కన్నడ చిత్ర పరిశ్రమలు బంద్‌ను మరింత ఉధృతం చేస్తున్నాయి. ఈ నెల 16 నుంచి షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా బంద్ చేస్తున్నట్టు తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రకటించింది. క్యూబ్, యూఎఫ్‌వోలు విపిఎఫ్‌ను వసూలు చేయకూడదని, టికెట్ ధరలను సరళీకరించడం, ఆన్‌లైన్ బుకింగ్ ఛార్జీలు తగ్గించడం, అన్ని థియేటర్లలో టికెట్లు కంప్యూటరైజ్ చేయడం, చిన్న సినిమాల ప్రదర్శనకు తగిన థియేటర్లు ఇవ్వడం, ప్రొడక్షన్ వ్యయాన్ని నియంత్రించడం వంటి డిమాండ్లతో బంద్ కొనసాగిస్తున్నారు. కానీ మన దగ్గర వీటి ఊసే లేకపోవడాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

డీఎస్‌కు కాంగ్రెస్ గాలం ?


(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర సమితి సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ గాలం వేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఆయన అంతరంగికుడైన ఒక సీనియర్ నేత డీఎస్‌తో సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిసింది. డీఎస్‌ను మళ్లీ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాలని కొందరు కాంగ్రెస్ నేతలు ఇటీవల రాహుల్‌కు లేఖలు రాశారు. దీనిపై స్పందించిన రాహుల్ ముందుగా రాష్ట్ర పార్టీలోని సీనియర్ నేతల అభిప్రాయాలను సేకరించాలని అధిష్టానానికి సూచించారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాంగ్రెస్‌లో చేరడానికి డీఎస్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు కొందరు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్న తనకు అవమానం జరిగిందని రెండేండ్ల క్రితం పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ వదలి వెళ్తున్నందుకు తనకెంతో బాధగా ఉందని కూడా ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న దిగ్విజయ్ సింగ్ సోనియా గాంధీకి తనపై చాడీలు చెప్పారని డీఎస్ అప్పట్లో ఆరోపించారు. కాంగ్రెస్ రాజ్యసభ టికెట్ ఆశించిన డీఎస్‌కు అది దక్కలేదు. కనీసం ఎమ్మెల్సీగా అయినా మళ్లీ అవకాశం ఇస్తారనుకుంటే అది కూడా ఇవ్వక పోవడంతో ఆయన పార్టీపై అలిగారు. టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత డీఎస్‌ను ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించారు. ఆ తర్వాత రాజ్యసభకు పంపించారు. అయితే ఆయన సీనియారిటీ మేరకు టీఆర్ఎస్‌లో ప్రాధాన్యత లభించక పోవటంతో ఇటీవల డీఎస్ అసంతృప్తితో ఉన్నారని ఆయన అనుయాయులు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన డీఎస్ అధికార పార్టీలో ఆ స్థాయి గౌరవం దక్కక పోవటం పట్ల మనస్తాపం చెందినట్టు వారు చెప్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన ముఖ్యమైన కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉన్నారని తెలుస్తున్నది. టీఆర్ఎస్ ఎంపీలతో కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరు కాలేదు. జాతీయ స్థాయిలో మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన సమావేశంలో కూడా ఆయన పాల్గొనలేదు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ఎంపీలు చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి కూడా ఆయన దూరంగా ఉన్నారు. తృతీయ ఫ్రంట్ ఏర్పాటు కోసం ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపే అధికారాన్ని మరో సీనియర్ నేత కేకేకు కట్టబెట్టారు. కేసీఆర్, డీఎస్‌ల మధ్య అగాధం పెరిగిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న డీఎస్ అనుయాయులు ఆయన్ని మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి తీసుకు రావాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తాను పార్టీ మారిన తర్వాత ఈ ప్రాధాన్యత గురించి సోనియా, రాహుల్ గుర్తించారని డీఎస్ తన అనుయాయులతో అన్నట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో తాను చేరుతానని డీఎస్ ఎటువంటి షరతులూ విధించలేదని కూడా ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. ఇప్పటికే డీఎస్ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. డీఎస్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకురావాలనే ప్రతిపాదనకు కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు పూర్తిగా మద్దతు తెలిపినట్టు తెలిసింది. జైపాల్ రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు భట్టి విక్రమార్క వంటి నేతలంతా ఈ ప్రతిపాదన ఆహ్వానించగా పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం ఇంకా తన అభిప్రాయం చెప్పలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికిప్పుడు తాను ఎటువంటి పదవీ కోరుకోవటం లేదని డీఎస్ స్పష్టం చేశారని ఆయన అనుయాయులు చెప్పున్నప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నేతలతో ఆయనకి ఉన్న సంబంధాల దృష్ట్యా ఆయన పార్టీలోకి వస్తే కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తున్నది. డీఎస్ పెద్ద కుమారుడు సంజయ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతుండగా చిన్న కుమారుడు అరవింద్ బీజేపీలో చేరారు. ఈ సంబంధాలలో ముగ్గురు నేతలు మూడు పార్టీల్లో కొనసాగటం మంచిది కాదని కూడా డీఎస్ తన అంతరంగికులతో అన్నట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో డీఎస్ చేరికపై ఏఐసీసీ సమావేశాల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

నిషా దించుతున్నారు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, చాలాన్లు విధించడం, అవసరమైతే జైలుకు పంపడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజూ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో అనేక మంది పట్టుబడుతున్నారు.

నాలుగు రోజుల్లో 630 చార్జిషీట్లు

హైదరాబాద్ నగరంలో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల్లో 630 మందిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. వారిని ఎర్రమంజిల్ 3వ-4వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ల ఎదుట హాజరుపరిచారు. వీరిలో 125 మందికి రెండు రోజుల నుంచి 15 రోజుల వరకు జైలు శిక్ష విధించారు. 33 మంది లైసెన్సులు రద్దు చేశారు. రూ.11,80,600 జరిమానా విధించారు.

చలాన్ చెల్లించలేదని జైలు

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని గుర్తించి చలాన్ విధిస్తున్నారు. అయితే కొందరు చలాన్ చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు వారికి తిరిగి పెండింగ్ చలాన్ విధించడంతోపాటు కోర్టులో ప్రవేశపెడుతున్నారు. చలాన్ చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిన 42 మందికి తాజాగా జైలు శిక్ష విధించారు. వీరిలో సెల్ఫోన్ డ్రైవింగ్ చేసి పట్టుబడిన వారు 14 మంది ఉండగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారు 13 మంది, ర్యాష్‌డ్రైవింగ్ చేసిన నలుగురు, ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోని వారు 11 మంది ఉన్నారు.

శాశ్వతంగా లైసెన్సుల రద్దు

అతిగా మద్యం సేవించి వాహనాలు నడిపి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మంది వాహనదారుల లైసెన్సులను రద్దు చేశారు. వారిలో నలుగురి లైసెన్సులు శాశ్వతంగా రద్దయ్యాయి. మరో నలుగురి లైసెన్సులు రెండేళ్ల పాటు, ఒకరి లైసెన్స్ ఏడాది, మరో 23 మంది లైసెన్సులు మూడు నెలల పాటు రద్దు చేశారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ జాయింట్ సీపీ డాక్టర్ రవీందర్ తెలిపారు.

ఇంత దారుణమా..!

(మొదటిపేజీ తరువాయి)

ఆ స్థానంలో ఎన్నిక ఈ నెల 12కు వాయిదా పడిన విషయం తెలిసిందే. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బిజాన్ ధర్ ఈ మేరకు ఎన్నికల ప్రధానాధికారికి లేఖరాశారు. 'రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ ఎన్నికలను వాయిదా వేయాలని చేసిన విజ్ఞప్తిని ఎన్నికల కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. ఎన్నికల పోటీ నుంచి ఉపసంహరించుకోవాలని శనివారం జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది' అని బిజాన్ ధర్ చెప్పారు. ఆ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా దేవవర్మ గుండెపోటుకు గురై ఫిబ్రవరి 11న మృతిచెందారు.

నేడు క్యాబినెట్

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులకు సీఎం దిశా నిర్దేశం చేయనున్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయించిన నిధుల్లో సగం నిధులను కూడా ఖర్చు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినందునా.. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకాభివృద్ధి నిధుల వ్యయం, ఏఏ రంగాలకు ఎంత నిధులు ఖర్చు చేశారు. ఎంతమందికి లబ్ది చేకూరిందన్న లెక్కలను కూడా సభలో ఉంచనున్నట్టు సమాచారం. ప్రత్యేక అభివృద్ధి నిధికి సంబంధించిన అంశాలపై కూడా క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు తెలిసింది.

బావిలో పడి బాలుని మృతి

నవతెలంగాణ-మోటకొండూరు

తల్లిదండ్రులతోపాటు వ్యవసాయ బావి వద్దకు పోయిన ఇద్దరు పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయారు. వారిలో ఒక బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఏఎస్ఐ గువ్వల జోజి తెలిపిన వివరాల ప్రకారం... ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని సింగారం గ్రామానికి చెందిన పన్నాల సత్తిరెడ్డి, అనితలు తమ ఇద్దరు కుమారులను తీసుకుని వ్యవసాయ బావి వద్దకు పోయారు. భార్యాభర్తలు పనిలో ఉండగా పిల్లలు బావి వద్ద ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరు కొడుకులు యశ్వంత్‌రెడ్డి(9), సంతోశ్‌రెడ్డి బావిలో పడిపోయారు. సమీపంలో ఉన్న సత్తిరెడ్డి గమనించి బావిలోకి దూకి సంతోశ్‌రెడ్డిని కాపాడాడు. కానీ అప్పటికే నీటిలో మునిగిన యశ్వంత్ ఆచూకీ లభించలేదు. దాంతో రెండు బోరు మోటార్లతో నీటిని బయటకు తోడి యశ్వంత్‌ను బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతిచెందాడు.

మండే ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర ఎండలు లేకపోగా, ఏప్రిల్‌లో ఆరు రోజులు, మే నెలలో 17 రోజులు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈసారి మార్చి నెల నుంచి జూన్ వరకు ఎండలు తీవ్రంగా ఉండనున్నాయి. నగరం విస్తరిస్తున్న కొద్దీ పట్టణీకరణ, పారిశ్రామీకరణతో కాలుష్యం అధికమవుతోంది. నగరంలో పచ్చదనం కరువైంది. ముందుముందు ఎండలు మరింత పెరుగుతాయని, ఏప్రిల్, మే నెలల్లో 46 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు.

మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ సమయంలో జనాలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. పారిశ్రామిక వాడలైన ఉప్పల్, చర్లపల్లి, నాచారం, బాలానగర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో ఎండల తీవ్రతతో ఉక్కపోత పెరిగింది. ఎండలు పెరగడంతో జూపార్కులో జంతువులకు చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రతకు నగరంలో ఏసీలు, ఫ్యాన్ల వినియోగమూ పెరిగింది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి.

మైనార్టీలకు చదువు సాయం దూరం

న్యూఢిల్లీ : గత మూడేండ్లలో రెండు కోట్ల 42 లక్షల మంది మైనారిటీ విద్యార్థులు లబ్ది పొందారని కూడా ఆయన చెప్పుకున్నారు. అయితే వాస్తవాలు చూస్తే ...

మైనారిటీ విద్యార్థులకు సంబంధించి ప్రి-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ పేర్లతో మూడు పథకాలు అమలులో ఉన్నాయి. వాటిలో ఈ మూడు పథకాలూ కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రిత్వ శాఖ అందించిన వివరాలు సూచిస్తున్నాయి. పార్లమెంట్‌లో ఇటీవల సభ్యుల ప్రశ్నకు సమాధానం ఇస్తూ మంత్రి ... ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైన్ వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపడుతోందని చెప్పారు. ఈ మూడు రకాల ప్రయోజనాలను వారికి అందించేందుకు ఆరు పథకాలు వివరించారు. అయితే వివరాలు ఇవ్వకుండా దాటవేశారు. వెబ్‌సైట్‌లో వివరాలున్నాయని ఆయన సభలో సమాధానం చెప్పలేదు.

ఆ వివరాలు పరిశీలిస్తే ... అందులో 2017-18 సంవత్సరంలో మొదటి మూడు నెలల కాలపు వివరాలు లేనేలేవు. ఉన్న వివరాల్లో కమ్యూనిటీల వారీగా కానీ, స్త్రీ, పురుషుల వారీగా కానీ అంతకుముందు ఏండ్ల వివరాలు లేవు. అయితే ప్రభుత్వ ధోరణి మాత్రం స్పష్టంగానే కనిపిస్తున్నది. దేశంలోని జనాభా, దానితో పాటు పెరుగుతున్న వివిధ వర్గాల విద్యార్థుల సంఖ్య పెరుగుదలను ఏదో స్థాయిలో గుర్తించకతప్పదు. కానీ లబ్ది పొందిన వారి సంఖ్య మాత్రం ఆ పెరుగుదలకు అనుగుణంగా లేవని తెలుస్తుంది.

ప్రి-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం ప్రయోజనాలు సగానికి సగం తగ్గిపోయాయి. మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా వారి విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన పథకంగా ప్రచారం చేసుకుంటూనే ఈ పథకం అమలు తీరు ఇలా కనిపిస్తున్నది. 2014-15లో మొత్తం లబ్దిదారుల సంఖ్య 30 లక్షలు మాత్రమే. అయినా వారి సంఖ్య 74.96 లక్షలుగా ప్రకటించింది. ఇందుకోసం రూ. 1128 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. 2015-16లో ఉపకారవేతనాలు పొందిన వారి సంఖ్య 51.78 లక్షలుగా చూపించారు. కానీ వారిలో 18.40 లక్షల మంది కొత్తగా అందులో చేరిన వారేనట. మిగిలిన 33.38 లక్షల మందే పాతవారికి లబ్దిపొందారు. ఆ ఏడాది ఈ పద్దు కింద రూ. 906 కోట్లు కేటాయించినట్టు తెలుస్తున్నది. ఇది చూస్తేనే తెలుస్తుంది ... కేటాయించిన నిధులు దాదాపు 20 శాతం తగ్గిపోయాయని. మైనారిటీ వర్గాల నుంచి ముందుకు వచ్చిన వారి సంఖ్య తగ్గిపోవడం వల్లనే లబ్దిదారుల సంఖ్య 41 లక్షల వరకు తగ్గిపోయారంటున్నారు. ఇక 2016-17లో పరిస్థితి చూస్తే నిధులు మరింత తగ్గి (30 శాతం) రూ. 584.90 కోట్లకు చేరింది. ఈ ఏడాది కాలంలో 30 లక్షల మంది కొత్తవారిని లక్ష్యంగా నిర్ణయించుకోగా 31.14 లక్షలకే పరిమితమయింది. అదే విధంగా 2017-18 కాలంలో ఆ సంఖ్య మరింత తగ్గిపోయింది. ఈ ఏడాది కూడా 30 లక్షల మంది లక్ష్యం కాగా, 12 శాతం తగ్గి మొదటి మూడు నెలల కాలంలో కేవలం 3,69,549 మందికి మాత్రమే ప్రయోజనం చేకూరింది.

వాస్తవానికి మైనారిటీలలోని 21.39 లక్షల మంది ముస్లింలకు,3.72 లక్షల మంది క్రిస్టియన్లకు, 2.97 లక్షల మంది సిక్కులకు, 1.23 లక్షల మంది బౌద్ధులకు, 65,448 మంది జైన్‌లకు, 1030 మంది పార్సీ యువకులకు లబ్ది కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపకారవేతనాలను అందుకోలేకపోయిన వారికీ, ఈ లెక్కలకు కొంత వరకూ సామ్యం కనిపిస్తున్నది. కానీ వీళ్లందరికీ కలిపి రూ. 63.13 కోట్లు మాత్రమే మంజూరు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరో విషయం -పస్ట్-మెట్రిక్ విద్యార్థుల విషయంలో ... 2014-15లో లక్ష్యంగా పెట్టుకున్న వారి సంఖ్య 5 లక్షలు కాగా 9.05 లక్షల మందికి లబ్ది చేకూరింది. వీరి కోసం రూ. 501 కోట్లు ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. మొత్తం మీద 700248 మంది ముస్లింలు, 94,123 మంది క్రిస్టియన్లు, 90342 మంది సిక్కులు, 5336 మంది బౌద్ధులు, 15, 467 మంది జైనులు, 103 మంది పార్సీలు మాత్రమే ఈ నాలుగేండ్లలో లబ్ది పొందారన్న వాస్తవం గమనించవల్సి ఉంటుంది.

ఉక్కుపాదం


నిలువరిస్తున్న ఖాకీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా పోలీసులు భారీగా మోహరించారు. మహానగరం నిఘానీడన ఉన్నది. ట్యాంక్‌బండ్ వద్ద భారత సరిహద్దును తలపించింది. ట్యాంక్‌బండ్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ప్రాంతాలు పూర్తిగా అష్టదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలు, పోలీసుల మోహరింపు, బారికేడ్లు, వాహనాల దారిమళ్లింపుతో నగరవాసులకు తిప్పలు తప్పలేదు. మిలియన్ మార్చ్‌పై టీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రాష్ట్రవ్యాప్తంగా అడుగడుగునా పోలీసు నిర్బంధం కొనసాగింది. ట్యాంక్‌బండ్, ఎస్వీకే వద్ద విడతల వారీగా మిలియన్ మార్చ్‌లో పాల్గొనేందుకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్‌ను తార్నాకలోని ఆయన ఇంటివద్దే అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డిని మఖ్దూంభవన్ వద్దే అరెస్టు చేసి బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో ఉంచారు. ఎస్వీకే వద్ద విమలక్కను అరెస్టు చేశారు. కోదండరామ్ ఇంటివద్ద, ఎస్వీకే, ట్యాంక్‌బండ్, మఖ్దూంభవన్‌ల వద్ద వందలాది మంది కార్యకర్తలు, ప్రజలను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. ట్రాఫిక్ ఆంక్షలు, నాయకుల అరెస్టులు, భారీగా పోలీసుల మోహరింపు పరిణామాలతో హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ సాధన ఉద్యమంలో కీలకమైన 'మిలియన్ మార్చ్' 2011, మార్చి 10న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కూడా ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని, ఉపాధి, ఉద్యోగాలు రావడం లేదని, హక్కులు అణిచివేస్తున్నారని విమర్శించిన టీజేఏసీ, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశ పాలనకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై శనివారం 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర'కు పిలుపునిచ్చింది. స్ఫూర్తి యాత్రలో భాగంగా శనివారం సభ నిర్వహించడానికి టీజేఏసీ విశ్వ ప్రయత్నాలు చేసింది. అయితే ఈ యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. మిలియన్ మార్చ్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల ముందునుంచే పోలీసులు అరెస్టు చేయడం మొదలుపెట్టారు. ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. మరికొందరిని ముందస్తుగానే అదుపులోకి తీసుకున్నారు. అయినా స్ఫూర్తియాత్రను నిర్వహిస్తామని టీజేఏసీ ప్రకటించడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక బలగాలు సహా వేలాది మంది పోలీసులు అడుగడుగునా మోహరించారు. వజ్ర వాహనంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు మోహరించాయి. జిల్లాల నుంచి ఎవరినీ రానీయకుండా...నగర శివార్లతో కలిపి 350 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేసి, అనుమానస్పదంగా కన్పించిన వారిని ప్రశ్నించారు. 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర' నిర్వహణ ప్రాంతమైన ట్యాంక్‌బండ్ వద్ద మరింత కఠినంగా ఆంక్షలను అమలు చేశారు. ట్యాంక్‌బండ్‌కు రెండువైపులా 'బారికేడ్'లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకోవడానికి విడతల వారీగా వచ్చిన విద్యార్థులు, యువకులు, ప్రజలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.


విమలక్క

ఆంక్షలతో ఆకాంక్షలను అణచలేరు : కోదండరామ్


కోదండరామ్

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్రకు బయలుదేరుతున్న టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్‌ను అనూహ్య పరిణామాల మధ్య పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని తార్నాకలో గల ఆయన ఇంటి దగ్గర నుంచి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరిన ఆయనను కారులో కూర్చోగానే డ్రైవర్‌ను పోలీసులు తప్పించారు. మఫ్టీ పోలీసులే కోదండరామ్ కారును డ్రైవింగ్ చేసుకుంటూ బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, టీజేఏసీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. తోపులాటకు దిగిన 21 మంది టీజేఏసీ నేతలను పోలీసు అరెస్టు చేశారు. కోదండరామ్ వాహనం వెంట భారీగా పోలీసు వాహనాలు బొల్లారం వరకు అనుసరించాయి. అయితే మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నేపథ్యంలో కోదండరామ్ నివాసం వద్ద శుకవారం రాత్రి నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారీగా పోలీసులు మోహరించారు. మరికొంత మంది పోలీసులు మఫ్టీలో పహారా కాశారు. విద్యానగర్‌లోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు నలమాస కష్ణ, రవిచంద్రను నారాయణగూడలో వారి నివాసాల వద్ద అరెస్ట్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయానికి వెళ్తున్న న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె గోవర్దన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్యాంక్‌బండ్ వద్దకు వెళ్లడానికి సీపీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషను మఖ్దూంభవన్ వద్దే పోలీసులు అరెస్ట్ చేశారు. ట్యాంక్‌బండ్ వద్దకు వెళ్లేందుకు యత్నించిన మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌కు వచ్చిన సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణను అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో ఆయన వారితో వాగ్వాదానికి దిగారు. పార్టీ కార్యాలయానికి వస్తే అరెస్ట్ చేస్తారా.? అని నిలదీయడంతో పోలీసులు వారి ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని, వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం కోదండరాం అరెస్టు కంటే ముందు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన వారిని 24 గంటలు గడిచినా కోర్టులో ప్రవేశపెట్టలేదని, కనీసం భోజనాలు ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. జీవించే హక్కును హరించడమే అవుతుందని, ఈ చర్యలపై న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. ఢిల్లీలో రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేయవచ్చు గానీ కనీసం ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడానికి స్ఫూర్తి సభలు తప్పులెలా అవుతాయని ప్రశ్నించారు. ఆంక్షలతో ఆకాంక్షలను అణచలేరని చెప్పారు.


చాడ వెంకటరెడ్డి


సంధ్య

అనుమతించకపోవడం అప్రజాస్వామికం : సీపీఐ(ఎం)

మిలియన్ మార్చ్‌ను గుర్తు చేసుకోవడాన్నే అనుమతించకపోవడం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. నాయకులు, ప్రజలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాధనలో మిలియన్ మార్చ్ ముఖ్యఘట్టాల్లో ఒకటని ఎంతో గొప్పగా చెప్పిన టీఆర్ఎస్ పార్టీ దాన్ని గుర్తు చేసుకోవడాన్ని అనుమతించకపోవడం అన్యాయమని తెలిపారు. మిలియన్ మార్చ్‌ను భగ్నం చేయడాన్ని ఖండించారు. చాడ వెంకటరెడ్డిని పార్టీ ఆఫీసు వద్ద, కోదండరామ్‌ను ఇంటివద్దే అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. పోలీసుల ద్వారా ప్రజా ఉద్యమాలను అణచాలనుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. సభలను నిరాకరించడాన్ని రాజ్యాంగం అనుమతించబోదని న్యాయస్థానాలు పలుసార్లు ఆదేశించినా, ప్రభుత్వాలు నిరంకుశ పోకడలకే పోతున్నాయని తెలిపారు. శాంతిభద్రతల పేరుతో కుంటిసాకులు చెప్పి సభలను అడ్డుకోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. సభను ఆటంకపరచడాన్ని తప్పిదంగా అంగీకరించి పెట్టిన కేసులన్నీ బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలను మానుకోవాలని సూచించారు. సభలు జరుపుకోవడానికి అనుమతించాలని కోరారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను అమలు చేయాలని తెలిపారు.

అక్రమ అరెస్టులకు సీపీఐ ఖండన

మిలియన్ మార్చ్‌లో పాల్గొనేందుకు వచ్చిన వారిపై అక్రమ కేసులు బనాయించడాన్ని సీపీఐ రాష్ట్ర సమితి ఖండించింది. పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రజా ఉద్యమాలను అణచివేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు.


అడ్డుకుంటున్న పోలీసులు

జిల్లాల్లో జేఏసీ, వామపక్ష నాయకుల అరెస్టు

చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు

మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర సభకు రాకుండా అడ్డగింత

నవతెలంగాణ-యంత్రాంగం

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద తలపెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్ర సభపై వస్తున్న వారిని పోలీసులు శనివారం ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. జిల్లాల్లో చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. జిల్లాల్లో జేఏసీ, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) పార్టీలకు, పలు ప్రజా సంఘాలకు చెందిన నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించారు. సాయంత్రం తర్వాత వదిలిపెట్టారు. ప్రభుత్వ నిర్బంధ ధోరణిని, నిరంకుశత్వాన్ని నిరసిస్తూ పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మలను తగులబెట్టారు.

ఉస్మానియా యూనివర్శిటీలోని న్యూగోదావరి హాస్టల్ ఎదుట విద్యార్థులు స్ఫూర్తి సభ నిర్వహించారు. ఆ తర్వాత ర్యాలీగా ట్యాంక్‌బండ్‌కు వెళ్తున్న ఓయూ టీఎస్-జేఏసీ నేతలు రమేష్ ముదిరాజ్, సలీంపాషాతో పాటు 10 మంది విద్యార్థి నేతల్ని అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీనిని నిరసిస్తూ విద్యార్థులు ఆ హాస్టల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హయత్‌నగర్‌లో సీపీఐ(ఎం) నాయకులు ఏర్పుల నర్సింహ, టీడీపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డిలతో పాటు పలువుర్ని, జగద్గిరిగుట్టలో సీపీఐ, జేఏసీ నాయకులను అరెస్టు చేశారు. ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్తున్న నాయకులను శుక్రవారం రాత్రి ముందస్తు అరెస్టు చేశారు. కూసుమంచి మండలం, నాయకన్‌గూడెంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేసి అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో, శంషాబాద్‌లో జేఏసీ నాయకులు గౌరీ సతీష్, నర్సింహయాదవ్, బుచ్చిరెడ్డి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్.మల్లేష్, ఆనంద్(ఎస్ఎఫ్ఐ)లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. షాబాద్‌లో జేఏసీ, వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు, యాలాల, వికారాబాద్, తదితర మండలాల్లో జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల, కాసిపేట మండలాల్లో, కుమురం భీం జిల్లా రెబ్బెన మండలంలో జేఏసీ, సీపీఐ(ఎం), సీపీఐ, న్యూడెమోక్రసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో ఏఐఎస్ఎఫ్ కుమురం భీం జిల్లా కార్యదర్శి దుర్గం రవీందర్, తదితరులున్నారు.

పెద్దపల్లిలో బత్తిని సంతోష్(ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి) తాండ్ర సదానందం, లెనిన్(సీపీఐ), జేఏసీ నాయకులను అరెస్టు చేశారు. సొంతపూచీకత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. గోదావరిఖనిలో టీ-జేఏసీ జిల్లా కార్యదర్శి జేవీ రాజు, పొన్నం విజయ్‌కుమార్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్, తదితరులను అరెస్టు చేశారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులను అరెస్టు చేశారు. మెదక్ జిల్లాలో మెదక్, రామాయంపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, తదితర మండలాల నుంచి మిలియన్ మార్చ్‌కు హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. తప్పించుకుని హైదరాబాద్ వెళ్ళిన టీజేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జి జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి కంచన్‌బాగ్ ఠాణాకు తరలించారు. సంగారెడ్డిలో టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేసి పీఎస్‌లకు తరలించారు. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్ ప్రాంతాల్లో నాయకులను అరెస్టు చేశారు. ప్రభుత్వ దమన నీతిని ఖండిస్తూ ఎక్కడికక్కడ దిష్టిబొమ్మలు దహనం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నర్సింహ, పరమేశ్వర్(సీపీఐ), మధు(ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి), అంబదాస్(సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ) నాయకులతో పాటు 165 మందిని అరెస్టు చేసి నిర్బంధించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 15 మంది సీపీఐ నాయకులను అరెస్టు చేశారు. వనపర్తిలో కురుమయ్య, శ్రీనివాసులును అరెస్టు చేశారు. జోగులాంబ గద్వాలలో తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరాజరెడ్డి, టీవీఎస్‌జేఏసీ గద్వాల జిల్లా కార్యదర్శి ఎన్.భీమన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గజిపేట [illegible] ముక్తిపార్టీ రాష్ట్ర అధ్యక్షులు నాగర్‌దొడ్డి వెంకట్‌రాములును అరెస్టు చేశారు.

2011 మార్చి 10..
ఉద్యమదిశను మార్చిన మిలియన్ మార్చ్

- నిశ్శబ్దంగా ట్యాంక్‌బండ్‌పై చేరిన సకలజనులు
- అన్ని గొంతుకలు ఒక్కటైన వేళ..

తెలంగాణ ఉద్యమం దిశను మిలియన్ మార్చ్ మార్చేసింది. ఆంక్షలతో ఉక్కుపాదం మోపిన పద్మవ్యూహాన్ని దాటుకొని తెలంగాణ సమాజం నిశ్శబ్దంగా టాంక్ బండ్ మీదకు చేరుకుంది. ఒక్కరు.. ఇద్దరు.. పదులు... వందలుగా చేరుకోగా..యువత ప్రత్యేక రాష్ట్రం కోసం నినదించింది. తెలంగాణ సాధనలో మైలురాయిగా నిలిచి మిలియన్ మార్చ్ 2018 మార్చి 10..శనివారం మరోసారి ఆనాటి జ్ఞాపకాలను తడిమే ప్రయత్నం చేసింది.ఉద్యమాన్ని వేడెక్కించేందుకు జేఏసీ మిలియన్ మార్చ్ చేపట్టింది. ఇందుకు ట్యాంక్ బండ్ ను వేదికగా సెలెక్ట్ చేసింది. ఆనాడు మార్చ్ ను విఫలం చేయాలని ఉమ్మడి రాష్ట్ర సర్కారు నిర్బంధాన్ని ప్రయోగించింది. జిల్లాల బార్డర్లలో పోలీసుల దిగ్బంధాలు.. అడ్డంకులు.. బ్యారికేడ్లు.. ఇనుపకంచెలు.. తెలంగాణ వాదులను ఆపలేకపోయాయి. నగరమంతా పోలీసులను, పారామిలటరీ బలగాలను మోహరించినా ఫలితం లేకుండా పోయింది. ఇంటలిజెన్స్ వర్గాలు పసిగట్టలేనంత పక్కాగా ప్లాన్ చేసుకున్నారు తెలంగాణ వాదులు. ఇందిరాపార్క్ ఏరియాలోని ఓ ఫంక్షన్ హాల్ లో పెళ్లి ఏర్పాట్లు చేసుకుని పెళ్లి బ ందంలా ట్యాంక్ బండ్ పైకి వచ్చారు. ఈ ప్రయత్నంలో పలువురికి గాయాలయ్యాయి. కానీ వెనక్కి తగ్గలేదు.ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహాలనూ కూలగొట్టారు.కానీ ఏ మిలియన్ మార్చ్‌కు వెన్నుదన్నుగా నిలిచిందో..అదే టీఆర్ఎస్ ప్రభుత్వం మిలియన్ మార్చ్‌పై ఆంక్షలుపెట్టింది.దీనిపై తెలంగాణవాదుల్లో చర్చనీయాంశంగా మారింది.

సెన్సెక్స్ ▼ 44	నిఫ్టీ ▼15	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
33,307	10,226	65.16	రూ. 31,037	రూ. 40,500

శుక్రవారం మార్కెట్లు ముగిసేసమయానికి

కోడిగుడ్లు

హైదరాబాద్	345	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	4.05	చెన్నై	385
వరంగల్	347	ముంబయి	390

ఇక రోటోమాక్ సంస్థల వేలమే..!

- భారీ రుణాల్ని తిరిగి చెల్లించని రెండు కంపెనీలు
- ఈ నెల 19తో ముగియనున్న బ్యాంకుల గడువు
- మరింత గడువునిచ్చేందుకు రుణదాతల విముఖత
- కంపెనీల వేలమే తరువాయంటున్న నిపుణులు



న్యూఢిల్లీ: రోటోమాక్ కంపెనీలు తీసుకున్న రుణలను తిరిగి చెల్లించేందుకు బ్యాంకులిచ్చిన గడువు దాదాపు దగ్గరపడడంతో.. సదరు కంపెనీలను వేలం వేసేందుకు దివాలా కోర్టు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. రోటోమాక్ సంస్థలు బ్యాంకు నుంచి దాదాపు రూ.4000 కోట్ల మేర రుణాలను స్వీకరించాయి. సంస్థల యాజమాన్యం ఈ రుణాలను తమ స్వప్రయోజనాలకు వాడుకొని.. వాటిని తిరిగి చెల్లించడంలో ఘోరంగా విఫలమైంది. ప్రమోటర్లు డీఫాల్టర్లుగా మారారు. యాజమాన్యం కోరిక మేరకు బ్యాంకులు రుణ చెల్లింపునకు ఇచ్చిన చివరి డెడ్‌లైన్ ఈ నెల 19తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కంపెనీలు రుణ చెల్లింపునకు మరో మూడు నెలల (90 రోజుల) అదనపు సమయాన్ని కోరాయి. తుది గడువు పొడిగింపుపై ఓటింగ్ కోసం శుక్రవారం సమావేశమైన రుణదాతల కమిటీ డెడ్‌లైన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడగించొద్దన్న ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చినట్టుగా బ్యాంకు అధికారి ఒకరు తెలిపారు. దీంతో రోటోమాక్ అధినేత విక్రమ్ కొఠారికి చెందిన రోటోమాక్ ఎక్స్‌పోర్ట్స్, రోటోమ్యాక్ గ్లోబల్ సంస్థలను దివాలా కోర్టు వేలం వేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. రుణ విముక్తికి సంస్థ ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రతిపాదించకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకోన్నట్టుగా సమాచారం. కాగా, ఇదే విషయాన్ని రోటోమాక్ కంపెనీల రెజుల్యూషన్ ప్రొఫిషనల్ పరోక్షంగా ధ్రువీకరించడం విశేషం. కొన్ని రోజుల క్రితమే రుణాల డిఫాల్ట్ కేసులో రొటొమ్యాక్ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్ కొఠారిలను సీబీఐ అరెస్ట్ చేసింది. వీరు విచారణకు సహకరించకపోవడంతోనే, అరెస్ట్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో ఎయిరోస్పేస్ యూనిట్



నవతెలంగాణ- న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణలోని ఎయిరోస్పేస్ యూనిట్ నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాఫ్రాన్ ఎలక్ట్రికల్స్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో శనివారం జరిగిన ఇండియా- ఫ్రాన్స్ భాగస్వామ్య ఒప్పందాల సమావేశంలో ఈ మేరకు ఎంఓయూ కుదిరింది. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో సాఫ్రాన్ ఎలక్ట్రికల్స్, పవర్ ఇండియాలు సంయుక్తంగా రూ.52 కోట్లతో ఈ యూనిట్‌ను నెలకొల్పనున్నాయి. సాఫ్రాన్ ఎలక్ట్రికల్ సీఈఓ ఫిలిప్పీ పెటిట్‌కోలిన్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ ఎంఓయూపై సంతకం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. విమానాల్లో ఎలక్ట్రికల్ విభాగాలు తయారు చేయనున్న ఈ సంస్థ.. ఇకపై హైదరాబాద్ వేదికగా పరికరాలు రూపొందించనున్నట్టు అనంతరం ఓ ప్రకటనలో తెలిపారు.

వసూళ్లు పెరగడం లేదు..

జీఎస్టీ రాబడిపై జైట్లీ అసంతృప్తి • ఎగవేతలు పెరగడంపై సీరియస్ • ఈ-వే బిల్లు పరిష్కారమని వెల్లడి

• ఏప్రిల్ నుంచి దశల వారీగా అమలుకు నిర్ణయం • 'సరళీకరణ'కు మరింత గడువు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన 'వస్తు, సేవల పన్ను' (జీఎస్టీ) పన్ను వసూళ్లపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఇక్కడ జరిగిన జీఎస్టీ మండలి 26వ సమావేశంలో ఆయన రాష్ట్ర ఆర్థిక మంత్రులు, ఉన్నతాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మహోన్నత ఆర్థిక లక్ష్యాలతో అందుబాటులోకి తెచ్చిన జీఎస్టీ విధానం ద్వారా అనుకున్న స్థాయిలో పన్ను వసూళ్లు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు జీఎస్టీలోని వివిధ సౌలభ్యాలను ఆసరాగా చేసుకొని భారీగా ఎగవేతలకు ప్పాలడుతున్నట్టు సర్కారు దృష్టికి వచ్చిందని మంత్రి వివరించినట్టు తెలుస్తోంది. ఆదాయాన్ని తక్కువగా చూపిస్తూ పన్నుల ఎగవేతకు పాల్పడుతున్న వారి ఆగడాలను అరికట్టేందుకు ఈ-వే బిల్లు పరిష్కారం చూపగలదని జైట్లీ మంత్రులకు వివరించినట్టుగా సమాచారం. రాష్ట్రాల నుంచి తగిన సహకారాన్ని, సమగ్ర కార్యాచరణను జైట్లీ కోరినట్టుగా సమాచారం.



ఏప్రిల్ నుంచి ఈ-వే బిల్లు విధానం..

రెండు రాష్ట్రాల మధ్య రూ.50 వేలకు మించి విలువ గల సరుకులు రవాణా చేయాలంటే ఉండాల్సిన ఎలక్ట్రానిక్-వే బిల్లును ఏప్రిల్ 1 నుంచి దశల వారీగా అమల్లోకి తేనున్నట్టుగా జైటీ తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నాటికి దేశవ్యాప్తంగా ఈ విధానం అందుబాటులోకి వస్తుంది ఆర్థిక మంత్రి సమావేశం అనంతరం తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉనున్న జీఎస్‌టీఆర్-3బీ ఫైలింగ్ విధానాన్నే మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. కొత్తగా ప్రతిపాదించిన రివర్స్ చార్జీ వ్యవస్థను మూలం వద్దే పన్ను మినహాయింపు, టీసీఎస్ విధానాలను కూడా జూన్ 30 వరకు అమలు చేయకూదని ఈ సమావేశంలో నిర్ణయించారు.

పార్లమెంట్ ప్యానెల్ విస్మయం

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్టీ పన్ను విధానం అమలుపై పార్లమెంట్ ఆర్థిక వ్యవహారాల ప్యానెల్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎంపీ, కాంగ్రెస్ నేత వీరప్ప మోయిల్ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ జీఎస్టీ విధానాన్ని సమీక్షించి ఒక నివేదికను పార్లమెంట్‌కు అందజేసింది. ఇందులో జీఎస్టీ అమలవుతున్న తీరుపై తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. జీఎస్టీ పన్ను శ్లాబ్‌లను తరుచూ మార్చుతుండడం, పన్ను వసూళ్లకు లక్ష్యాలను నిర్దేశించకపోవడం వల్ల పన్ను వసూళ్లు ప్రోత్సాహకర స్థాయిలో జరగడం లేదని విస్మయం వ్యక్తం చేసింది. ఇది కొత్త పన్ను విధానాన్ని ప్రభావితం చేస్తున్నట్టుగా పేర్కొంది. పన్ను విధానాలను మార్చుతుండడం వల్ల దేశంలోని వ్యాపార వ్యవస్థ, వాణిజ్యం ప్రభావితం అవుతూ వస్తోందని పేర్కొంది. దీనిని నివారణకు చర్యలు తీసుకోవాలని ప్యానెల్ కోరింది.

కుదరని ఏకాభిప్రాయం..

జీఎస్టీ రిటర్నుల సరళీకరణకు విషయంలో జీఎస్టీ మండలిలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశంపై మరింత అధ్యయనానికి గాను మంత్రుల బృందం మరింత కసరత్తు చేయనుందని జైట్లీ తెలిపారు. సమగ్రమైన చర్చల తరువాతే ఒక నిర్ణయం తీసుకొని ఈ అంశాన్ని మరో సమావేశంలో ఏకాభిప్రాయానికి ఉంచనున్నట్టుగా జైట్లీ తెలిపారు. ఈ నేపథ్యంలో పాత విధానాన్నే మరికొంత కాలం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని ఆర్థిక మంత్రి తెలిపారు.

అప్పు దొరకట్లే..!

- పీఎన్‌బీ స్కామ్‌తో 'షాక్'లోకి బ్యాంకింగ్
- విరివిగా రుణాలిచ్చేందుకు వెనకడుగు
- నిబంధనలు మరింత కఠినంగా అమలు
- తనిఖీలు.. ఇతర సర్దుబాట్లతోనే బిజీబిజీ..
- రుణవితరణ ప్రాధాన్యత దాదాపు గాల్లోకి..
- కాసులందక కష్టాల్లో పరిశ్రామిక వర్గాలు

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వేదికగా అతిపెద్ద స్కామ్ వెలుగులోకి రావడంతో.. దేశీయ బ్యాంకింగ్ రంగం ఒక్కసారిగా భారీ కుదుపునకు గురైంది. పెద్దనోట్ల రద్దు కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న బ్యాంకింగ్ రంగాన్ని.. పీఎన్‌బీ స్కామ్ మరో షాక్‌కు గురి చేసింది. పీఎన్‌బీతో మొదలుకొని వివిధ బ్యాంకుల్లో వరుసగా పలు స్కామ్‌లు వెలుగులోకి వస్తుండడంతో.. దేశంలోని దాదాపు అన్ని బ్యాంకులు అప్రమత్తమయ్యాయి. తమతమ బ్యాంకుల్లో రుణ వితరణలపై ప్రత్యేక నజర్ పెట్టాయి. వ్యాపార విస్తరణను పక్కకు పెట్టి తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంపైనే దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా కంపెనీలకు ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కొత్త రుణాలు లభించడం కష్టతరంగా మారింది. ఫలితంగా కంపెనీలు తమ విస్తరణ ప్రణాళికలను కాసులు లేక వాయిదా వేసుకోవాలిసన పరిస్థితి నెలకొంది.

సర్దుబాట్లకే సరిపోతోంది...

పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో దేశంలో దాదాపు ఇప్పుడు ఏ బ్యాంకులో చూసినా.. అక్కడి సిబ్బంది గత రుణాల రికార్డులను పరిశీలిస్తుండడం, విజిలెన్స్ చెకింగ్‌లకు సన్నద్ధమవుతుండడం, రిపోర్టుల తయారీ, పాత రుణాలకు సంబంధించిన భద్రత అంశాల పరిశీలిన వాటి నివేదికల తయారీలో బిజీగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారు కొత్తగా రుణాల కోసం బ్యాంకుకు వచ్చే వారిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రాథమిక విచారణ పూర్తి చేసుకొని డబ్బులు చెల్లించే స్థాయిలో ఆగిపోయిన రుణాలను రిలీజ్ చేసేందుకు కూడా బ్యాంకు సిబ్బంది.. ఒకటికి వంద సార్లు తనిఖీలు చేసుకొని రుణ వితరణ జరుపుతున్నాయి. దీనికి తోడు తాజాగా విజిలెన్స్ కమిషన్ సూచనల మేరకు ఆయా బ్యాంకుల్లో ఎక్కువ కాలంగా పని చేస్తున్న సిబ్బందిని వేరే శాఖలకు బదిలీ చేసే ప్రక్రియ కూడా బ్యాంకింగ్ రంగంలో జోరుగా సాగుతోంది. దీంతో కొత్తగా వచ్చిన వారు కొత్త శాఖలోని పరిస్థితులను అర్థం చేసుకొనేందుకే ఎక్కువ సమయం పడుతోంది. దీనికి తోడు వారు కొత్త రుణాలను మంజూరు చేసే రిస్క్ చేయడం లేదు. ఫలితంగా ఏదో ఒక సాకుతో అధికారులు రుణ దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్టుగా కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగలకు వేల కోట్ల రుణాలిచ్చిన బ్యాంకులు.. నిజాయితీగా అప్పుకోసం వచ్చే వారిని వేధించడమేంటని ప్రశ్నిస్తున్నారు.



లక్ష్యాలు గాలిలోకి..

కుంభకోణాల నేపథ్యంలో అంతర్గత తనిఖీకి, భద్రతకే పెద్ద పీట వేస్తున్న బ్యాంకులు తమకు కేటాయించిన రుణ వితరణ లక్ష్యాలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. వివిధ రూపాల్లో బయటపడుతున్న స్కామ్‌లకు సంబంధించి.. హెడ్ ఆఫీస్ నుంచి రోజుకో సర్క్యులర్‌లు, సూచనలు, రిపోర్టులు కోరుతూ ఆర్డర్లు వస్తుండడంతో సిబ్బంది పుణ్య కాలమంతా ఈ పనులకే సరిపోతోందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి యేడాది మార్చి నెలలో ఎక్కువ రుణ వితరణ కోసం తాపత్రయంతో బిజీగా కనిపించే సిబ్బంది.. ఇప్పుడు కేవలం తమ సొంతింటిని చక్కదిద్దుకొనే పనులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ.. ఖాతాదారులను గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో విచారణ సంస్థలు ప్రభుత్వ బ్యాంకులతో పాటు ప్రయివేటు బ్యాంకుల ఎగ్జిక్యూటివ్‌లకు తాఖీదులు జారీ చేసిన నేపథ్యంలో ప్రయివేటు బ్యాంకుల్లో కూడా కుంభకోణం ప్రకంపనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ కూడా బ్యాంకులు అంతర్గత తనిఖీలు, విజిలెన్స్ చెక్స్ పెరగడం కనిపిస్తోంది. పీఎన్‌బీ స్కామ్ నేపథ్యం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడడంతో సిబ్బంది ఎక్కువగా లెక్కల రికార్డుల్లో మునిగిపోవడంతో సామాన్య ప్రజలతో పాటు పరిశ్రమ వర్గాల వారు ఎక్కువగా ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమ వర్గాల వారిపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

విగ్రహాల కూల్చివేత సహించం

బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

- దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలి : టీమాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మతోన్మాద దాడులు, విగ్రహాల కూల్చివేతలను ఎట్టి పరిస్థితులో సహించ బోమని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. సామాజికవేత్తల విగ్రహాలను కూల్చడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీమాస్ ఆధ్వర్యంలో కిల్లె గోపాల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'విగ్రహాలను కూల్చితే తప్పేంటి..? అనే రీతిలో ఆ రాష్ట్ర గవర్నర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కూడా అదే ధోరణితో మాట్లాడుతున్నారని విమర్శించారు. గో సంరక్షణ దళాల పేరుతో దళితులపై దాడి చేస్తుంటే 'నన్ను కాల్చమను' అని ప్రధాన మంత్రి వెల్లడించారని, ప్రస్తుతం త్రిపుర, కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలో విగ్రహాల ధ్వంసం జరుగుతుంటే నిర్లక్ష్య ధోరణితో ప్రధాని మాట్లాడుతున్నారని అన్నారు. విగ్రహాలు కూల్చేవారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని మాత్రం ప్రధాని చెప్పడం లేదన్నారు. సిద్ధాంతాలు, భావాల్లో తేడాలుంటే భావ సంఘర్షణ చేసుకోవాలి తప్పితే దాడుల పేరుతో హింసను ప్రోత్సహించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

టీమాస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అభ్యుదయ వాదులు, సామాజిక శక్తులపై జరుగుతున్న దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మనువాదాన్ని అమలు చేయడంలో భాగంగా ప్రణాళికా బద్ధంగా దాడులు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ వ్యవస్థ, పెట్టుబడిదారీ విధానాలను వ్యతిరేకించే వారిపైనే దాడి చేయడం పనిగా పెట్టుకుందన్నారు. త్రిపురలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 600 సీపీఐ(ఎం) కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఆక్రమించుకోవడం వంటి చర్యలకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లెనిన్, అంబేద్కర్, పెరియార్ రామస్వామి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. మహాత్మాగాంధీ విగ్రహాలనూ వదలడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఐక్యంగా దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ.. విగ్రహాల కూల్చివేత, దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగారెడ్డి, టీమాస్ రాష్ట్ర నాయకులు బహదూర్ శ్రీనివాస్, మన్నారం నాగరాజు, టీమాస్ స్టీరింగ్ కమిటీ నాయకులు జి.రాములు, చంద్రన్న, ఆర్.శ్రీరాం నాయక్, మహజన్ సమాజ్ నాయకులు కిషన్‌రెడ్డి, ఎంబీసీల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.ఆశయ్య, దళిత సంఘర్షణ సమితి నేషనల్ కోఆర్డినేటర్ నల్లా రాధాకృష్ణ, ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కందుల ఆనందరావు, తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట రాములు, పీఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు కిరణ్, మాజీ ఎమెల్యే మస్కు నర్సింహా, సామాజికవేత్త రేఖ, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు భూపాల్, జగదీష్ పాల్గొన్నారు.

మావోయిస్టులతో బోర్డర్ వార్

భారీ ఎన్‌కౌంటర్లన్నీ సరిహద్దు అవతలే • స్కెచ్ వెనుక రాష్ట్ర పోలీస్ పెద్దలు? • గడ్చిరోలి, బీజాపూర్ భారీ ఎన్‌కౌంటర్లలో ఇదే వ్యూహం

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సీపీఐ(మావోయిస్టు)ల కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచి వేస్తామంటున్న పోలీసు పెద్దలు... వారితో జరిగే భారీ ఎన్‌కౌంటర్లను రాష్ట్ర సరిహద్దులకు ఆవలే వ్యూహాత్మకంగా జరుపుతున్నారా? అందుకు తగిన రహస్య కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారా? తాజాగా రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాఉసూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌తో పాటు గతేడాది చివరిలో సరిహద్దుల్లోని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. గత మూడున్నరేండ్ల కాలంలో రాష్ట్రంలోపల రెండు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా, మరో రెండు రాష్ట్ర సరిహద్దుల్లో జరిగాయి. 2015 మార్చి 28న శృతి, సాగర్ అనే ఇద్దరు మావోయిస్టులను వరంగల్ జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చేయడంతో ఇది తెలంగాణ రాష్ట్రంలో తొలి సంఘటనగా రికార్డులకు ఎక్కింది. అనంతరం మావోయిస్టులతో జరిగిన రెండు భారీ ఎన్‌కౌంటర్లు కూడా రాష్ట్ర సరిహద్దులకు ఆవలే జరిగాయి. కాగా గతేడాది డిసెంబర్ 24వ తేదీన భద్రాద్రి జిల్లాలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మరణించినప్పటికీ వారంతా సీపీఐ(చంద్రపుల్లారెడ్డి) వర్గానికి చెందిన వారు. ఇదీ భారీ ఎన్‌కౌంటరే అయినప్పటికీ మరణించింది మావోయిస్టులు కాదు. పై పెచ్చు దాదాపు 15 ఏండ్ల క్రితమే పూర్తిగా రూపు మాసిందనుకున్న సీపీ గ్రూపు కార్యకలాపాలు తిరిగి మొదలు కావడంతో ఇలాంటి గ్రూపుల కార్యకలాపాలను మొగ్గలోనే తుంచి వేస్తామని హెచ్చరించడానికే రాష్ట్రంలోనే ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందనే వాదన ఉంది. ఇక మావోయిస్టులకు సంబంధించిన క్యాకలాపాలపై నిఘాను పెంచిన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు వీరి కదలికలను రాష్ట్ర సరిహద్దుల అవతలే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ఇటు ఒడిషా సరిహద్దుల్లోనే అడ్డుకునేలా పకడ్బందీ వ్యూహరచన చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, మహబూబాబాద్,ఆదిలాబాద్ జిల్లాల్లో మావోయిస్టుల కదలికలు సాగాయని, వారి సానుభూతి పరులతో పోస్టర్లు వేయించడం, కొన్ని చోట్ల సాయుధ మావోయిస్టులు ఇద్దరు ఇన్‌ఫార్మర్లను హత్య చేసి ట్రాక్టర్లను తగుల బెట్టడం వంటి ఘటనలకు పాల్పడటాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అయితేఇద్దరు ముగ్గురు సభ్యులతో కూడిన దళం ఈ ఘటనలకు పాల్పడిందని పేర్కొంటున్న అధికారులు భారీ సంఖ్యలో మాత్రం ఛత్తీస్‌గఢ్, లేదా మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి ఈ మూడేండ్ల కాలంలో అడుగు పెట్టలేదని తేల్చి చెబుతున్నారు. కాగా సరిహద్దుల్లోని దండకారణ్యంను స్థావరంగా చేసుకుని


(ఫైల్)

రాష్ట్రంలో తిరిగి పాగా వేయడానికి అనేక ప్రయత్నాలు మావోయిస్టుల నుంచి జరుగుతున్నాయని అంగీకరిస్తున్నారు. దీనికి సంబంధించి మావోయిస్టుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి దానికి ప్రతి వ్యూహాన్ని రచించి నిరోధించడంలో భాగంగానే బార్డర్ అవతలే భారీ ఎన్‌కౌంటర్లకు రహస్య వ్యూహరచన జరిగి అమలు ఉన్నతాధికారులు అమలు చేస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు. ఈ వ్యూహం ప్రకారమే గతతేడాది డిసెంబర్ 6న కాళేశ్వరం ప్రాజెక్టుకు దాదాపు 30 కి.మీ దూరంలోని గడ్చిరోలి జిల్లా సిరోంచిలో ఏడుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిందని అనుమానిస్తున్నారు. దీనికి ముందు పోలీస్ బాస్ ఆ ప్రాంతానికి వెళ్లి మహారాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించడాన్ని ఉదహరిస్తున్నారు. ఇక తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసు స్టేషన్‌కు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ ఉసూరు పీఎస్ పరిధిలో అగ్రనేత హరిభూషణ్ టార్గెట్‌గా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించారు. ఈ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఆపరేషన్‌లకు వ్యూహరచన, కార్యాచరణ జరిపింది. రాష్ట్ర గ్రేహౌండ్స్ దళాలే కావడం గమనార్హం. ఒక వేళ భారీ ఎన్‌కౌంటర్లు రాష్ట్రంలో జరిగితే మావోయిస్టుల బలం ఇక్కడ పెరిగిందనే సంకేతాలు జనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, దానిని నివారించడానికి బార్డర్ అవతలే రహస్య ఆపరేషన్‌లకు వ్యూహరచనను పోలీసు పెద్దలు చేసి అమలు చేస్తున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో సరిహద్దు రాష్ట్రాల పోలీసులు కూడా పాల్గొన్నారని పైకి చెబుతున్నప్పటికీ పూర్తిగా ఆపరేషన్ జరిగాకే వారికి ఆ క్రెడిట్ ఇస్తున్నామనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో తుపాకులు గర్జించని పరిస్థితిని తీసుకు వస్తామని రాష్ట్ర ఏలికలు చేసిన ప్రకటనలకు విలువ ఇవ్వడానికే ఈ వ్యూహ రచన జరిగిందని పోలీసు వర్గాలలోను గుసగుసలు సాగుతున్నాయి. కాగా చట్ట వ్యతిరేకులుగా గుర్తించిన మావోయిస్టులపై చర్యకు సంబంధించి పరిస్థితులకు అనుగుణంగా మా వ్యూహాలు ఉంటాయని , భద్రతా కారణాల దృష్ట్యా చెప్పలేమని ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి నవ తెలంగాణకు చెప్పారు.

మూడు రాష్ట్రాల నిఘా అధికారుల రహస్యభేటీ?

మావోయిస్టు అగ్రనేతల కదలికల పైనే ఆరా..

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి


మూడు నక్సల్ ప్రభావిత రాష్ట్రాలకు చెందిన యాంటీ నక్సలైట్ విభాగం నిఘా అధికారులు రెండు రోజుల కిందట రహస్యంగా సమావేశమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. అత్యంత కీలకంగా భావించే ఈ సమావేశంలో మావోయిస్టుల కదలికలకు సంబంధించిన పలు అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్టు తెలిసింది. గత రెండవ తేదీన రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉసూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులతో పాటు ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మరణించిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌కు పూర్తిగా వ్యూహ రచన చేసి అమలు జరిపింది రాష్ట్ర ఎస్‌ఐబీ, గ్రేహౌండ్స్ విభాగాలు కాగా ఇందుకు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు కూడా సహకరించినట్టు రాష్ట్ర పోలీసులు త అధికారులు ఆ సమయంలో ప్రకటించారు. తాము అసలు టార్గెట్ చేసిన మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ ఘటనా స్థలం నుంచి తప్పించుకోవడం పోలీసు ఉన్నతాధికారులకు మింగుడు పడటం లేదు.

తాజాగా హరిభూషణ్ తో పాటు మరో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతల కోసం రాష్ట్ర నిఘా అధికారులు సీరియస్‌గా దృష్టిని సారించినట్టు సమాచారం.

ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు చెందిన యాంటీ నక్సలైట్ విభాగాల నిఘా అధికారులతో రాష్ట్ర అధికారులు సమావేశమైనట్టు సమాచారం. ఈ సమావేశాన్ని ఎక్కడ జరిపిందనే విషయాన్ని కూడా అధికారులు అత్యంత గోప్యంగా ఉంచారని తెలిసింది.

ముఖ్యంగా అగ్రనేతల కదలికలపైనే ఎక్కువగా దృష్టిని నిలిపితే ఫలితాలు బాగా ఉంటాయని, దిశనిర్దేశం చేసే నాయకత్వ శ్రేణిని కట్టడి చేయగలిగితే కింది స్థాయి కేడర్ వ్యవస్థ కుప్ప కూలుతుందనే సూత్రంతోటే నిఘా అధికారుల సమన్వయం సమావేశం జరిగిందని తెలిసింది. అయితే సధారణంగా నక్సల్స్ ప్రబావిత రాష్ట్రాల నిఘా అధికారుల కో ఆర్డినేషన్ సమావేశాలు తరచుగా జరుగుతుంటాయని, ఇది అందులో భాగంగానే జరిగి ఉంటుందని ఒక సీనియర్‌అధికారి అన్నారు. కాని సాధారణ సమన్వయ సమావేశానికి ఈ సమావేశానికి చాలా తేడా ఉందని , కచ్చితమైన సమాచారంతోటే ఈ కీలక సమావేశం జరిగిందని విశ్వసనీయ సమాచారం.

జోష్
నవతెలంగాణ



వేగంగా మారుతున్న నేటి సామాజిక ప్రభావం వల్ల ఈ ఒత్తిడి లేని వారు, రాని వారు లేరంటే అతిశయోక్తి లేదు. స్కూల్ పిల్లల నుంచి ఆఫీసుకు పరుగులెత్తె పెద్దలు, జీవన సమరంలో అలసి సొలసిన వృద్ధుల వరకు ఈ ఒత్తిడి నుండి మినహాయింపు లేకపోగా, నేటి సమాజంలో ఇది ఒక మానసిక రుగ్మతగా మారి మనిషి మానసిక శారీరక ఆరోగ్యాలపై సవాలు చేస్తోంది! మానవ జీవనశైలిలోనే అనేకానేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి! దాని ఫలితమే దినదినాభివృద్ధిగా పెరుగుతున్నాయి ఈ ఒత్తిళ్లు. వృత్తిగా చేసే పనులకు వ్యక్తిగా చేసే పనులు మధ్య సామరస్యం లేకపోవటం ఒకటైతే, వ్యక్తిగా పెంచుకున్న, పెరుగుతున్న అవసరాలు కూడా ఈ ఒత్తిడికి దోహద పడుతున్నాయి. ఈ ఒత్తిడిని అదిగమిస్తే ఓటమికి చెక్ పెట్టేయొచ్చు.

ఓటమికి చెక్ పెట్టేద్దాం...

ప్రతిరోజూ చేయాల్సిన పనుల పరుగులో అందుకోవాల్సిన బస్సు మొదలు ట్రాఫిక్ జాములతో చేరవలసిన చోటుకు చేరేవరకు సాగే ఈ ఉద్వేగంలో మనసు ఒత్తిడికి గురి అవుతూ మనిషి శారీరక మానసిక ఆరోగ్యాల పై ప్రభావం చూపుతోంది. దీనికి తోడుగా పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా పెరగని ఆర్థిక వనరులు, అనవసరమైన పోటీతత్వాలతో ఇతరులతో పోల్చుకుంటూ పెంచుకునే అవసరాలు ఒత్తిడికి మూల కారణాలుగా మారుతున్నాయి. ఇంకా ఇతరత్రా అనేకానేక సామాజిక, సాంఘీక,ఆర్థిక కారణాలు ఈ ఒత్తిడి కారణాలుగా మారుతున్నాయి. ఇదే సందర్భంలో ముఖ్యంగా నేటి సమాజంలోని నిరుద్యోగ యువత బతుకుకు భరోసా కల్పించలేని చదువుల డిగ్రీలతో ఉద్యోగ అవకాశాలు లేక ఉద్యోగ అవకాశాలు రాక ఒత్తిడితో మానసిక సమతుల్యత కోల్పోతోంది.

ఈ ఒత్తిడి పిల్లలనుండి పెద్దలవరకు సర్వసాధారణమై Tensionble Diabetic, Blood Pressure, Gastric Ulcers, Nerves Disorders, అనేకానేక మానసిక సమస్యలకు కారణాలుగా మారుతూ మనశ్శాంతితో మనుగడ సాగించాల్సిన మానవ జీవితాలు మందులతో జీవితాన్ని లాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీవితంలో మానసిక సమతుల్యతతో జీవించాల్సిన పరిస్థితులు ఎప్పుడో చేజారిపోయాయి ఈ ఒత్తిడి మహమ్మారి పెద్దల సంగతి సరే చివరికి పిల్లల్ని సైతం వదలకుండా శరీరంలో ఒక్కొక భాగానికి ఒక్కొక్క మందు చొప్పున కడుపు నింపుతూ ' కష్టాల కలి కాలం ' అనే స్థితిలోకి దిగజారుస్తోంది.

ఈనాటి ఈ సామాజిక పరిణామాలలో ఈ ఒత్తిడి జీవితాలకు ఉపశమనాలు ఏమైనా ఉన్నాయా అంటే, మనకు మనంగా అనే భావన పెంచుకొనే ప్రయత్నం చేయాలి. సమాజంలో 'మనీ' విలువలు పెరుగుతూ మానవసంబంధాలు విచ్ఛిన్నం అవుతున్న ఈ దశలో కష్టంలో సుఖంలో తోడుగా, నీడగా, మనకంటూ ఓ నలుగురు ఆత్మీయులను సాధించాలి. దాదాపుగా నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు దాదాపు విచ్ఛిన్నమైనప్పటి నుండి ఈ ఒత్తిడి ఒక సమస్యగా మారింది. మన మనసులోని మాట మనలోనే ఉండి మనసులో ఒత్తిడి పెంచుతూ అనేకానేక మానసిక రుగ్మతలే కాదు ఒక్కొక్కసారి ఆత్మహత్యలకు కూడా పురి గొల్పుతోంది. సామాజిక పరిస్థితులలో జరిగే మార్పు చేర్పుల పట్ల అవగాహన పెంచుకుంటూ దానికి తగ్గ విచక్షణ తోనే మనకు మనంగా ఎలా ఉండాలనేది తెలుసుకోవాలి. అందుకే మనసు విప్పితే ప్రమోదం మనసు మూసుకుంటే ప్రమాదం. అందుకే మనకు నిజమైన ఆస్తులు ఇతరులతో చక్కటి సత్సంబంధాలు మనముందున్న ప్రతి సానుకూల అవకాశం ద్వారా ఒత్తిడికి దూరంగా జరిగే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా ఒత్తిడిలో కొన్ని ప్రయత్నాలు ఆచరించటం ద్వారా ఉపశమనం పొందే ప్రయత్నం చేయవచ్చు దానికి ఏం చేయాలి. సెల్ ఫోన్‌లోమాటలు తగ్గించి, కరస్పర్శతో చక్కటి మానవ సంబంధాల పెంపునకు కృషి చేయటం. మనసుకు దగ్గరైన వ్యక్తులతో మాట కలపటం చాలా అవసరం.పుస్తకం లేదా పేపర్ చదవటానికి ప్రయత్నం చేయటం అనవసర ఆలోచనల మళ్లింపు కోసం మానసిక ఉల్లాసం కలిగించే మ్యూజిక్ వినటం. మానసిక ప్రశాంతతలో భాగంగా ఉద్వేగాలకు అవకాశం లేని కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వటం బుల్లి తెర, పెద్దతెర మరియు నెట్ తెరలలోని ఉద్వేగ, ఉద్రేకాలకులోను చేసే కార్యక్రమాల పట్ల దూరంగా ఉండటం. ఎందుకంటే ఇటువంటి కార్యక్రమలు మానసిక స్థితిగతులపై ప్రగాఢమైన ప్రతికూల (Negetive Eliments) ప్రభావాలు చూపిస్తాయి. మంచి జ్ఞాపకాలకు సంబంధించి కుటుంబంలోని వ్యక్తులతో సంభాషణలు చేయడం వల్ల గత జ్ఞాపకాలలోని సానుకూలతలు (Postive Eliments) మనసుకు హాయిని కలుగజేస్తాయి. ఒత్తిడికి గురి చేసే కారణాల పరిష్కారానికి కుటుంబ సభ్యుల లేదా పెద్దల సలహాలు తీసుకోవటం. దీనివలన మనకు దొరకని పరిష్కారాలు వీరి అనుభవం ద్వారా పొందే అవకాశాలు ఉంటాయి. మానసిక భరోసా నిజంగానే ఆరోగ్యకరమైన జీవితానికి భరోసా! అవకాశమున్న ప్రతిసారి మౌనంగా మనల్ని మౌనంగా ప్రశాంతతతో పరిశీలించుకోవటం. మానసిక ప్రశాంతత కోసం మెడిటేషన్ తప్పనిసరి.దీనివలన ఒత్తిడి తగ్గే అవకాశమే కాదు ప్రశాంతతో మన సమస్యలకు మనమే సమాధానాలు కనుగొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. శారీరక మరియు మానసిక ఆరోగ్యాల కోసం ప్రతిరోజూ తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించటం. దీనివలన మెదడులోని రసాయనాల (న్యూరోట్రాన్స్ మీటర్స్) సమతుల్యత పెరుగుతుంది. చేయబోయే పనిపట్ల క్రమశిక్షణతో కూడిన ప్రాధాన్యాలు ఏర్పాటు చేసుకోవటం, ఏ పని ముందు ఏ పని తర్వాత అనే ప్రణాళిక వలన చేయబోయే పనులలో తత్తరపాటు ఉండదు. అనుకున్న పనులు సక్రమంగా సాగుతాయి. ఇక్కడ ఒత్తిడికి అవకాశం ఎక్కడ! ఒత్తిడికి సమయానికి మధ్య చాలా దగ్గర సంబంధం ఉంది సమయాన్ని ఏ విషయంలో నైనా సరే సక్రమంగా వినియోగించుకోవటం అంటేనే విజయం మన చేతిలోనే ఉన్నట్టు లెక్క?!



గతం కంటే కూడా ఈ ఒత్తిళ్ల బాధితుల సంఖ్యా దినదినాభివృద్ధిగా పెరుగుతూనే వుంది. ప్రస్తుత మానవ సమాజంలో పిల్లల నుండి పెద్దల వరకు ఎవరూ మినహాయింపు కాదు. మరి ఈ ఒత్తిళ్ల వైకుంఠపాళిలో ఓటమి ఎరుగని ప్రయాణంకోసం మానసిక భరోసా కార్యక్రమాలు విద్యార్థి దశనుండే నైతిక స్థైర్యం పెంచే పాఠ్యాంశాలు రావాలి. కుటుంబ వాతావరణా లలో కూడా ఖచ్చితమైన కొంత సమయం అందరూ కలిసి మెలిగే పరిస్థితులు పెరగాలి.

అదే సందర్భంలో ప్రభుత్వం బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ,శబ్దకాలుష్య నివారణ, వాతావరణంలో కాలుష్యాల నివారణ,నైతిక విలువలు లేని అనాచార కార్యక్రమాల పట్ల నియంత్రణ,ఉద్రేకం,ఉద్వేగాలతో మానసిక విచక్షణ కోల్పోయే బుల్లి తెరల, పెద్ద తెరల కార్యక్రమాల పట్ల నియంత్రణ అత్యంత అవసరం. వీటివలన జీవన ప్రమాణాలతో పాటు జీవిత సమతుల్యతలకు అవకాశముంటుంది. ఒత్తిడి లేని ప్రయాణంలో ఇక ఓటమికి చోటెక్కడ!



అమరనాథ్ జగర్లపూడి,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
9849545257

వలపు నానీలు

వహ్వా..వహ్వా

అటు చినుకు
ఇటు చినుకు
చిటపటల మధ్య
చిరు చెమట ముద్దు!

కాదంటే నీ పాదాల
కింద దాగుంటా,
నొప్పి నాకు తప్ప
నీకు తెలియకుండా!

నీ మాటలు
పూలై రాలుతుంటే,
నేను మట్టినై
నీ ఎదుట దోసిలి పట్టాను!



ఊపిరి మాత్రమే
తీసుకుంటున్న,
గుండెలోని నిన్ను
బతికించుకోడానికి!

నవ్వులను
అతికించుకుంటున్న,
నీవు రావని
తెలిసినప్పటినుంచి!

– పుట్టి గిరిధర్,
9491493170

ఆలింగనం!

ఆ క్షణం!
సీతాకోక చిలుక
లేత రెక్కలపై
రంగుల వలయంలా
మారిపోతాను!
పచ్చగా పరుచుకున్న
పచ్చిక కొసన
నీరెండకు మెరిసే
తుషార బిందువునౌతాను!
సముద్ర తీరంలో
ఆటుపోట్లకు ఎగిసిపడే



సమున్నత
కెరటమౌతాను!
చుక్కల పూలను
తలలో పెట్టుకున్న
ఆనందపు
ఆకాశాన్నైతాను!
నీ అనంతమైన
అద్భుతాలింగనంలో
నులివెచ్చని
నిశ్వాస మౌతాను!

-వెన్నెల సత్యం
షాద్ నగర్, రంగారెడ్డి జిల్లా
9440032210

'జోష్' తగ్గని డబ్‌స్మాష్

'డబ్‌స్మాష్' యూత్‌కి కనెక్ట్ అయి ఏండ్లు గడుస్తున్నా... ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. రోజు రోజుకూ డబ్‌స్మాష్ ఆప్స్ వస్తునే ఉన్నాయి. యూత్‌కి మరింత కనెక్ట్ అవుతున్నాయి. కొత్త కొత్త వెర్షన్లతో వస్తున్న డబ్‌స్మాష్ ఆప్స్ క్రేజ్ పెంచుతున్నాయి. పదిహేను సెకన్ల వీడియోలో ఏం చేయొచ్చో క్యాచ్ చేసి యూత్ అంతా తమ ప్రతిభను ఒలకబోస్తున్నారు. నచ్చిన డైలాగ్‌కి లిప్‌సింక్ ఇవ్వడం, మెచ్చిన పాటకు పల్లవి అందుకోవటం అంతేనా ఇవేమీ తోచకపోతే ముక్కూ, మూతి తిప్పుతు కొత్త కొత్త ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడం ఇలా తమలోని ప్రతిభను పదిహేను సెకన్ల వీడియోలో కుమ్మరిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా దునియాకి పరిచయం అవుతున్నారు. ఆపిల్, ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వాడుతున్న యూజర్ల కోసం ఇప్పుడు ఆన్‌లైన్‌లో బోలెడ్ డబ్‌స్మాస్ ఆప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా డబ్‌స్మాష్ చేసి సోసల్‌మీడియాలోకి వదిలామా... ఇంకా అంతే దానికి వచ్చే క్రేజ్ వేరు. ఒక సారి ట్రెండ్ అయితే మీ మాట మీరే వినరు. అవును మరి ఇప్పుడంతా యూత్ డబ్‌స్మాష్ మానియాలో మునిగి తేలుతోంది. ఈ డబ్‌స్మాష్‌తో యూట్యూబ్ స్టార్స్, సోషల్‌మీడియా స్టార్స్ అయిన ఫ్రెండ్స్ మీకు తెలిసే ఉంటారు కదూ!



టైప్స్ ఆఫ్ డబ్‌స్మాషర్స్ :
యాక్టింగ్‌లో ఒక్కొక్కరి స్టైల్ ఒకలా ఉంటుంది. డబ్‌స్మాష్‌లో వీరిచ్చే ఎక్స్‌ప్రెషన్‌ను బట్టి వీరు ఏ రకమో చెప్పొచ్చు. ఓవర్ ఎక్స్‌ప్రెషన్, ఎక్స్‌ప్రెషన్ లెస్ డబ్‌స్మాష్‌లలో ఒరిజిన్ డైలగ్‌కి వీరి హావాభావాలకు సంబంధమే ఉండదు. నాన్ సింక్ డబ్‌స్మాష్‌లో పెదాలు సింక్ అవ్వవు. ఓవరాక్షన్‌లో కొందరైతే మరీ ఎక్స్‌ట్రాగా డైలాగ్ చెప్పి వామ్మో అనిపిస్తారు. కపుల్ డబ్‌స్మాష్‌కి మంచి క్రేజ్ ఉంది. ఇద్దరు కలిసి డబ్‌స్మాష్ చేయటం, లేదా ఒక్కరే రెండు ఫ్రేమ్‌లలో ఉండి ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వటం టాలెంట్‌ని నిరూపిస్తుంది. ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో స్టైల్ ఉంది. కొందరైతే యాక్టింగ్ చేయామంటే జీవిస్తున్నారు. ఎమోషనల్ డైలాగ్స్‌ని ఎంచుకుని కంటతడి పెడుతున్నారు.

– వినో

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.

వాట్సాప్: 07660066469

e-mail : navatelangana.josh@gmail.com

ఫన్.కాం

అయ్యో పాపం

ఒళ్లంతా రక్తంతో ఉన్న పేషెంట్‌ను చూసి డాక్టర్
"ఏంటి ఏమైంది ఆక్సిడెంట్ హా "
పేషెంట్ : కాదంటి మా ఆవిడ కొట్టింది
డాక్టర్ : ఎందుకు ?
పేషెంట్ : నువ్వు మనిషివి కాదు అన్నందుకు
డాక్టర్ : అదేంటి భార్యను పట్టుకుని అలా అన్నావ్ మరి
పేషెంట్ : దేవతవు అనే లోపు ఉతికి ఆరేసింది సార్.



నాన్న చెప్పాడని

తండ్రి : ఏంట్రా నిల్చుని భోజనం చేస్తున్నావ్
కొడుకు : మీరే చెప్పారు కదా నాన్న.. భార్య సంపాదిస్తే కూర్చుని తినొద్దని.



హైటెక్ సలహా

భక్తుడు: స్వామి నేను చనిపోయిన తర్వాత నా సమాధి దగ్గర ఎక్కువ మంది ఉండలంటే ఏం చేయాలని స్వామి
స్వామి : అక్కడ ఫ్రీ వైఫై పెట్టు నాయన.

పని

భార్య: నేను ఏ పని మొదలుపెట్టినా ఆ పనిలో మునిగిపోతాను
భర్త : సరే అయితే... వెంటనే బావి తవ్వే పని మొదలెట్టచ్చుగా మరి.



మ్యూజిక్ విందామా

బోర్ కొడితే ఏం చేస్తారు ? ఒంటరిగా ఉంటే ఏం చేయా లనుకుం టారు ? బాధను మర్చిపోవడానికి మీరు చేసే ప్రయత్నం ఏంటి ? జాలీ హవర్‌ని ఎలా ఎంజాయ్ చేస్తారు? ఇలా మిమ్మల్ని ఎవరైనా అడిగితే అన్నికిటీ ఒకే సమాధానం " మ్యూజిక్ వినడం " అని చెపుతున్నారా.. అయితే మీకు గుడ్ హాబీస్ ఉన్నట్టే. అవును.. బాధను మర్చిపోవడానికైనా, ఆనందాన్ని ఆశ్వాదించడానికైనా, ప్రశాంతతను కోరుకోవడానికైన మ్యూజిక్ వినడం ది బెస్ట ఆప్షన్. మ్యూజిక్ అనేది ఒక అపూర్వ అనుభూతి. ఇది క్రియేటివిటీకి రెక్కలు తెప్పిస్తుంది. మనసుకు ఆనందాన్ని కల్గిస్తుంది. మన దినచర్యలో మ్యూజిక్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఉదయంపూట వాకింగ్ చేస్తున్నపుడు, దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్నపుడు మ్యూజిక్ వినడానికి అలవాటు పడి ఉంటారు.

మీరు జిమ్ చేస్తే మీలో మరితం ఉత్సాహం పెంచేందుకు ఒక మ్యూజిక్ అవసరం అవుతుంది. మీరు చికాకుగా ఉన్నపుడు రిలాక్స్ అవడానికి ఇంపైన సంగీతం ఉపయోగపడుతుంది.

చాలా మందికి మ్యూజిక్ వినడం హాబీగా ఉంటుంది. ఎలాంటి టెన్షన్ లో ఉన్నా.. కాస్త వినసొంపైన రాగాలు చెవిన పడితే.. హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు. పాటలు, మ్యూజిక్ మనసుకి ఓదార్పుని.. ఆహ్లాదాన్ని ఇస్తాయి. అలసట ఆమడదూరం పారిపోయేలా మ్యూజిక్ మ్యాజిక్ చేస్తుంది. సంగీతం వింటుంటే.. శరీరం కూడా.. ఉల్లాసంగా ఉం టుంది. ఇంతేనా.. మ్యూజిక్ వింటే.. ఇంకా ఎన్నో అమేజింగ్ బెన్ఫిట్స్ ఉన్నాయి.

15 నిమిషాల పాటు మ్యూజిక్ వినడం వల్ల మెదడులో డొపామైన అనే రసాయనం విడుదల అవుతుందటా. దీని వల్ల శరీరం ఉల్లాసంగా మారుతుంది. మనస్సులో సంతోషాన్ని రెట్టింపు చేస్తుంది. వాకింగ్, జాగింగ్ లేదా రన్నింగ్ చేసేటప్పుడు మ్యూజిక్ వినడం మంచి హాబిట్. ఇది బాడి కెపాసిటిని పెంచుతుంది. పరిగెత్తాలనే మీ ఉత్సాహానికి మ్యూజిక్ తోడైతే మరింత ఎక్కువ పరిగెత్తడానికి అవకాశం ఉంది. 30 ని[illegible] రిలాక్సేషన్‌తోపాటు మంచి నిద్ర కూడా వస్తుంది. అందుకే ఎక్కువ మంది నిద్రపోయే ముందు సాంగ్స్ వింటారు. పెయిన్ రిలీఫ్ కు మ్యూజిక్ వినడం బెటర్ ఆప్షన్. అది ఫిజికల్ పెయిన్ అయినా, లేదా మెంటల్ పెయిన్ అయినా సంగీతం వినడం ద్వారా ఆ నొప్పి నుంచి మన దృష్టి మల్లుతుంది.

మ్యూజిక్‌తో ఎన్నో అడ్వాన్‌టేజెస్ ఉన్నాయి. దీంతో పాటు కాస్త ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కాస్త రిలీఫ్ కోసం మ్యూజిక్ వింటే పర్లేదు కానీ దానికే అడిక్ట్ అయి తరచూ మ్యూజిక్ వినడం అలవాడు చేసుకుంటే ప్రమాదమే. రోడ్డుపై నడుస్తున్నపుడు, సిగ్నల్ క్రాస్ చేస్తునపుడు, డ్రైవింగ్ చేస్తున్నపుడు మ్యూజిక్ వినడం ప్రమాదకరం. నిద్రపోయే ముందు కూడా మ్యూజిక్‌ని 30 నుంచి 35 నిమిషాలు మాత్రమే మినండి అతిగా అయితే ప్రమాదం. ఒక్కో సారీ మనకు తెలియకుండానే నిద్రలోకి జారిపోతాం. అపుడు ఇయర్‌ఫోన్స్‌లో మ్యూజిక్ అలానే కొనసాగుతూనే ఉంటుంది. అది మన మెదడుపై, చెవులపై ప్రభావాన్ని చూపుతుంది. ఏదేమైనా మ్యూజిక్ వినడం ఒక అలవాటుగా ఉండాలి. మితి మీరితే నష్టాలను మనమే తె[illegible]ట్టు.



'సిగ్గుచేటు. మెన్స్ క్రికెటర్లు అత్యధికంగా రూ.7కోట్లు అందుకుంటున్నారు. కానీ అమ్మాయిలకు అత్యధికంగా రూ. 50 లక్షలే ఇస్తున్నారు. బీసీసీఐ ఇందుకు సిగ్గుపడాలి'

- ట్వీట్టర్‌లో వీరేంద్ర సెహ్వాగ్





సమాన గౌరవం ఏది?

బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టుల్లో అమ్మాయిలకు అన్యాయం

- మెన్స్ క్రికెటర్లకు అత్యధికంగా రూ. 7 కోట్లు
- అమ్మాయిలకు రూ. 50 లక్షలే

జయంత్ యాదవ్..భారత క్రికెట్ వీరాభిమానులకు సైతం ఓ పట్టాన గుర్తుండని ఆటగాడు. భారత్‌కు ఐదుసార్లే ఆడినా.. 2019 ప్రపంచకప్ ప్రణాళికలో భాగంగా బీసీసీఐ కాంట్రాక్టు జాబితాలో నిలిచాడు. అందుకు జయంత్ యాదవ్‌కు అందుతోన్న మొత్తం రూ. 100 లక్షలు.

మిథాలీరాజ్.. మహిళల క్రికెట్ దిగ్గజం. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు బాదిన రికార్డు సొంతం. భారత్‌కు 267 మ్యాచుల్లో ప్రాతినిథ్యం వహించింది. ఐదుసార్లు ప్రపంచకప్‌లో పోటీ పడింది. రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన జట్టులో సభ్యురాలు. మహిళల క్రికెట్ సచిన్ టెండూల్కర్‌గా గుర్తింపు. అయినా, బీసీసీఐ కాంట్రాక్టు జాబితాలో మిథాలీ రాజ్‌కు దక్కిన గౌరవం రూ. 50 లక్షలు.

మహిళల క్రికెట్‌కు ప్రాచుర్యం తీసుకొస్తామని చెబుతోన్న బీసీసీఐ.. కాంట్రాక్టుల్లో అమ్మాయిల పట్ల తీవ్ర వివక్ష చూపించారు. పాలకుల కమిటీ కనుసన్నల్లోనే కాంట్రాక్టులు ఖరారైనా అమ్మాయిలకు తగిన గౌరవం లభించలేదు. మెన్స్ క్రికెటర్లలో దిగువ విభాగం ఆటగాళ్లు అందుకునే మొత్తంలో సగం మాత్రమే టాప్ కేటగిరీలోని మహిళా క్రికెటర్లకు దక్కుతోంది.

నవతెలంగాణ క్రీడా విభాగం

సమాన పని, సమాన వేతనం. దీని కోసం అంతర్జాతీయ మహిళా సమాజం ఏండ్లుగా విరామం లేకుండా ఉద్యమిస్తోంధి. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో పురుష అథ్లెట్లకు నగదు బహుమానం ఎక్కువిచ్చి, మహిళా అథ్లెట్లకు తక్కువగా అందిస్తున్నారు. ఈ విషయంలో సెరెనా విలియమ్స్ సహా పలువురు క్రీడాకారిణీలు గళమెత్తారు. పురుషులతో సమానంగా మేమూ చెమటోడుస్తున్నాం, వారితో ముఖాముఖిలోనూ తలపడగల శక్తి సామర్థ్యాలు మా సొంతం. అయినా, నగదు పురస్కారాల విషయంలో వివక్ష ఎందుకు కొనసాగిస్తున్నారని నినదించారు. కానీ గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు, టెన్నిస్ సంఘం నుంచి స్పందన కరువైంది. ఇటీవల అన్ని గ్రాండ్‌స్లామ్‌లకు ప్రైజ్ మనీ భారీగా పెరిగినా.. పురుష, మహిళా విజేతల నగదు ప్రోత్సాహకంలోనూ వ్యత్యాసం అంతే భారీగా పెరిగింది. ఇక మన విషయానికొస్తే ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు బీసీసీఐ. ఇన్నాండ్లూ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాలతో పోల్చితే పురుష క్రికెటర్లకూ తక్కువ వేతనాలతోనే సరిపెట్టింది. కానీ మెన్స్ క్రికెటర్లు వేతనాల పెంపుపై గట్టిగా పోరాడారు. పాలకుల కమిటీతో పలు దఫాలు మాట్లాడి.. మంచి వేతన మొత్తాలను సాధించారు. కానీ అమ్మాయిలకు అలా జరుగలేదు. మెన్స్ క్రికెట్‌లో ఏ ప్లస్, ఏ, బి, సీ విభాగాల్లో వరుసగా 7, 5, 3, 1 కోట్ల రూపాయలు దక్కుతున్నాయి. ఇదే మహిళల క్రికెట్‌లో ఏ, బి, సీ విభాగాలకు వరుసగా రూ. 50 లక్షలు, రూ. 30 లక్షలు, రూ. 10 లక్షలు మాత్రమే ఇస్తున్నారు. 2016 సెప్టెంబర్‌తో కేంద్ర కాంట్రాక్టు ముగియగా.. విస్తృత చర్చల అనంతరం గత వారమే పాలకుల కమిటీ కేంద్ర కాంట్రాక్టుల జాబితా విడుదల చేసింది. ఇందులో మహిళా క్రికెటర్లకు జరిగిన అన్యాయంపై సోషల్ మీడియాలో బీసీసీఐపై తీవ్ర విమర్శలు రేకెత్తుతున్నాయి.

కనీస అవసరాలు తీరుతాయా? : ఆధునిక క్రికెట్‌లో ఆర్థిక అవసరాల ప్రాధాన్యత ఎంతో పెరిగింది. నాణ్యమైన కిట్, ప్రామాణిక సమతుల ఆహారం, ఫిట్‌నెస్ కోసం ఖర్చు తడిసి మోపెడవుతోంది. కానీ బీసీసీఐ వీటన్నింటిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. 2017 ప్రపంచకప్ ఫైనల్లోకి చేరినా.. ప్రకటించిన నగదు ప్రోత్సాహకం నుంచి ప్రస్తుత కాంట్రాక్టు వరకూ అన్నింటా వివక్ష అలాగే కొనసాగుతోంది. ఆస్ట్రేలియాలో కేంద్ర కాంట్రాక్టు దక్కించుకున్న మహిళా క్రికెటర్ల కనీస వేతనం రూ. 40 లక్షలు (గత సీజన్ వరకూ మన మెన్స్ క్రికెటర్ల కనీసం వేతనం). ఇక రాష్ట్ర సంఘాలు సైతం అమ్మాయిలకు కాంట్రాక్టు ఇస్తున్నాయి. రాష్ట్ర అసోసియేషన్ తరపున ఆసీస్ అమ్మాయిలకు లభిస్తోన్న కనీస వార్షిక వేతనం రూ. 10 లక్షలు. కానీ మన దగ్గర పరిస్థితి మరోలా ఉంది. రాష్ట్ర సంఘాలు కాంట్రాక్టులు ఇవ్వటం గురించి పక్కనపెడితే, మ్యాచుల నిర్వహణే మర్చిపోయారు. మహిళా క్రికెటర్లు దండిగా ఉన్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గతేడాది కేవలం ఎనిమిది వన్డేల్లోనే పాల్గొన్నది. అన్ని మ్యాచుల్లో క్రికెటర్‌కు మ్యాచ్ ఫీజు రూపంలో లభించేదీ తక్కువే. మహిళా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజును రూ. 12,500 (సీనియర్ క్రికెట్), రూ. 6250 (జూనియర్ క్రికెట్)గా నిర్ణయిస్తే.. మెన్స్ క్రికెటర్లకు మాత్రం రూ. 35000 (సీనియర్ లెవల్), రూ. 17500 (జూనియర్ లెవల్)గా ఇస్తున్నారు. అంటే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సీనియర్ మహిళా క్రికెటర్ల కంటే జూనియర్ స్థాయిలో తలపడే కుర్ర క్రికెటర్లకే మ్యాచ్ ఫీజు ఎక్కువ. మెన్స్ క్రికెట్ సర్క్యూట్ తీరిక లేని షెడ్యూల్‌తో గడుపుతోంది. ఇదే సమయంలో మహిళా క్రికెట్‌లో కనీస మ్యాచులు కరువయ్యాయి. దీంతో కనీసం మ్యాచ్ ఫీజు రూపంలోనే కొంత మొత్తం దక్కించుకునే అవకాశం అమ్మాయిలకు లేకుండా పోయింది. జాతీయ జట్టుతో పాటు ఐపీఎల్ కాంట్రాక్టులతో మెన్స్ క్రికెటర్లు కోట్లలో మునిగితేలుతున్నారు. ఒక్కసారి కూడా జాతీయ జట్టుకు ఆడని ఆటగాళ్లు సైతం రూ. కోట్లు ఆర్జిస్తున్నారు. కానీ మహిళా క్రికెటర్లకు ఐపీఎల్ అవకాశం ఎలాగూ లేదు, బోర్డు ఆదరణ అంతకంటే లేదు.

ఇప్పుడైనా కండ్లు తెరవాలి : మిథాలీరాజ్, జులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్.. ప్రపంచ క్రికెట్‌కు భారత్ అందించిన ఆణిముత్యాలు. క్రికెటింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థి జట్ల అభినందనలు సైతం అందుకుంటోన్న మన అమ్మాయిలకు సొంత బోర్డు నుంచి ఆదరణ కరువైంది. సుప్రీంకోర్టు నియమిత పాలకుల కమిటీ కనుసన్నల్లో బీసీసీఐ నడుస్తోన్న వేళ.. అమ్మాయిలకు న్యాయం జరుగుతుందని భావించారు. పాలకులు మారినా పద్ధతులు అవే అన్నట్టుగా అమ్మాయిలపై శీతకన్ను కొనసాగించారు. ప్రపంచ క్రికెట్‌లో మేటీ మహిళా క్రికెటర్లకు భారత క్రికెట్ బోర్డు అందిస్తోన్నది కేవలం రూ.50 లక్షలు. కానీ ఇదే సమయంలో ఐపీఎల్ ఆరంభోత్సవ వేడుకల కోసం రూ 50-30 కోట్లు ఖర్చుపెట్టేందుకు బోర్డు వెనుకాడటం లేదు. మహిళా క్రికెటర్లకు స్పాన్సర్లు లేరనే కుంటిసాకుతో మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజు, వార్షిక వేతనాల్లో వివక్ష చూపిస్తోన్న బీసీసీఐ.. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా ఇంకా వ్యాపార సంస్థగానే వ్యవహరిస్తోంది. వివాద సమయాల్లో బీసీసీఐ తరచుగా వాడే 'క్రీడాస్ఫూర్తి, సమానత్వం'లను ఇక్కడ అమ్మాయిల విషయంలో బోర్డు తనకు తాను చెప్పుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రదర్శన చేస్తోన్న అమ్మాయిల జట్టుకు సైతం మెన్స్ క్రికెటర్లతో సమానంగా వేతనాలు దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

సెలక్టర్ల ఎదురుచూపులు

- కొత్త కాంట్రాక్టు వెల్లడించని బీసీసీఐ
- ఐదు నెలలుగా సెలక్షన్ కమిటీ నిరీక్షణ




నవతెలంగాణ-ముంబయి

భారత క్రికెట్ బోర్డు 2016 తర్వాత వార్షిక సర్వ సభ్య సమావేశం కానందున.. దాని పరిణామాలు పలు రూపాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. నిరుడు సెప్టెంబర్‌లో ఆటగాళ్ల కేంద్ర కాంట్రాక్టు గడువు ముగిసినా.. ఇటీవలే బీసీసీఐ నూతన కాంట్రాక్టులు ప్రకటించింది. కాంట్రాక్టు లేకుండా ఆటగాళ్లకు బీమా కల్పించటం సాధ్యపడని కారణంగా.. పాలకుల కమిటీ స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నదని వినోద్ రాయ్ తెలిపారు. అయితే, ఐదు మాసాలుగా కొత్త కాంట్రాక్టు కోసం ఎదురుచూస్తోన్న సెలక్షన్ కమిటీ సభ్యుల నిరీక్షణకు పాలకుల కమిటీ తెరదించలేదు. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీలో దేవాంగ్ గాంధీ, సరందీప్ సింగ్‌లు సభ్యులుగా కొనసాగుతున్నారు. సెలక్షన్ కమిటీని ఐదుగురు సభ్యుల నుంచి ముగ్గురికి కుదించాలని లోధా కమిటీ సూచించటంతో.. జతిన్ పరంజ్‌పె, గగన్ ఖోడాలు కమిటీకి దూరమయ్యారు. ఖోడా, జతిన్ సేవలు అవసరం లేకపోయినా బీసీసీఐ వారికి ఇంకా చెల్లింపులు జరుపుతోందని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. 'ఆటగాళ్ల కాంట్రాక్టులను సైతం బోర్డు ఏజీఎం ఆమోదించాలి. కానీ ఆటగాళ్ల అవసరాలకు పెద్దపీట వేసి, నిబంధనలను పక్కనపెట్టి పాలకుల కమిటీ నిర్ణయం తీసుకున్నది. అదే వైఖరి సెలక్షన్ కమిటీ విషయంలో ఎందుకు చూపకూడదు? ఆటగాళ్లకు ఇచ్చిన ప్రాధాన్యత వారిని ఎంపిక చేసిన వారికి ఇవ్వరా? అని బీసీసీఐ ఉన్నతాధికారి అన్నారు. సెలక్షన్ కమిటీకి సంబంధించి చాలా విషయాలపై స్పష్టత ఇవాల్సి ఉంది. ఖోడా, జతిన్‌ల సేవలు వినియోగించకపోయినా బోర్డు వారికి వేతనం ఇస్తోంది. లోధా కమిటీ సెలక్షన్ కమిటీని ముగ్గురికి కుదించింది. దీనిపై అందరూ వ్యతిరేకించారు. ఎమ్మెస్కే ప్రసాద్ సైతం సెలక్షన్ కమిటీలో ఐదుగురు సభ్యులు ఉండాల్సిన అవసరంపై నొక్కిచెప్పాడు. కానీ వీటిపై ఇంకా ఎటువంటి స్పష్టత ఇవ్వటం లేదని ఆయన తెలిపాడు. ఇదిలా ఉండగా జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్ పదవికి వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేసిన నేపథ్యంలో దీనికోసం పలువురు మాజీ క్రికెటర్లు పావులు కదుపుతున్నారు. బోర్డు ఉన్నతాధికారులతో లాబీయింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాజీ క్రికెటర్ గ్యానేంద్ర పాండేను జూనియర్ చీఫ్ సెలక్టర్‌గా నియమించే అవకాశం ఉందని సమాచారం. కానీ ఈసారి ఈ పదవి సౌత్ జోన్‌కు చెందాల్సి ఉండటంతో.. హేమాంగ్ బదాని, సుబ్రమణియమ్ బద్రినాథ్‌లు సైతం అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారని సమాచారం.

బంగ్లా భళా!

- శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో విజయం
- ముక్కోణపు టీ20 సిరీస్



కొలంబో : ముక్కోణపు సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్, శ్రీలంకల మధ్య జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బోణీ చేసింది. లంకకు పోటీనివ్వగలరా అనుకున్న జట్టు భారీ లక్ష్యాన్ని ఛేదించి మరీ విజయాన్ని సొంతం చేసుకున్నది. టాస్ ఓడిన శ్రీలంక బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 214 పరుగులు సాధించింది. కుశాల్ పెరీరా (74), కుశాల్ మెండిస్ (57) రాణించారు. అంతకుముందు దనుష్క గుణతిలక (26) సైతం దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. క్లీన్‌బౌల్డ్ అయిన దనుష్క పెవిలియన్ బాట పట్టాడు. ఆపై కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరాలు వరుస బౌండరీలతో విరుచుకుపడ్డారు. పెరీరా వెనుదిరగగా చివర్లో ఉపుల్ తరంగ (32) చెలరేగడంతో శ్రీలంక ప్రత్యర్థి ముందు 215 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్ధేశించగలిగింది. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ రహ్మాన్ మూడు వికెట్లు, మహ్మదుల్లా రెండు వికెట్లు, తస్కిన్ అహ్మద్ ఓ వికెట్ పడగొట్టారు. ఇక ఛేదనలో బంగ్లా ఓపెనర్లు ధాటిగా ఆడారు. తమీమ్ ఇక్బాల్ (47), లిటన్ దాస్ (43) స్కోరును పరుగులు పెట్టించారు. దాస్ వికెట్ కూల్చిన నువాన్ ప్రదీప్.. దాస్ నిష్క్రమణతో క్రీజులోకొచ్చిన సౌమ్య సర్కార్ (24)ను పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో ముష్ఫికర్ రహీమ్ (72 నాటౌట్) చెలరేగాడు. కెప్టెన్ మహ్మదుల్లా (20) కాసేపు తోడుగా నిలువగా ఛేదనలో లంక బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఉత్కంఠ రేకెత్తించిన పోరులో అజేయ అర్ధ శతకంతో బంగ్లాదేశ్‌ను గెలిపించాడు.

ఇంగ్లాండ్‌దే సిరీస్

- నిర్ణాయక వన్డేలో ఏడు వికెట్ల తేడాతో కివీస్‌పై విజయం



క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ 3-2తో ఇంగ్లాండ్ సొంతమైంది. సిరీస్ నిర్ణాయక ఐదో వన్డేలో ఇంగ్లాండ్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, జానీ బెయిర్‌స్టో (104), అలెక్స్ హేల్స్ (61) రాణించారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్... ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి మరో బంతి మిగిలుండగానే 223 పరుగులకు కుప్ప కూలింది. ఛేదనలో ఇంగ్లాండ్ ఓపెనర్లు బెయిర్‌స్టో, అలెక్స్‌లు నిష్క్రమించిన అనంతరం జో రూట్ (23 నాటౌట్), బెన్ స్టోక్స్ (26 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. కివీ బౌలర్లను చెడుగుడాడిన ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ 32.4 ఓవర్లలోనే 229 పరుగులు బాదేశారు. సిరీస్‌లో పది వికెట్లు పడగొట్టిన క్రిస్ వోక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' దక్కింది.

రాణించిన డివిలియర్స్

ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా రెండో టెస్టు

పోర్ట్ ఎలిజబెత్ : ఏబీ డివిలియర్స్ (74 బ్యాటింగ్) అర్థ శతకంతో రాణించటంతో కంగారూలతో రెండో టెస్టులో సఫారీలు 20 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కొనసాగుతున్నారు. ఓవర్నైట్ స్కోరు 31/9 రెండో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 263 పరుగులతో ఉన్నది. డీన్ ఎల్గార్ (57), హషీమ్ ఆమ్లా (56)లు హాఫ్ సెంచరీలతో మెరిశారు. తొలి టెస్టులో మైదానంలో దురుసుగా ప్రవర్తించిన రబాడ ఐసీసీ లెవల్ 2 తప్పిదానికి విచారణ ఎదుర్కోనున్నాడు. ఆరోపణ నిర్ధారణ అయితే అతడు రెండు టెస్టు మ్యాచుల నిషేధానికి గురి కానున్నాడు.

అజ్లాన్ షా హాకీ టోర్నీలో హాకీ ఇండియా ఐదో స్థానంతో సరిపెట్టుకున్నది. ఐదో స్థానం కోసం ఐర్లాండ్‌తో జరిగిన పోటీలో భారత్ 4-1తో గెలుపొందింది. భారత్ తరఫున వరుణ్ కుమార్ రెండు గోల్స్ సాధించగా.. గుర్జంత్ సింగ్ ఓ గోల్ కొట్టాడు. సీనియర్ మిడ్‌ఫీల్డర్ సర్దార్ సింగ్ సారథ్యంలో నాల్గోసారి అజ్లాన్ షా హాకీకి వెళ్లిన టీమ్ ఇండియా ఈసారి పతకం లేకుండానే నిష్క్రమించింది.



కరాటే క్రీడాకారిణికి

సాట్స్ అభినందన

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

యునైటెడ్ షోటోకాన్ కరాటే ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుంచి 4వరకు విశాఖపట్నంలో జరిగిన రెండో అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి జి హర్షిక బంగారు పతకాన్ని సాధించింది. మే 13, 14 తేదీల్లో నేపాల్ దేశంలోని ఖాట్మండ్‌లో జరిగే అంతర్జాతీయ కరాటే వాడో ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా హర్షికను శనివారం సాట్స్ కార్యాలయంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఆమె వెంట తల్లిదండ్రులు సరిత, లక్ష్మణ్, కరాటే కోచ్ కె సుధాకర్ ఉన్నారు.

ముగురుజకు షాక్

- సచియా చేతిలో 1-2 తో ఓటమి
- తొలి రౌండ్లో యుకీ బాంబ్రీ గెలుపు
- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్



ఇండియన్ వెల్స్ (అమెరికా) : వింబుల్డన్ చాంపియన్, స్పెయిన్ భామ గార్బినె ముగురజకు ఇండియన్ వెల్స్ మాస్టర్స్‌లో ఊహించని ఓటమి ఎదురైంది. మూడో సీడ్ ముగురుజ రెండో రౌండ్లోనే ఓడి ఇంటి ముఖం పట్టింది. ప్రపంచ 100వ ర్యాంకర్, లోకల్ అమ్మాయి సచియా వికరీ చేతిలో 6-2, 5-7, 1-6తో పరాజయం చవి చూసింది ముగురుజ. తొలి సెట్ 6-2తో నెగ్గి శుభారంభం చేసిన ముగురుజ రెండో సెట్లో తడబడింది. గంటకు పైగా సాగిన హోరాహోరీ గేమ్‌లో ఓ దశలో 4-4తో నిలిచినా ప్రత్యర్థిని కట్టడి చేయలేకపోయింది. 5-7తో ఓడి పోరు నిర్ణాయక మూడో సెట్‌కు వెళ్లగా అక్కడా ముగురుజ చతికిల పడింది. ఒకే ఒక్క పాయింట్ సాధించగల్గింది. 1-6తో సెట్‌నూ మ్యాచ్‌నూ ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సిమోన హాలెప్, ప్లిస్కోవా, క్విటోవాలు తదుపరి రౌండ్లలో అడుగుపెట్టారు. పురుషుల సింగిల్స్‌లో సర్క్యూట్‌లో భారత అగ్ర శ్రేణి ఆటగాడు యుకీ బాంబ్రీ ముందంజ. అర్హత పోరులో సహచర ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్‌ను వరుస సెట్లలో ఓడించి ప్రధాన టోర్నీ చేరిన యుకీ.. తొలి రౌండ్ మ్యాచునూ రెండు సెట్లలోనే ముగించాడు. తనకన్నా మెరుగైన ర్యాంకర్, ఫ్రాన్స్ ఆటగాడు నికోలస్ మహుత్‌ను 7-5, 6-3తో ఓడించాడు. రెండో రౌండ్లో యుకీకి కఠిన ప్రత్యర్థి ఎదురవనున్నాడు. తొమ్మిదో సీడ్ లూకాస్ పౌలీ (ఫ్రాన్స్)తో యుకీ నేడు తలపడనున్నాడు. బై లభించటంతో నేరుగా రెండో రౌండ్లో ఆడనున్న ఫెడరర్, దిమిత్రోవ్‌లు నేడు తమ తొలి పోరులో అన్‌సీడెడ్ ఆటగాళ్లను ఎదుర్కోనున్నారు. పురుషుల డబుల్స్‌లో బోపన్న జోడీ, లోకల్ స్టార్ శామ్ ఖురే జంటతో తలపడనున్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Privat[illegible] Limit[illegible], Pri[illegible]ed At [illegible] Bh[illegible]an [illegible] Floor, Plot No. 2[illegible]/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21[illegible]1, Aza[illegible]ab[illegible] N[illegible]r R[illegible] K[illegible]lya[illegible]a M[illegible]nda[illegible]pa[illegible], B[illegible]agh[illegible]ngampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.